thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 353 కరీంనగర్ శుక్రవారం, 28 ఫిబ్రవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఎక్కడ దాక్కున్నా పట్టిచ్చే 'భారత్ పోల్'

న్యూఢిల్లీ : మనదేశంలోని దర్యాప్తు సంస్థలు, రాష్ట్ర పోలీసు విభాగాల మధ్య సమన్వయానికి కీలకంగా దోహదపడే 'భారత్ పోల్' పోర్టల్‌ను కేంద్ర హెూం మంత్రి అమిత్‌షా ఇక్కడ ఆవిష్కరిం చారు. కేసుల విషయంలో అంతర్జాతీయంగా పనిచేస్తున్న మన దర్యాప్తు సంస్థల పనిని ఈ పోర్టల్ సులభతరం చేస్తుందని, ఇంటర్ పోల్ సహకారం వేగంగా అందుకోగలుగుతామని ఆయన అన్నా రు. 'భారత్ పోల్'ను సీబీఐ రూపొందించింది. "అంతర్జాతీయ పోలీసుల సహకారం ఇప్పటిదాకా సీబీఐ మాత్రమే తీసుకుంటోం ది. 'భారత్ పోల్' రాకతో మన దేశానికి చెందిన అన్నీ దర్యాప్తు సంస్థలూ, చివరకు రాష్ట్ర పోలీసు విభాగాలు సైతం ఇంటర్‌పోల్ సాయం తీసుకొనగలుగుతాయి. అంతర్జాతీయంగా మనదేశం చేపట్టే విచారణ ప్రక్రియను కొత్త శకంలోకి ఇది నడిపిస్తుంది. వేర్వేరు సంస్థల మధ్య సమన్వయం, సంబంధాల్లో తలెత్తుతున్న సమస్యలు తొలగించి..నేరగాళ్ల కట్టడికి బాగా పనిచేస్తుంది" అని అమిత్‌షా అన్నారు.

## 'రేవంత్ రెడ్డి ధన దాహం వల్లనే ఎస్ఎల్‌బీసీలో 8 మంది ప్రాణాలు గాల్లో'




ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంపై రేవంత్ రెడ్డి తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాడని.. దీనికితోడు చిట్‌చాట్‌ల పేరిట చిల్లరమల్లర వ్యాఖ్యలు చేయడం సరికాదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ కొట్టిపారేశారు. రేవంత్ రెడ్డి ధనదాహం వల్లనే ఎస్ఎల్‌బీసీఓ 8 మంది కార్మికుల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయని ఆరోపించారు. తన అసమర్ధతను.. పాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంపై నెపం నెడుతున్నారని విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంపై చిట్‌చాట్‌లో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై గురువారం కేటీఆర్ స్పందించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి మంత్రి కేటీఆర్ విరుచుకుపడ్డారు. ఆడలేక మద్దెల ఓడు అన్నట్లు ఉన్నది రేవంత్ రెడ్డి వ్యవహారం అని ఎద్దేవా చేశారు. జీఎస్ఐ, ఇంజనీరింగ్ నిపుణులు వంటి సంస్థలతో సంప్రదించకుండానే ఆగిపోయిన ప్రాజెక్టుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా అవినీతి సొమ్ముల కోసం లాలూచీ పడి పాత యంత్రాలతో ప్రారంభించారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి ధన దాహం వల్లనే ఈరోజు 8 మంది కార్మికులు ప్రమాదంలో చిక్కుకున్నారని తెలిపారు. కార్మికులు బతికున్నారో లేదో అనే ఆందోళనకరమైన పరిస్థితి నెలకొందని.. దీనికి పూర్తి బాధ్యత రేవంత్ రెడ్డిదే అని మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. 'కార్మికులను రక్షించాల్సింది పోయి బ్లేమ్ గేమ్ రేవంత్ రెడ్డి ప్రారంభించారు. దేవుడిచ్చిన ముఖ్యమంత్రి అవకాశాన్ని వాడుకొని ప్రజలకు మంచి చేయాల్సింది పోయి రాజకీయాలకు పాల్పడుతున్నారు' అని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రిగా అవకాశం రావడంతో తెలంగాణకు మంచి జరిగేలా ప్రజలకు మంచి జరిగేలా వ్యవహరించాలని సూచిస్తున్నట్లు రేవంత్ రెడ్డికి కేటీఆర్ హితవు పలికారు. ఛీఫ్ మినిస్టర్‌గా మాట్లాడాలి కానీ ఒక చీప్ మినిస్టర్‌గా మాట్లాడవద్దని రేవంత్ రెడ్డికి సూచిస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. పరిపాలన చేతకాకనే రాష్ట్రంలో జరుగుతున్న మరణాలపైన ఇతరుల పేరును ప్రస్తావిస్తున్నారని రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'అధికారంలో తానున్నది మరిచిపోయి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కావాల్సిన విచారణలు దర్యాప్తులు చేసుకోవచ్చు' అని కేటీఆర్ సవాల్ చేశారు. 'టైంపాస్ చేసేందుకు పరిపాలనను పక్కనపెట్టి చేతకాకనే ఇవన్నీ మాట్లాడుతున్నారు. అరచేతిలో స్వర్గం చూపించేలా ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాకనే ప్రజల టెన్షన్ డైవర్షన్ కోసం రేవంత్ రెడ్డి ఇవన్నీ మాట్లాడుతున్నారు. 15 నెలల నుంచి కేవలం ప్రజల అటెన్షన్ డైవర్షన్ పేరుతో ఆటలాడుతున్న రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టారు. రూ.6,500 కోట్లు కేవలం వడ్డీ లెక్క అయిపోతుందంటూ రాష్ట్ర ప్రజలను, దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారు. రేవంత్ రెడ్డికి ఆర్థిక వ్యవస్థ గురించి అవగాహన లేదు' అని రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు.



## ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నట్లు సీఎం నిరూపించాలి

దిల్లీ: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన విమర్శలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. తాను ఏదైనా ప్రాజెక్టును అడ్డుకున్నట్లు నిరూపించాలని సవాల్ విసిరారు. హైదరాబాద్ మెట్రో రెండోదశ ప్రాజెక్టును కేంద్ర క్యాబినెట్ వద్దకు వెళ్లకుండా కిషన్‌రెడ్డి అడ్డుకున్నారని రేవంత్ వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో దిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. "సీఎంగా ఉన్న వ్యక్తి అవగాహనా రాహిత్యంతో మాట్లాడుతున్నారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకి సీఎం కావడం రాష్ట్ర ప్రజల దురదృష్టం. కేంద్ర ప్రభుత్వానికి ఒక విధానం ఉంటుంది.. దానికి అనుగుణంగానే వ్యవహరిస్తారు. రేవంత్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతూ దుందుడుకుగా వ్యవహరిస్తున్నారు. కేంద్రం నుంచి డబ్బులు తెచ్చి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానని ఎన్నికల్లో చెప్పారా?" అని కిషన్‌రెడ్డి నిలదీశారు.

# పోలింగ్ ముగిసింది.. గెలిచేదెవరు..?

## మార్చి 3న తేలనున్న అభ్యర్థుల భవితవ్యం!




హైదరాబాద్, ఫిబ్రవరి 27: తెలంగాణలో రెండు ఉపాధ్యాయ, ఒక పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ ముగిసింది. మార్చి3న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను లెక్కిస్తారు. బ్యాలెట్ పద్ధతిలో పోలింగ్ నిర్వహించడంతో ఫలితాలు వెల్లడించడానికి రెండు నుంచి మూడు రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు హెూరాహెూరీ ప్రచారం నిర్వహించారు. మొత్తం మూడు స్థానాలకు పోలింగ్ జరిగినప్పటికీ.. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం అందరిదృష్టి ఆకర్షిస్తోంది. మొత్తం 56 మంది అభ్యర్థులు ఇక్కడి నుంచి పోటీలో ఉన్నప్పటికీ కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీతో పాటు మరో ఇండిపెండెంట్ అభ్యర్థి మధ్య తీవ్రపోటీ జరిగింది. ఎవరు గెలిచినా మూడో ప్రాధాన్యత ఓటుతోనే గెలిచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 56 మంది అభ్యర్థులు ఉన్నా.. నాలుగు, మూడు స్థానాల్లో నిలిచే అభ్యర్థుల ఎలిమినేషన్ ప్రక్రియతోనే విజేత తేలే అవకాశం ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఇంతకీ పోలింగ్ ముగిసింది. విజేత ఎవరనేదానిపై ఎవరి అంచనాలు వారివి. ఓటింగ్ సరళి ఆధారంగా ఎవరికి విజయవకాశాలు ఎక్కువగా ఉన్నాయో తెలుసుకుందాం.

**గెలుపు అవకాశాలు ఎవరికంటే..** ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ప్రారంభమైనప్పటినుంచి బీజేపీ, కాంగ్రెస్ హెూరాహెూరీ ప్రచారం నిర్వహించింది. బీజేపీ అభ్యర్థిగా అంజిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా నరేందర్ రెడ్డి పోటీచేశారు. ఈ ఇద్దరూ విజయంపై ధీమాగా ఉన్నారు. పార్టీ కేడర్‌తో పాటు ఆర్థికంగా బలవంతులు కావడంతో గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కేంద్రంలో అధికారంలో ఉండటం తమకు కలిసొస్తుందని బీజేపీ, రాష్ట్రంలో అధికారంలో ఉండటం తమకు కలిసొస్తుందని కాంగ్రెస్ అంచనా వేస్తున్నాయి. అదే సమయంలో బీఎస్పీ మద్దతుతో పోటీలో ఉన్న ప్రసన్న హరికృష్ణ సైతం పట్టభద్రులు తనను గెలిపిస్తారనే విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. పోలింగ్ ముగిసినప్పటికీ కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పరిధిలో గ్రాడ్యుయేట్ ఓటర్లు ఎవరివైపు మొగ్గుచూపారనేది ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది. తుది ఫలితం ఎలాఉన్నా.. మొదటి మూడు స్థానాల్లో మాత్రం నరేందర్ రెడ్డి, అంజిరెడ్డి, ప్రసన్న హరికృష్ణ నిలిచే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ ముగ్గురిలో రెండు, మూడు ప్రాధాన్యత ఓట్లు అధికంగా పొందిన అభ్యర్థి విజయం సాధించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు ఈ ఎన్నికల్లో బీసీ వాదం గట్టిగా వినిపించింది. బీసీ సామాజికవర్గానికి చెందిన పట్టభద్రులు తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని ఎమ్మెల్సీగా గెలిపించుకోవాలని డిసైడ్ అయితే మాత్రం ప్రసన్న హరికృష్ణ మొదటి లేదా రెండో ప్రాధాన్యత ఓటుతో గెలిచే అవకాశం ఉంది. కాంగ్రెస్ టికెట్ ఆశించి.. టికెట్ రాకపోవడంతో బీఎస్పీ నుంచి బరిలోకి దిగిన ప్రసన్న హరికృష్ణ వైపు పట్టభద్రులు మొగ్గుచూపారనే ప్రచారం ఎక్కువగా జరుగుతోంది. ప్రధానపోటీ మాత్రం బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, ప్రసన్న హరికృష్ణ మధ్య ఉండొచ్చని, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి మూడోస్థానానికి పరిమితమయ్యే ఛాన్స్ ఉందనే చర్చ జరుగుతోంది.

**రెండో ప్రాధాన్యత ఓటుతో..** ప్రసన్న హరికృష్ణ ఎన్నికల ముందు వరకు కాంగ్రెస్ సానుభూతిపరుడిగా ఉన్నారు. ఎన్నికల్లో గెలిస్తే ఆయన అధికారపార్టీ వైపే ఉంటారనే ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్‌లో కొందరు ప్రసన్న హరికృష్ణకు లోపాయికారిగా సహకరించారనే ప్రచారం జరిగింది. దీంతో నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన కాంగ్రెస్ సానుభూతిపరులు తప్పకుండా రెండో ప్రాధాన్యత ఓటును ప్రసన్న హరికృష్ణకు వేసే అవకాశం ఉంది. అలాగే అంజిరెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేసిన ఓటర్లు రెండో ప్రాధాన్యత ఓటును ప్రసన్న హరికృష్ణకు వేయడానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ నుంచి పోటీచేస్తున్న శేఖర్ రావుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన ఓటర్లలో ఎక్కువమంది ప్రసన్న హరికృష్ణకు రెండో ప్రాధాన్యత ఇచ్చే ఛాన్స్ ఉంది. దీంతో రెండో ప్రాధాన్యత ఓటుతో ప్రసన్న హరికృష్ణ గెలుస్తారనే ప్రచారం గట్టిగా వినిపిస్తోంది.





# తప్పొప్పులుంటే క్షమించండి!

## సమైక్య మహా యాగాన్ని పూర్తి చేశాం - ఈ విజయం అందరిదీ!!

## మహా కుంభమేళ ముగింపు పై ప్రధాని మోడీ ఆసక్తికర ట్వీట్

ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్‌లో జనవరి 13న ప్రారంభం అయిన మహా కుంభమేళ జనవరి 26న సాయంత్రం 5 గంటలకు ముగిసింది. దీనిని కుంభమేళ నిర్వహకులు అధికారికంగా ప్రకటించారు. కాగా ఈ మహా కుంభమేళ ముగింపుపై భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆసక్తికర ట్వీట్ చేశారు. ప్రధాని తన ట్వీట్‌లో ఇలా రాసుకొచ్చారు. "మహా కుంభం ముగిసింది.. సమైక్య మహా యాగం ముగిసింది. 140 కోట్ల మంది దేశప్రజల విశ్వాసం 45 రోజుల పాటు ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన ఐక్యతా మహా కుంభానికి ఒక్కసారిగా వచ్చి ఈ ఒక్క పండుగలో చేరిన తీరు అఖండమైనది. మహా కుంభం పూర్తయిన తర్వాత నా మదిలో మెదిలిన ఆలోచనలను రాయడానికి ప్రయత్నించాను అని ప్రధాని మోడీ తన వెబ్ సైట్ లో కుంభమేళ గురించి రాసుకొచ్చిన విషయాల గురించి ట్వీట్ లో తెలిపారు. కోట్లాది పాల్గొన్న ఈ కార్యక్రమంలో తపొప్పులు జరిగి ఉంటే క్షమించండి... వీలైనంత వరకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రయత్నించామన్నారు. కాగా ప్రధాని మోడీ తన వెబ్ సైట్ లో ఇలా రాసుకొచ్చారు. మహా కుంభం ముగిసింది.. ఐక్యతా మహా యజ్ఞం ముగిసింది. ఒక దేశపు చైతన్యం పరిగెత్తినప్పుడు.. అది శతాబ్దాల పాటు తలచిన చెడు వ్యవస్థలను బంధాలను పగులగొట్టి, కొత్త చైతన్యంగా.. జనవరి 13 తర్వాత ప్రయాగ్రజ్‌లో ఐక్యత మహాకుంభంలో చూసిన దృశ్యం కనిపిస్తుంది. అలాగే 2024 జనవరి 22న అయోధ్యలో శ్రీ రామ మందిరం యొక్క ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో నేను దేవభక్తి నుంచి దేశభక్తి విషయాన్ని చెప్పాను. ప్రియాగ్రజ్‌లో మహాకుంభం సమయంలో అన్ని దేవతలు, సంతులు, మహాత్ములు, బాలలు, వృద్ధులు, మహిళలు, యువకులు సమ్మేళనంగా చేరి.. మనం దేశ చైతన్యానికి ఒక ఉదాహరణ నిలిచారు. అంటూ అనేక అంశాలను ప్రధాని మోడీ ప్రస్తావించారు.

**45 రోజులు.. 66 కోట్ల మంది భక్తులు... రూ. 3 లక్షల కోట్ల ఆదాయం...: మహాకుంభమేళా హైలెట్స్ ఇవే...** ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా ముగిసింది. మహా శివరాత్రి రోజున మహా కుంభమేళాలో చివరి అమృతస్నానం ఆచరించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి త్రివేణి సంగమంలో పుణ్య స్నానం ఆచరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమైన మహాకుంభమేళా 2025 జనవరి 13న పుష్య పూర్ణిమ స్నానంతో ప్రారంభమై.. ఫిబ్రవరి 26న మహా శివరాత్రితో ముగిసింది. 45 రోజుల పాటు సాగిన మహాకుంభమేళాలో కోట్లాది మంది భక్తులు తరలివచ్చి పుణ్య స్నానాలు ఆచరించారు. ఈ మహాకుంభమేళాకు సంబంధించిన హైలెట్స్ ఇప్పుడు తెలుసుకుందాం... ఈ సారి మహా కుంభమేళాకు ఎంతో ప్రత్యేకత ఉంది. 144 సంవత్సరాల తర్వాత మహా కుంభమేళా జరుగుతుంది. సాధారణంగా ప్రతి ఆరు సంవత్సరాలకోసారి అర్ధ కుంభమేళా, 12 సంవత్సరాలకోసారి కుంభమేళా నిర్వహిస్తారు. 144 సంవత్సరాలకోసారి మహా కుంభమేళా జరుగుతుంది. ఈ ఏడాది మహాకుంభమేళా కావడంతో... భారతదేశం నుంచే కాకుండా, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. మహాకుంభమేళా ద్వారా రూ. 3 లక్షల కోట్ల ఆదాయం సమకూరినట్టుగా తెలుస్తోంది. "ప్రపంచం నేడు చూస్తున్న ఉత్తరప్రదేశ్ సామర్థ్యాన్ని మహా కుంభమేళాతో అనుసంధానించవచ్చు. మహా కుంభమేళా ఒక్కటే ఉత్తరప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ రూ. 3 లక్షల కోట్లకు పైగా వృద్ధి చెందడానికి సహాయపడుతుంది" అని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఇటీవల తెలిపారు. మహాకుంభమేళాలో 66 కోట్ల మంది భక్తులు పాల్గొన్నారు. త్రివేణి సంగమంలో పుణ్య స్నానం ఆచరించారు. గతంలో ఎప్పుడూ కూడా ఈ స్థాయిలో భక్తులు మహాకుంభమేళాకు హాజరుకాలేదు. మహాకుంభమేళాలో నాగ సాధువుల ఊరేగింపులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పలువురు బాబాలు కూడా ఫేమస్ అయ్యారు. గతంలో నిర్వహించిన కుంభమేళాల ఆదాయం విషయానికి వస్తే... 2013లో ప్రభుత్వం రూ. 1,017 కోట్ల ఖర్చు చేయగా, రూ. 12,000 కోట్ల ఆదాయం వచ్చింది. 2019 నాటికి ఆదాయం రూ. 1.2 లక్షల కోట్లకు పెరిగింది, ఆ ఏడాది కుంభమేళా కోసం ప్రభుత్వం రూ.2,112 కోట్లు ఖర్చు చేసింది. 2025లో మహా కుంభమేళాకు ప్రభుత్వం రూ.7,500 కోట్లకు పైగా కేటాయించింది. రూ.2 లక్షల కోట్లకు పైగా ఆదాయానికి ఆశించింది. అయితే ప్రభుత్వ అంచనాలకు మించి.. మహాకుంభమేళా 2025 చరిత్రలో ఆర్థికంగా అత్యంత ప్రభావవంతమైన మతపరమైన సమావేశాలలో ఒకటిగా నిలిచింది. మహాకుంభమేళాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, దేశంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పుణ్యస్నానం ఆచరించారు. స్టీవ్ జాబ్స్ సతీమణి లారెన్ పావెల్ జాబ్స్ మహాకుంభమేళాకు హాజరయ్యారు. అలాగే పలువురు విదేశీ ప్రముఖులు కూడా ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించి త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం చేశారు. తొక్కిసలాటలో 30 మంది మృతి.. మహాకుంభమేళాలో జనవరి 29న అత్యంత పవిత్రమైన రోజులలో ఒకటైన మౌని అమావాస్య నాడు చోటుచేసుకున్న తొక్కిసలాటలో 30 మంది మరణించగా, 60 మంది గాయపడ్డారు.




# "తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరు"..

## హెచ్ సీఎల్ టెక్ క్యాంపస్ ప్రారంభించిన సీఎం..

హైదరాబాద్ లో హెచ్ సీఎల్ కేఆర్ సీ క్యాంపస్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రతిరోజూ తాము బహుళజాతి సంస్థలతో కొత్త అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడమో.. పెద్ద సంస్థలు తెలంగాణకు రావడమో.. గత సంవత్సరం సంతకం చేసిన ఎంఓయూల కొత్త సౌకర్యాలను ప్రారంభించడమో జరుగుతోందని తెలిపారు. గురువారం %ఎజూ% టెక్ కొత్త క్యాంపస్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగించారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ నగరం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కేవలం ఏడాది కాలంలోనే తెలంగాణకు దేశవిదేశాల నుంచి అత్యధిక పెట్టుబడులు వచ్చాయని చెప్పారు.

ఉద్యోగ కల్పనలో నెంబర్ వన్ గా నిలిచామని తెలిపారు. మన దగ్గర అత్యధిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అత్యల్ప ద్రవ్యోల్బణం ఉన్నాయని సీఎం వెల్లడించారు. తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల జీడీపీ రాష్ట్రంగా మారుస్తానని, తాను ముందు చెప్పినప్పుడు... అది సాధ్యం కాదని కొందరు అన్నారన్నారు. రెండుసార్లు దావోస్ పర్యటనల్లో రూ.41,000 కోట్లు, రూ.1.78 లక్షల కోట్ల ఎంవోయూలపై సంతకాలు చేసుకున్న తరువాత ఇప్పుడు అది సాధ్యమని నమ్ముతున్నారని తెలిపారు. తెలంగాణ రైజింగ్‌ను ఎవరూ ఆపలేరని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. "మా పోటీ ముంబై, ఢిల్లీ, బెంగళూరు లేదా చెన్నైతో కాదని నేను చెప్పినప్పుడు... కొంతమంది అది పెద్ద కలనే అవుతుందన్నారు. మనం ఈవీ అడాప్షన్ లో హైదరాబాద్ ను నంబర్ వన్ గా చేశాక... రాష్ట్రాన్ని డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, స్కిల్స్, మ్యానుఫ్యాక్చరింగ్, అగ్రి ప్రాసెసింగ్ కు హబ్ గా మారుస్తున్నాం.. ఇప్పుడు హైదరాబాద్ రైజింగ్ ఆగదు అని ప్రజలు అంటున్నారు. నేను మొదట హైదరాబాద్ రైజింగ్ అని చెప్పినప్పుడు కొందరికి అనుమానం వచ్చింది.

ఇప్పుడు ప్రపంచం మొత్తం అంగీకరిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద లైఫ్ సైన్సెస్ కంపెనీల్లో ఒకటైన ఆమ్జెన్ ను కొద్దిరోజుల క్రితం ప్రారంభించుకున్నాం. మేం ప్రపంచంలోని అత్యుత్తమ సమావేశాలలో ఒకటైన బయో ఏషియాను నిర్వహించాం.. ఇవాళ హెచ్ సీ ఎల్ లో ఉన్నాం. గ్లోబల్ కంపెనీగా హెచ్ సీ ఎల్ టెక్ భారతదేశానికి గర్వకారణంగా నిలిచింది. ఇది 60 దేశాలలో ఆపరేట్ చేస్తోంది మరియు 2.2 లక్షల మందికి పైగా ఉద్యోగులను కలిగి ఉంది. డిజిటల్, ఇంజినీరింగ్, క్లౌడ్, ఏఐ రంగాల్లో వరల్డ్ క్లాస్ ఆఫరింగ్స్ క్రియేట్ చేస్తున్నారు. 2007లో హైదరాబాద్ వచ్చినప్పటి నుంచి అంచెలంచెలుగా HCL పెద్ద స్థాయికి ఎదిగింది. ఇవాళ 3.2 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దాదాపు 5 వేల మందితో కేఆర్ సీలో ప్రపంచస్థాయి సదుపాయంతో హెచ్ సీఎల్ టెక్ హైదరాబాద్ లో గొప్ప పనులు చేస్తుంది." అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.



## సీఎం వనపర్తి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

వనపర్తి : మార్చి -2న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనపర్తికి రానున్న దృష్ట్యా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ వద్ద వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు చేయనున్న సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ గిరిధర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.పాలిటెక్నిక్ కాలేజీలో హెలిప్యాడ్ ను ఏర్పాటు చేశారు. పబ్లిక్ మీటింగ్ సంబంధించిన స్థలాలను భద్రతా ఏర్పాట్లను చూశారు. పబ్లిక్ మీటింగ్ వచ్చే ప్రజలకు ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

కొత్తకోట రోడ్డు పెబ్బేర్ రోడ్డు పానగల్ రోడ్ గోపాల్ పేట్ రోడ్ పార్కింగ్ స్థలాలు, ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ మైదానంలో బాయ్స్ హైస్కూల్ కు శంకుస్థాపన, భూమి పూజ చేయనున్నారు.

## ప్రమాదం జరిగిన చోట రాజకీయం చేయడానికి హరీశ్‌రావు వచ్చారు: మంత్రి ఉత్తమ్



దోమలపెంట: ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద సహాయక చర్యలు రెండ్రోజుల్లో పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. రెండు నెలల్లో తిరిగి సొరంగం తవ్వకం పనులు చేపడతామని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. టన్నెల్ కూలిపోవడానికి గత ప్రభుత్వ వైఫల్యమేనని ఉత్తమ్ ఆరోపించారు. "గత ప్రభుత్వం టన్నెల్‌లో నీటి తొలగింపు పనులు కూడా చేపట్టలేదు. టన్నెల్‌లో నీటిని తోడివేసి ఉంటే.. ఇప్పుడీ ప్రమాదం జరిగేది కాదు. గ్రావిటీ ద్వారా 30 టీఎంసీలు తీసుకునే ప్రాజెక్టును పక్కకు పెట్టారు. టన్నెల్ పూర్తి చేసి ఉంటే 4.50 లక్షల ఎకరాలకు నీళ్లు అందేవి. భారాస చేపట్టిన ప్రాజెక్టులన్నీ వాళ్ల జేబులు నింపుకొనేందుకే. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం కడితే అది మూడేళ్లకే కూలింది. గతంలో శ్రీశైలం పవర్ ప్లాంట్ అగ్ని ప్రమాదంలో ఆరుగురు ఉద్యోగులు చనిపోతే కనీసం వెళ్లి చూడలేదు. పాలమూరు పంప్‌హౌస్‌లో ప్రమాదం జరిగి ఆరుగురు చనిపోతే స్పందించలేదు. కొండగట్టు బస్సు ప్రమాదంలో 62 మంది చనిపోతే.. నాడు కేసీఆర్ వెళ్లలేదు. కేసీఆర్ ఫామ్‌హౌస్ దగ్గర్లోనే మాసాయిపేట రైలు ప్రమాదం జరిగింది. రైలు ప్రమాదంలో చిన్నారులు చనిపోతే కేసీఆర్ కనీసం పరామర్శించలేదు. ప్రమాదం జరిగిన చోట రాజకీయం చేయడానికి హరీశ్‌రావు వచ్చారు. హరీశ్‌రావుకు అనుభవం ఉంటే పదేళ్లలో ప్రాజెక్టు ఎందుకు పూర్తి చేయలేదు. నిపుణుల చర్యలకు ఇబ్బంది కావొద్దని అందరినీ లోపలికి పంపట్లేదు. టీబీఎం వెనుక ఉన్న బురద తొలగింపు పనులు జరుగుతున్నాయి. బురద తొలగింపు పూర్తికాగానే మిషన్ శిథిలాలు తొలగిస్తాం" అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

## అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే మాపై రేవంత్ విమర్శలు: కేటీఆర్



హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఘటనలో అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకే తమపై సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సీఎం వ్యవహార శైలి ఆడలేక మద్దెల ఓడు అన్నట్లుందని వ్యాఖ్యానించారు. "పదేళ్లు ఆగిన ప్రాజెక్టును జాగ్రత్తలు తీసుకోకుండా, నిపుణులను సంప్రదించకుండా ప్రారంభించారు. అవినీతి సొమ్ము కోసం పాత యంత్రాలతో పనులు చేపట్టారు. రేవంత్‌రెడ్డి ధనదాహం వల్లే టన్నెల్‌లో 8 మంది చిక్కుకున్నారు. కావాలంటే ఆయన ఎలాంటి విచారణలైనా చేసుకోవచ్చు" అని కేటీఆర్ అన్నారు.

## యాదగిరిగుట్టలో మార్చి 1 నుంచి బ్రహ్మోత్సవాలు



యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట నరసింహస్వామి ఆలయంలో మార్చి 1 నుంచి 11 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. మార్చి 7న ఎదుర్కోలు మహోత్సవం, 8న తిరు కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. మార్చి 9న దివ్యవిమాన రథోత్సవం జరగనుంది. బ్రహ్మోత్సవాల దృష్ట్యా ఆలయంలో కల్యాణాలు, హోమాలు, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చణ సేవను రద్దు చేసినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.



# కేసీఆర్, కవిత... ఆపండి మీ ఆంధ్ర గోల!

హైదరాబాద్ : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర పోరాట సమయం నుంచి.. ఆంధ్ర ప్రాంత ప్రజలపై బీఆరెస్స్ (టీఆరెస్స్) అధినేత కేసీఆర్ ఏ స్థాయిలో విమర్శలు చేశారన్నది తెలిసిన విషయమే. ఏపీ ప్రజలపై అప్పట్లో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ సమయంలో.. కేసీఆర్ పూర్వీకులది విజయనగరం అని.. ఏపీ ప్రజలపై ఆయన చేస్తున్న వ్యాఖ్యలు అన్నీ వారి పూర్వీకులకు వర్తిస్తాయని పలువురు కామెంట్ చేసేవారు. ఇలా ఏపీ ప్రజలపై తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ దారుణమైన విమర్శలు చేశారు. ప్రత్యేక తెలంగాణ సాధనలో ఏపీ ప్రజలను విమర్శించడాన్ని ఒక భాగంగా చేశారన్నా అతిశయోక్తి కాదేమో అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది! దీంతో... చాలా మంది నాయకులు ఇదే పంథాను అనుసరించారు. తెలంగాణ ఉద్యమంలో భాగస్వామి అంటే ఏపీ ప్రజలను విమర్శించాలి అనేట్లుగా ఇంజెక్ట్ చేశారని అంటారు. ఆ విధంగా కేసీఆర్ విమర్శలు ఉండేవి. అయితే... తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడింది. దశాబ్దకాలం దాటేసింది. ఈ క్రమంలో కేసీఆర్ రెండుసార్లు ఆ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పని చేశారు. ఈ సమయంలో ఇప్పటికీ ఆంధ్రులపై, ఆంధ్ర ప్రాంత నాయకులపై విమర్శలు మాత్రం ఆగడం లేదు! తాజాగా .. ఏపీ పాలకులపై బీఆరెస్స్ ఎమ్మెల్సీ కవిత విమర్శలు చేశారు. అవును... తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఇంతకాలం అయినప్పటికీ.. ఏపీ ప్రాంత ప్రజలు, పాలకులపై విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. ప్రధానంగా బీఆరెస్స్ పార్టీకి చెందిన నేతలకు ఈ తరహా వ్యాఖ్యలు ఊతపదాలుగా మారాయా అనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఈ సమయంలో తాజాగా... మహాశివరాత్రి సందర్భంగా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని కవిత దర్శించుకున్నారు. ఈ సందర్భంగా... తెలంగాణకు కొంగుబంగారం లాంటి రాజరాజేశ్వర స్వామి వారి కరుణాకటాక్షాలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాల్ని ఆకాంక్షించారు. వేములవాడ అభివృద్ధికి కేసీఆర్ ఎంతో కృషి చేశారని తెలిపారు. బీఆరెస్స్ పార్టీ హయాంలో మొదలైన అభివృద్ధిని.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని అన్నారు.. ప్రభుత్వాలు మారినా అభివృద్ధి కొనసాగాలని సూచించారు. అంతవరకూ సరే కానీ... ఈ విషయంలోకూడా ఆంధ్ర పాలకులపై కవిత విమర్శలు గుప్పించడం గమనార్హం. ఇందులో భాగంగా... ఆంధ్ర పాలకులు ఉన్నప్పుడు దేవుళ్లను కూడా అప్రతిష్టపాలు చేశారని.. ఆమె వ్యాఖ్యానించారు. అయితే... కేసీఆర్ మాత్రం ఈ ప్రాంతాన్ని జిల్లాగా ఏర్పాటు చేసి, రాజన్న సిరిసిల్ల జిల్లాగా నామకరణం చేశారని తెలిపారు. దీంతో... ఈ వ్యాఖ్యలపై నెట్టింట విమర్శలు మొదలయ్యాయి. రాష్ట్రం ఏర్పడి ఇంతకాలం అవుతున్నా.. రెండు దఫాలు బీఆరెస్స్ అధికారంలో ఉన్నా.. ఇప్పటికీ ఆ పార్టీకి చెందిన నేతలు ఏపీ పాలకులపై ఎందుకు విమర్శలు చేస్తున్నట్లు అని ప్రశ్నిస్తున్నారు. ఓ పక్క అన్నదమ్ముల్లా కలిసి ఉండాలంటూనే మరోపక్క ఈ మాటలేలా అని అడుగుతున్నారు.




## పీసీసీ కార్యవర్గానికి తాత్కాలిక బ్రేక్

### రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మారడం వల్లే ఆలస్యం - కొత్త ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ పరిశీలించాకే ప్రకటన

హైదరాబాద్: పీసీసీ కార్యవర్గ ప్రకటనకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఇటీవల కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ మారడం, ఆమె స్థానంలో సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రావడమే ఇందుకు కారణమని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. కొత్త ఇన్‌చార్జ్ కార్యవర్గ జాబితాను పరిశీలించి, ఆమోద ముద్ర వేశాకే తుది ప్రకటన ఉంటుందని అంటున్నారు.

ఇందుకు మరో వారం పట్టవచ్చని గాంధీ భవన్ లో చర్చ నడుస్తున్నది. పీసీసీ కార్యవర్గంలో నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, ఉమ్మడి జిల్లాకు ఒక ఉపాధ్యక్షుడిని, కొన్ని చోట్ల ఇద్దరి చొప్పున పేర్లను ఖరారు చేసిన పీసీసీ నాయకత్వం ఆ లిస్టును హైకమాండ్ కు పంపించింది. సీఎం రేవంత్ రెడ్డి, అప్పటి ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్ కలిసి లిస్ట్ ఫైనల్ చేసి ఢిల్లీకి పంపించారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా దీనికి ఆమోద ముద్ర వేశారు. ఇక రేపు, మాపో ప్రకటించనున్నారని అనుకున్న సమయంలో అనూహ్యంగా ఇన్ చార్జ్ మారడంతో తాత్కాలికంగా బ్రేక్ పడింది.




## దేవాదాయ శాఖ పరిధిలోకి భాగ్యలక్ష్మి అమ్మవారి టెంపుల్!

హైదరాబాద్‌లో చార్మినార్‌ను ఆనుకొని ఉన్న భాగ్యలక్ష్మీ అమ్మవారి ఆలయం దేవాదాయశాఖ పరిధిలోకి రానుంది. ఈ మేరకు దేవాదాయశాఖను ట్రిబ్యునల్ ఆదేశిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం భాగ్యలక్ష్మి టెంపుల్ నిర్వహణ బాధ్యతను మహంత్ మనోహర్ దాస్, మహంత్ రాంచంద్ర దాస్ 1960 దశకం నుంచి చూస్తున్నారు. ప్రస్తుతం ఆలయ నిర్వహణ బాధ్యతలను దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకువచ్చేందుకు ఆదేశాలు వెలువడ్డాయి. భాగ్యలక్ష్మీ ఆలయానికి తక్షణమే ఈవోను నియమించి ఆలయంలో ఎలాంటి అవకతవకలు లేకుండా ముందుకు వెళ్లాలని దేవాదాయ శాఖ కమిషనర్‌ను ట్రిబ్యునల్ ఆదేశించింది. ఈ ఆలయ ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్న ఫిర్యాదులపై కోర్టు విచారణ తర్వాత ఈ ఆదేశాలు జారీ అయినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. యూపీకి చెందిన రాజ్ మోహన్ దాస్ ఆలయంపై ఆజమాయిషీ చెలాయిస్తున్నాడంటూ ఓ మహిళ కోర్టును ఆశ్రయించడంతో ఇది వెలుగులోకి వచ్చింది. ఆలయ నిర్వహణకు సంబంధించి ఏకగ్రీవ నియంత్రణ ఉండాలని ఆమె కోర్టులో వాదించారు. ఈ నేపథ్యంలో విచారణ చేపట్టిన ఎండోమెంట్ ట్రిబ్యునల్, ఆలయాన్ని దేవాదాయశాఖ పరిధిలోకి తీసుకురావాలని తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు నేపథ్యంలో దేవాదాయశాఖ కమిషనర్ ఆలయ నిర్వహణకు ప్రత్యేక ఈవోను (ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్) నియమించాలని ఆదేశించారు. ఆలయ ఆదాయ వ్యయం, నిర్వహణ విధానాలు అధికారిక పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ నిర్ణయంతో ఆలయ అభివృద్ధికి సహకారం అందుతుందని, భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మార్గం సుగమమవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఉన్న ప్రాజెక్టులను కాపాడలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం: హరీశ్‌రావు



దోమలపెంట: ఉన్న ప్రాజెక్టులను కాపాడలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లోకి వెళ్లేందుకు తమకు అనుమతి ఇవ్వలేదన్నారు. "సహాయక చర్యలకు ఇబ్బంది అవుతుందని ఇన్ని రోజులు రాలేదు. ఆరు రోజులు గడిచినా చిక్కుకుపోయిన వారి ఆచూకీపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఎస్ఎల్‌బీసీ కోసం ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3,300 కోట్లు ఖర్చు పెడితే.. భారాస ప్రభుత్వం రూ.3,900 కోట్లు ఖర్చు చేసింది. ఏపీ ప్రభుత్వం అక్రమంగా కృష్ణా జలాలు తరలించుకుపోతోంది. మన నీటిని ఏపీ తరలించుకుపోతుంటే ప్రభుత్వం ఆపటం లేదు. రాష్ట్ర ప్రాజెక్టులను కేంద్ర బోర్డుకు అప్పగించేందుకు ఆనాడు భారాస ప్రభుత్వం అంగీకరించలేదు. గోదావరిపై ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తుంటే కాంగ్రెస్ సర్కారు నోరెత్తటం లేదు. కృష్ణా జలాలపై మేం నిలదీసిన తర్వాత కేఆర్ఎంబీ వద్దకు వెళ్లి ఫిర్యాదు చేశారు. రాష్ట్ర హక్కులను కాపాడటంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది"అని విమర్శించారు.

# వైజ్ఞానిక రంగంలో తొలి నోబెల్ బహుమతి గ్రహీత సి.వి. రామన్

## ఫిబ్రవరి 28... జాతీయ విజ్ఞాన దినోత్సవము




వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని, దాని వల్లనే అది తన గమనాన్ని మార్చుకుంటుందని తన సిద్ధాంతాల ద్వారా రుజువు చేశారు రామన్. సూర్యుని నుంచి వెలువడే తెలుపు వర్ణపు కాంతి వాయువులోని అణువులపై పడి, వాటి ప్రయాణ దిశను మార్చు కుంటాయని తన పరిశోధనల ద్వారా తెలుసుకున్న సి.వి. రామన్ ఓ సిద్ధాంతాన్ని సూత్రీకరించారు. వస్తువు మీద కాంతి కిరణం పడితే అది పరివర్తనం చెందుతుందని 1928 సంవత్సరం, ఫిబ్రవరి 28న రామన్ మొట్ట మొదటిసారి ప్రకటించారు. పారదర్శకంగా ఉన్న ఘన లేదా ద్రవ లేదా వాయు మాధ్యమం గుండా కాంతిని ప్రసరింప చేసినప్పుడు అది తన స్వభావాన్ని మార్చు కుంటుంది. ఈ విషయాన్ని 1928 మార్చి 16 న బెంగుళూరులో జరిగిన శాస్త్రజ్ఞుల సదస్సులో చూపించారు. అతను అనుకున్నట్లే 1928 ఫిబ్రవరి 28 న "రామన్ ఎఫెక్టు" ఆవిష్కరించడం జరిగింది. ఈ పరిశోధనను అభినందిస్తూ బ్రిటీష్ ప్రభుత్వం 1929 లో "నైట్ హుడ్" బిరుదుతో సత్కరించింది. రామన్ ఎఫెక్ట్‌ను కనిపెట్టిన చంద్రశేఖర వేంకట రామన్ 28-02-1928న తన పరిశోధనా ఫలితాన్ని ధృవపరచుకున్న దినాన్ని (నేషనల్ సైన్స్ డేజాతీయ విజ్ఞాన దినోత్సవము) గా భారతదేశంలో ప్రతి సంవత్సరం జరుపు కుంటున్నారు. సైన్సులో ఎవరూ చేయలేని సాహసాలను అత్యంత సునాయాసంగా చేసి చూపించి, విశ్వ వినువీధిలో భారత కీర్తి పతాకాన్ని రెపరెప లాడించిన మహా జ్ఞాని చంద్రశేఖర్ వెంకటరామన్ (సి వి రామన్). వైజ్ఞానిక రంగంలో ప్రపంచ దేశాలను తలదన్నేలా భారత్‌ను శక్తివంతంగా చూపి, అబ్బుర పరిచే ప్రయోగాలకు నిలువెత్తు వేదికలా నిలిచారు సర్ సివి రామన్. వైజ్ఞానిక రంగంలో తొలి నోబెల్ అందుకున్న విజ్ఞాన ఖని. ఒక్క మాటలో చెప్పాలంటే వైజ్ఞానిక శాస్త్రానికే వైద్యుడిలా మారిన మహోన్నతుడు. ఆధునిక భారత విజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనా ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింప జేసిన వ్యక్తుల్లో సర్ సీవి రామన్ మొదటివారు. సీవీ రామన్ నవంబర్ 7, 1888 తమిళనాడులోని తిరుచురాపల్లిలో జన్మించారు. తండ్రి చంద్రశేఖర్ అయ్యర్, తల్లి పార్వతి అమ్మాళ్. తండ్రి విశాఖపట్నం లోని ఏవీఎన్ కళాశాలలో లెక్చరర్ గా పని చేయడం వల్ల రామన్ బాల్యం, విద్యాభ్యాసం అక్కడే జరిగింది. అనంతరం మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీలో చేరి 19 ఏళ్లకు ఫిజిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు. ఆ తర్వాత తల్లిదండ్రుల కోరిక మేరకు ఐసిఎస్ పాసై కలకత్తా ప్రభుత్వ ఆర్థికశాఖలో డిప్యూటీ అకౌంటెంట్ జనరల్‌గా చేరారు. ఆ సమయం లోనే పరిశోధనలపై ఆసక్తి పెంచుకున్నారు. పరిశోధనల కోసం భారతీయులు విదేశాలకు వెళ్లడమేమిటి?. విదేశీయులే.. పరిశోధనల కోసం ఇక్కడకు రావాలని చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి రామన్. రామన్ ముందు వరకూ సైన్స్‌లో నోబెల్ బహుమతులు పాశ్చాత్యులకే దక్కేవి. కానీ, రామన్ అచ్చమైన భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, తలమానికమైన పరిశోధన జరిపి సైన్సులో దేశ శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారు. 'నా మతం సైన్సు.. దానినే జీవితాంతం ఆరాధిస్తా..' అని చెప్పి తుదిశ్వాస వరకూ శాస్త్రాన్వేషణ లోనే గడిపిన దార్శనికుడు. "విజ్ఞాన శాస్త్ర సారాంశం, ప్రయోగ శాలల పరికరాలతో వికసించదు. నిరంతర పరిశోధన, స్వంతంత్రంగా ఆలోచించే ప్రవృత్తి ఇవే విజ్ఞాన శాస్త్ర సాగరాన్ని మథించి వేస్తాయి" అంటూ ఆయన చేసిన ప్రసంగం నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తోంది. ఉదయాకాశంలోని వెలుగుల్లో చెట్లు ఎంత అందంగా కనబడతాయో మీరు ఎప్పుడైనా గమనించారా? నాకు వీటిని చూస్తూ ఉంటే స్ఫటిక నిర్మాణం గురించిన ఆలోచనలు వస్తుంటాయి. అందుకే "విజ్ఞానం అత్యుత్తమైన సృజనాత్మక కళారూపం అని రామన్ ఎప్పుడూ చెబుతుండే వారు. మెర్క్యూరీ ల్యాంప్ నుండి ఏకవర్ణ కాంతి తరంగాలను ఒక పారదర్శక యానకం గుండా ప్రసరింపజేస్తే, యానక ధర్మాలపై ఆధారపడి ఆ కాంతిలో కొంత భాగం వివర్తనం చెంది, తక్కువ తరంగ దైర్ఘ్యం గల కాంతిగా బహిర్గత మౌతుంది. సముద్ర జలంపై ఇదే ప్రక్రియతో నీలి రంగు కాంతి బహిర్గతమవుతుంది. దీనినే 'రామన్ ఫలితం' (రామన్ ఎఫెక్ట్) అంటారు. రామన్ జీవితంలో మరో మైలురాయి రామన్ ఎఫెక్ట్ సిద్దాంతం. ఈ రామన్ ఎఫెక్టు అసామాన్య మైనదని, అందులో 200 రూపాయలు కూడా ధర చేయని పరికరాలతో ఆ విషయ నిరూపణ జరగడం అద్భుతమైనదని ప్రపంచ శాస్త్రజ్ఞులంతా రామన్ ను అభినందించారు. అఖండ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన రామన్, ఫిజిక్స్ రంగంలో రామన్ ఎఫెక్ట్ కనుగొని చరిత్ర సృష్టించిన ఫిబ్రవరి 28 నే జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపు కొంటున్నాం. రామన్ నూటికి నూరుపాళ్ళూ భారతీయునిగా ఈ గడ్డపైనే చదువుకొని, పరిశోధనలు జరిపి సైన్సులో శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పి భారత్ కు నోబెల్ సాధించి పెట్టారాయన. 1913 లో సాహిత్యంలో మనదేశం నుండి నోబెల్ బహుమతి పొందిన విశ్వకవి రవీంద్రనాధ్ ఠాగూర్ అనంతరం సైన్సు రంగంలో విజయ ఢంకా మ్రోగించిన అఖండ ప్రజ్ఞాశాలి రామన్ ఒక్కరే కావడం దేశానికి గర్వకారణం. రామన్ పరిశోధనలు సైన్సులో, పారిశ్రామిక రంగంలోనూ క్రొత్తపుంతలు త్రొక్కడానికి దారితీసింది. శాస్త్ర రంగంలో రామన్ స్పెక్ట్రోస్కోపీ ఆవిర్భావానికి "భారతరత్న", 1957 లో "లెనిన్ శాంతి బహుమతి" లభించాయి. కాంతి ప్రసరణపై జరిపిన పరిశోధనలకు "నోబెల్ బహుమతి" లభించింది. స్వాతంత్ర్యం రాగానే రామన్ కు మొట్టమొదటి నేషనల్ ప్రొఫెసర్ గా ప్రభుత్వం నియమించి గౌరవించింది. 1948 లో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్ గా రిటైరయ్యారు. దృష్టి, కాంతి, ధ్వని, వర్ణాలు, ద్రవాల తలతన్యత, ఖనిజాలు, డైమండ్, క్రిస్టల్ తదితర అంశాలపై పరిశోధనలు జరిపిన సి.వి. రామన్ సుమారు 465 పరిశోధన పత్రాలను వెలువరించాడు. వాటిని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగుళూరు వారు సేకరించి భద్రపరిచారు. 1949 లో బెంగుళూరులో రామన్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ స్థాపించి, 1970 నవంబరు 27 న ఆయన మరణించే వరకూ, ఆ సంస్థలో పరిశోధనలు జరిపి, మన దేశంలో సైన్సు అభివృద్ధికి మార్గదర్శకు లయ్యారు. 1971 నవంబర్ 21 న సీ.వీ. రామన్ పోస్టేజి స్టాంపును భారత ప్రభుత్వం వెలువరించి ఆ మహా శాస్త్రజ్ఞుడిని గౌరవించింది. విజ్ఞాన ఆవిష్కరణల్లో భారతీయులకు నోబెల్ రావడం గగన సదృశం. సర్ సివి రామన్ ఆ ఘనత సాధించారు. అంతేకాదు, విజ్ఞాన శాస్త్రంలో ఆఘనత సాధించిన ఏకైక ఆసియా వాసిగానూ ఖ్యాతి గడించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ముగిసిన మహా కుంభమేళా.. మళ్లీ ఎప్పుడంటే..?



ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ లో మహా కుంభమేళా ముగిసింది. చివరిరోజైన బుధవారం భక్తులు భారీగా పోటెత్తారు. ప్రధానంగా చివరి రోజు కావడంతోపాటు మహా శివరాత్రి పర్వదినం కూడా కలిసిరావడంతో త్రివేణీసంగమం ఘాట్లు శివనామస్మరణలతో మార్మోగాయి. ఈ క్రమంలో రికార్డ్ స్థాయిలో భక్తులు మహా కుంభమేళాలో స్నానమాచరించినట్లు ప్రభుత్వం తెలిపింది! అవును.. మహా కుంభమేళాలో చివరి అమృతస్నానం ఆచరించేందుకు భక్తులు అర్ధరాత్రి నుంచే పెద్దసంఖ్యలో ఘాట్ల వద్దకు చేరుకొన్నారు. ఈ సమయంలో.. శివాలయం పర్వదినం సందర్భంగా కుంభమేళా ప్రాంతంలోని ఐదు ప్రధాన శివాలయాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ మహత్తర కార్యక్రమం 45 రోజుల పాటు సాగి నిన్న ముగిసింది. జనవరి 13న మొదలై నాగ సాధువుల ఊరేగింపులు, మూడు అమృత స్నానాలతో వైభవంగా 45 రోజుల పాటు కొనసాగిన మహా కుంభమేళా ప్రశాంతంగా ముగిసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం మొత్తం 66.21 మంది భక్తులు పుణ్య స్నానమాచరించారు. ఈ కార్యక్రమం చివరి రోజు తెల్లవారుజామున 4 గంటల నుంచే ఆదిత్యనాథ్.. అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్పందించిన యూపీ సీఎం... ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో అఖాడాలు, సాధువులు, మహామండలేశ్వర్ల ఆశీర్వాదాలతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. చరిత్రలో నిలిచిపోయే ఈ మహా కుంభమేళాలో భాగమైన భక్తులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలా 144 ఏళ్లకు ఒకసారి వచ్చే అత్యంత అరుదైన మహా కుంభమేళా నిన్నటితో ముగియగా.. మళ్లీ ఎప్పుడు అనే చర్చ తెరపైకి సహజంగానే వచ్చింది. అయితే.. తిరిగి మళ్లీ 2169 సంవత్సరంలో ఈ మహా కుంభమేళా జరగనుంది. కాగా.. అంతకు ముందు 1881లో ఈ మహా కుంభమేళా జరిగింది. అంటే.. రాబోయే తరాలు ఈ మహా ఘట్టంలో భాగం కానున్నాయన్నమాట. ఇక.. ఈ మహా కుంభమేళాలో ఓ విషాద ఘటన కూడా జరిగిన సంగతి తెలిసిందే. జనవరి 29న రెండో అమృతస్నానం సందర్భంగా రద్దీ వల్ల జరిగిన తొక్కిసలాటలో 30 మంది భక్తులు చనిపోయినట్లు యూపీ సర్కార్ వెల్లడించింది. మరికొంతమంది భక్తులు గాయపడినట్లు వెల్లడించింది. ఈ విషాద ఘటన తీవ్ర రాజకీయ దుమారం రేపింది. ఈ మహా కార్యక్రమంలో భూటాన్ రాజు జిగ్మే ఖేసర్ వాంగ్ చుక్, రాష్ట్రపతి దౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ సహా పలువురు కేంద్రమంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు పారిశ్రామిక వేత్తలు, క్రీడాకారులు, సినీతారలు, వివిధ రంగాల్లో ప్రముఖులు పాల్గొని పుణ్యస్నానాలు చేసిన సంగతి తెలిసిందే.

# ఏమైంది మైహోం భుజాకు.. వరుస ఘటనలో కొత్త వాదనలు!

హైదరాబాద్ మహనగరంలో అత్యంత ఖరీదైన భవన సముదాయాల్లో ఒకటి మైహోం భుజా. ఈ భారీ టవర్లలో పేరు ప్రఖ్యాతులున్నప్రముఖులు మాత్రమే కాదు.. పలు కార్పొరేట్ కంపెనీలకు చెందిన అత్యున్నత స్థానాల్లో ఉన్న వారు.. పెద్ద ఎత్తున వ్యాపారాలు చేసేవారు.. బంగారు.. వజ్ర వ్యాపారాలు చేసే వారికి ఇందులో ఫ్లాట్లు ఉన్నాయి. నివాస భవన సముదాయంతో పాటు.. కొన్ని కమర్షియల్ ఫ్లాట్లు కూడా ఇందులో ఉన్నాయి. అత్యంత ఖరీదైన భవనాల్లో ఒకటిగా ముందు వరుసలో ఉన్న మైహోం భుజాకు ఇప్పుడు నెగిటివ్ ఇమేజ్ ఎక్కువ అవుతోంది. ఇటీవల కాలంలో కొన్ని ఆత్మహత్యలు.. అనుమానాస్పద మరణాలతో పాటు.. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు జరుగుతున్నట్లుగా ఆరోపణలు ఎక్కువ అవుతున్నాయి. ఇవన్నీ ఒక ఎత్తు అయితే.. రెండు వారాల క్రితం ఏపీకి చెందిన



మాజీ ఎమ్మెల్యే.. వైసీపీ నేత వల్లభనేని వంశీని ఆ రాష్ట్రానికి చెందిన పోలీసులు అరెస్టు చేయటం తెలిసిందే. ఆయన మైహోం భుజాలో ఉండేవారు. తాజాగా ప్రముఖ సినీ నటుడు కం వైసీపీ నేత పోసాని క్రిష్ణ మురళిని ఏపీ పోలీసులు అదుపులోకి తీసుకోవటం తెలిసిందే. ఆయన కూడా మైహోం భుజా నివాసి కావటంతో ఈ భవన సముదాయం గురించిన ఆసక్తికర చర్చ ఇప్పుడు సోషల్ మీడియాలోనూ.. వాట్సాప్ గ్రూపుల్లోనూ నడుస్తోంది. తరచు ఏదో ఒక సంచలన ఉదంతానికి కేరాఫ్ అడ్రస్ గా మైహోం భుజా నడుస్తోంది. అదే సమయంలో అనూహ్య విషాదాలు కూడా ఇక్కడ చోటు చేసుకుంటున్నాయి. ఇలాంటి వేళ.. మైహోం భుజా వాస్తు సరిగా లేదా? అన్నది చర్చగా మారింది. వేలాది కోట్ల రూపాయిలతో నిర్మించిన ఈ భారీ భవన సముదాయంలో ఆ మాత్రం జాగ్రత్తలు తీసుకోకుండా నిర్మిస్తారా? అన్నది ప్రాథమిక ప్రశ్నగా చెప్పాలి. అయితే.. వరుసగా ఒకే పార్టీకి చెందిన ఇద్దరి ప్రముఖుల అరెస్టుకు ఒకే భవనం కావటంతో ఈ వ్యాఖ్యలు చేస్తున్నారని మాత్రం చెప్పక తప్పదు. అంతేకానీ.. వాస్తుదోషం లాంటి మాటల్ని పిచ్చ లైట్ గా తీసుకోవాల్సి ఉంది. వందలాది కుటుంబాలు ఉండే ఈ భారీ భవన సముదాయంలో హైప్రొఫైల్ వ్యక్తులు ఉండటం.. రాజకీయ పరిణామాలతో జరిగే అరెస్టులకు.. వాస్తుకు ఏ మాత్రం లింకు లేదన్నది నిజమైనప్పటికీ.. వాస్తు దోషం మాటను విన్నంతనే ఉలిక్కిపడేలా మారిందని చెప్పాలి. ఏమైనా.. పోసాని అరెస్టుతో మరోసారి మైహోం భుజా మరోసారి వార్తల్లోకి ఎక్కిందని చెప్పక తప్పదు. తాజా వాదనల పుణ్యమా అని.. మైహోం భుజాలో ఇంకెవరు వైసీపీకి చెందిన వారు ఉన్నారన్న ఆసక్తికర చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

# షాకింగ్ లెక్కలు... రష్యా సైనికులు అంత మంది మరణించారా?

సుమారు మూడేళ్లుగా రష్యా - ఉక్రెయిన్ వార్ కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత మొదలైన ఇజ్రాయెల్ %-% హమాస్ మధ్య యుద్ధం ఆయిపోయింది కానీ.. ఆ ఇరు దేశాల మధ్య యుద్ధం మాత్రం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో తాజాగా ఈ యుద్ధం మొదలై మూడేళ్లు అయ్యింది! ఈ సందర్భంగా రష్యా సైనికుల మరణాలపై షాకింగ్ లెక్కలు తెరపైకి వచ్చాయి. అవును... అవిరామంగా జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో తమ దేశంలోని సైనికుల మరణాలపై రష్యన్ స్వతంత్ర వార్తా సైట్ మీడియజోనా ఓ కీలక ప్రకటన చేసింది. ఇందులో భాగంగా... ఉక్రెయిన్ తో పోరాడుతు 1,65,000 మంది సైనికులు మరణించారని తెలిపింది. ఇందులో 95,000 మంది సైనికుల వివరాలను పేర్లతో సహా వెల్లడించింది. తాజగా మీడియాజోనా తన కథనంలో కీలక విషయాలు వెల్లడించింది. ఉక్రెయిన్ తో యుద్ధం మొదలై మూడేళ్లైన సందర్భంగా సైనికుల మరణాలకు సంబంధించిన ఫోటోలు, అధికారిక సమాచారంతో కూడిన వివరాలు వెల్లడించింది. ఈ సందర్భంగా... సైనికుడి వయసు, మరణించిన తేదీ, అతడు పని చేసిన యూనిట్, మరణించిన ప్రాంతం మొదలైన వివరాలు ఆ కథనంలో



పొందుపరిచింది. ఈ సందర్భంగా అందుబాటులో ఉంటే.. సదరు సైనికుడి ఫోటోలను కూడా ప్రచురించింది. తమ విశ్లేషణ ప్రకారం.. 2022లో సుమారు 20,000 మంది సైనికులు.. 2023లో సుమారు 50,000 మంది మరణించగా.. 2024లో ఏకంగా లక్ష మంది చనిపోయారని వెల్లడించింది. అందువల్లే ఈ యుద్ధంలో 2024 ని అత్యంత రక్తసిక్త సంవత్సరమని పేర్కొంది. 2025లో ఇప్పటివరకూ 393 మంది మరణించారని తెలిపింది. అయితే... ఈ షాకింగ్ కథనంపై రష్యా ప్రభుత్వం స్పందించలేదు. దీనిగురించి ప్రస్థావించగా.. ఆ ప్రచురణ గురించి తమకు తెలియదని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి అన్నారు. ఈ సందర్భంగా... సైనికుల మరణాలకు సంబంధించిన వివారాలు నిజమో కాదో తనకు తెలియదని.. ఈ సమాచారం రక్షణ మంత్రిత్వ శాఖ వద్ద ఉంటుందని.. అది వారి హక్కని అన్నారు. కాగా... మీడియాజోనాను రష్యన్ ప్రతిపక్ష కార్యకర్త ప్యోటర్ వెర్జిలోవ్ స్థాపించారు. అయితే... దీన్ని రష్యా ప్రభుత్వం "విదేశీ ఏజెంట్"గా ప్రకటించింది. వెర్జిలోవ్ ను తీవ్రవాదుల జాబితాలో చేర్చింది. మరోపక్క... రష్యాతో యుద్ధంలో తమ సైనికులు 46,000 మందికి పైగా మరణించారని ఉక్రెయిన్ తెలిపింది. ఇదే సమయంలో సుమారు 3.80 లక్షల మంది గాయపడ్డారని ప్రకటించింది.

# సర్వదేవతావ్రతాల పూజలకు ఉద్దిష్టం ఫాల్గుణం..





శ్రీమహావిష్ణువుకు ఇష్టమైన మాసాల్లో ఫాల్గుణం ఒకటి. పూర్ణిమ తిథిలో చంద్రుడు పూర్వ ఫల్గుణి లేదా ఉత్తర ఫల్గుణి నక్షత్ర సమీపంలో సంచరిస్తే, ఆ మాసాన్ని 'ఫాల్గుణి'గా పరిగణిస్తారు. ప్రధానంగా విష్ణు ప్రీతికరం అంటోంది భాగవతం. చైత్రాది మాసాల క్రమంలో చిట్ట చివరిది ఫాల్గుణం. ఇంతకు ముందు పదకొండు నెలల్లో చేసిన దేవతా పూజలు, వ్రతాలు ఈ చివరి మాసంలో మరో సారి ఆచరించడం విశేషం. అందుకే సర్వ దేవతా వ్రత సమాహారంగా, సర్వవ్రత సింహావ లోకనంగా కనిపిస్తుంది ఫాల్గుణ మాసం. ఫాల్గుణ మాసంలో ప్రతి తిథికీ ఒక ప్రత్యేకత ఉంది. ఫాల్గుణ శుద్ధ పాడ్యమి నుంచి పన్నెండు రోజులు పయోవ్రతం ఆచరించి మహా విష్ణువుకు క్షీరాన్నం నివేదిస్తే అభీష్ట సిద్ధి కలుగుతోందని భాగవత పురాణం వివరిస్తోంది. ఆదితి పయోవ్రతం ఆచరించి వామనుడిని పుత్రుడిగా పొందింది. విష్ణుపూజకు 'పయోవ్రతం' విశిష్టమైంది. దీన్ని శుద్ధ పాడ్యమి నాడు ప్రారంభించి పన్నెండు రోజుల పాటు కొనసాగిస్తారు. సమీపంలోని నదుల్లో స్నానమాచరించి, సూర్యుడికి అర్ఘ్యమిచ్చి, విష్ణువును షోడశోపచారాలతో పూజించి, పాలను నైవేద్యంగా సమర్పించడం సంప్రదాయం. పయస్సు అంటే పాలు. అదితి ఈ వ్రతం ఫలితం వల్లే వామనుడు జన్మించాడట. హరిహరసుతుడు అయ్యప్ప స్వామి, పాలకడలి నుంచి లక్ష్మీదేవి ఇదే మాసంలో జన్మించారు. ఇక మహాత్ములైన శ్రీకృష్ణ చైతన్యులు, రామకృష్ణ పరమహంస, స్వామి దయానంద సరస్వతిలు జననం కూడా ఈ మాసంలోనే జరిగింది. అర్జునుడి జన్మ నక్షత్రం కూడా ఇదే కాబట్టి 'ఫల్గుణ' అనే పేరుంది. కురు పాండవుల్లో కొందరు ఫాల్గుణ మాసంలో జన్మించినట్లు చెబుతారు. ఫాల్గుణ బహుళ అష్టమినాడు ధర్మరాజు, ఫాల్గుణ శుద్ధ త్రయోదశి రోజున భీముడు, దుర్యోధనుడు, దుశ్శాసనులు జన్మించినట్లు పురాణాలు తెలుపుతున్నాయి. లక్ష్మీనారాయణులు, పార్వతీ పరమేశ్వరుల్ని శుద్ధ తదియనాడు పూజించి నైవేద్యం సమర్పిస్తారు. ఈ మాసంలో రెండు రోజులు వినాయకుణ్ని ఆరాధిస్తారు. శుక్ల పాడ్యమి, చతుర్థినాడు అవిఘ్న, పుత్ర గణపతి వ్రతాల్ని ఆచరిస్తారు. శుద్ధ ద్వాదశి పయోవ్రతానికి చివరిరోజు. ఈ రోజున నరసింహస్వామిని పూజిస్తారు. దివ్యౌషధంగా భావించే ఉసిరిని శుద్ధ ఏకాదశినాడు పూజించి, ఆ చెట్టు వద్దనే 'అమలక ఏకాదశి' వ్రతం నిర్వర్తిస్తారు. దీన్ని 'అమృత ఏకాదశి' గా పరిగణిస్తారు. మదురైలోని మీనాక్షి సుందరేశ్వరుల కల్యాణం రోజు ఇది. అందుకే శివపూజ చేస్తారు. వసంత పంచమి నుంచి ఫాల్గుణ పూర్ణిమ ప్రకృతి ఆహ్లాదకరంగా ఉంటుంది. కనువిందు చేస్తుంది. చలి పూర్తిగా తగ్గదు. నులివెచ్చదనం ప్రాణానికి హాయి కలిగిస్తుంటుంది. ఫాల్గుణ మాసంలో అతి ముఖ్యమైంది వసంతోత్సవం. ఇది కాముని పండుగ, హోలికా పూర్ణిమ, కామ దహనం పేరుతో ప్రఖ్యాతి చెందింది. ఈ పర్వదినాన శివుడు, మన్మథుడు, కృష్ణుడు, లక్ష్మీదేవి పూజలందు కుంటారు. ఫాల్గుణ మాసంలో పూర్ణిమ రోజున హోళీ పండుగను నిర్వహిస్తుంటారు. ఈ పూర్ణిమ శక్తితో కూడినది. ఏ సంవత్సరమైనా పూర్ణిమ, ఉత్తర ఫల్గుణి కలిసి వస్తే ఆ రోజున మహాలక్ష్మిని షోడశోపచారాలతో ఆరాధించి లక్ష్మీ అష్టోత్తర శతనామాలు కనకధారా స్తోత్రాలను పారాయణం చేయడం మంచిది. హోళి రోజున లక్ష్మీదేవిని ఆరాధిస్తే సమస్త శుభములు కలుగుతాయని పెద్దలవాక్కు. కొన్ని దక్షిణాది ఆలయాలలో ఫాల్గుణ పూర్ణిమను చాలా గొప్పగా చేస్తారు. ఫాల్గుణ బహుళ పాడ్యమినాడే రావణుడితో యుద్ధానికి వానర సైన్యాన్ని వెంటబెట్టుకొని శ్రీరాముడు లంకకు వెళ్లాడు. చవితినాడు 'సంకట గణేశ' వ్రతం ఆచరిస్తారు. బహుళ అష్టమి నాడు సీతాదేవి భూమి నుంచి ఆవిర్భవించింది. ఫాల్గుణంలో గోదానం, ధనదానం, వస్త్రదానం, గోవిందుడికి ప్రీతి కలిగిస్తాయని శాస్త్రవచనం. అందుకే ఆ రోజున రామాయణాన్ని చదివి, సీతారాముల్ని కొలుస్తారు. ఫాల్గుణ బహుళ ఏకాదశినాడు రావణ కుమారుడు ఇంద్రజిత్తు, లక్ష్మణుడు మధ్య ప్రారంభమైన సమరం త్రయోదశి దాకా కొనసాగింది. రావణ బ్రహ్మను శ్రీరాముడు అమావాస్య రోజు వధించాడు. బహుళ అమావాస్య నాడు పితృదేవతలకు పిండప్రదానం చేసి, అన్నదానం చేస్తారు. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు


## సంపాదకీయం

### మోదీది ఫాసిస్టు సర్కారు కాదు..
### సీపీఎం వైఖరిలో చారిత్రక మార్పు

ఈ దేశంలో బద్ధ విరోధ పార్టీలు ఏవైనా రెండు ఉన్నాయంటే అవి బీజేపీ- లెఫ్ట్ పార్టీలు. బీజేపీ నాయకులతో కనీసం ఒకే వేదిక మీద ఉండేందుకు కూడా ఇష్టపడదు లెఫ్ట్ పార్టీ నాయకత్వం. వాస్తవానికి 1990కి ముందు ఈ రెండు పార్టీలు మిత్రపక్షాలు గానే ఉండేవి. కాంగ్రెస్ ను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఉండేవి. అంతెందుకు..? ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 1982లో ఆవిర్భవించిన తెలుగుదేశం పార్టీకి కమ్యూనిస్టులు, బీజేపీ మద్దతు పలికాయి. అయోధ్య రామమందిర ఉద్యమాన్ని బీజేపీ తలకెత్తుకోవడంతో వామపక్షాలు ఆ పార్టీకి దూరంగా జరిగాయి. మతతత్వ పార్టీ అంటూ బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించడం ప్రారంభించాయి. మరోవైపు దశాబ్దాలుగా వ్యతిరేకించిన కాంగ్రెస్ కు అప్పటినుంచి దగ్గరయ్యాయి. ఇప్పటికీ వామపక్ష మీడియాకు బీజేపీ వాసన కూడా గిట్టదు. మోదీ ఏ నిర్ణయం తీసుకున్నా తీవ్రంగా నిరసిస్తుంటాయి. వామపక్షాలు అంటే సీపీఎం, సీపీఐ, ఫార్వర్డ్ బ్లాక్ ఇంకా పలు పార్టీలు ఉన్నాయి. వీటిలో పెద్దన్న సీపీఎం. కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని తీవ్ర నిరంకుశ జాతీయవాద (ఫాసిస్టు) శక్తిగా పేర్కొంటూ విరుచుకుపడే ఆ పార్టీ ఇప్పుడు తన వైఖరి మార్చుకుందా? అనిపిస్తోంది. మోదీ సర్కారుపై ఫాసిస్టు ముద్ర వేసేందుకు నిరాకరిస్తోందని తెలుస్తోంది. అయితే, ఫాసిస్టు అని కాకుండా మోదీ సర్కారుకు నయా-ఫాసిస్టు అని కొత్త భాష్యం చెబుతోంది సీపీఎం. ఈ మేరకు పార్టీ ముసాయిదా తీర్మానంలో పేర్కొంది. మోదీ సర్కారును ఫాసిస్టు అని అనకుండా సీపీఎం ఆగిపోవడంపై సోదర కమ్యూనిస్టు పక్షం సీపీఐ ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. తమిళనాడు మదురైలో ఏప్రిల్ లో సీపీఎం జాతీయ కాంగ్రెస్ జరుగనుంది. అందులో ఆమోదించే విశ్లేషణాత్మక రాజకీయ తీర్మానం ముసాయిదాను చర్చ కోసం సీపీఎం కేంద్ర కమిటీ ఇటీవల రాష్ట్ర కమిటీలకు పంపింది. మోదీ సర్కారును సీపీఐ ఫాసిస్టు ప్రభుత్వం అని అంటుంది. దేశంలోకి ఫాసిజం వచ్చేసిందని మరో వామపక్షం సీపీఐ-ఎంఎల్ అభివర్ణిస్తుంది. అయితే, సీపీఐ, సీపీఐ-ఎంఎల్ లకు భిన్నంగా సీపీఎం తన రాజకీయ ముసాయిదాలో పేర్కొంది. ఇటలీ, జర్మనీ నియంతలు ముస్సోలినీ, హిట్లర్ నాటి ఫాసిజాన్ని క్లాసికల్ ఫాసిజంగా చెబుతూ.. ఆ తర్వాత వచ్చినవి అన్నీ 'నియో-ఫాసిజం'గా వర్గీకరించింది. మోదీ సర్కారును ఇప్పుడు ఈ కేటగిరీలోనే చేర్చింది. 'సామ్రాజ్యవాద అంతర్గత వైరుధ్యాల వల్ల క్లాసికల్ ఫాసిజం పుట్టగా.. నయా ఉదారవాద సంక్షోభం కారణంగా నయా-ఫాసిజం ఆవిర్భవించింది' అని సీపీఎం కొత్తగా నిర్వచించింది. బీజేపీ సిద్ధాంతకర్త ఆర్ఎస్ఎస్ను ఫాసిస్టు లక్షణాలున్న సంస్థగా సీపీఎం నిందిస్తుంది. మోదీ ప్రభుత్వాన్ని మాత్రం ఆ కేటగిరీలో చేర్చలేమని.. భారత్ ను నయా ఫాసిస్టుగా చిత్రీకరించొద్దని తీర్మానంలో అభిప్రాయపడింది. సీపీఎంలో ఈ అనూహ్య మార్పున సీపీఐ తీవ్రంగా తప్పుబడుతోంది. ఆ పార్టీ తీర్మానాన్ని సవరించుకోవాలని సీపీఐ కేరళ కార్యదర్శి వినయ్ విశ్వం అన్నారు. సీపీఎం ఆలస్యంగానైనా నిజాన్ని గ్రహించిందని.. ఇది మంచి మార్పు అని బీజేపీ పేర్కొంది.

# రాజ్యాంగ శిల్పి రాజేంద్ర ప్రసాద్ - ఫిబ్రవరి 28... భారత తొలి రాష్ట్రపతి వర్ధంతి

భారతదేశానికి అధ్యక్షునిగా రాజ్యాంగం ప్రకారం భాధ్యతలు నిర్వర్తిస్తున్న వ్యక్తిగా ఏ రాజకీయ పార్టీకి చెందకుండా స్వతంత్రుడిగా వ్యవహరించిన ప్రత్యేక వ్యక్తిత్వం భారత తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ ది. ఒక రాష్ట్రపతిగా పక్షపాత ధోరణి లేకుండా, స్వతంత్రంగా వ్యవహరించేందుకు కాంగ్రెస్ పార్టీ రాజకీయాల నుండి వైదొలగి కొత్త సంప్రదాయాన్ని నెలకొల్పిన ఆదర్శ నేత ఆయన. 1957లో రాష్ట్రపతిగా ఎన్నికై, రెండు సార్లు భారత రాష్ట్రపతిని చేపట్టిన ఏకైక వ్యక్తిగా చరిత్రలో నిలిచారు. దేశానికి మొట్టమొదటి రాష్ట్రపతిగా స్వతంత్రంగా మెలిగి, ప్రధానిని గానీ పార్టీని గానీ రాజ్యాంగ నిర్మాణంలో జోక్యం చేసుకోనీక, తరువాత రాష్ట్రపతులకు ఉదాహరణగా నిలిచారు. ప్రజలు ప్రేమగా, గౌరవంగా 'బాబూ' అని పిలుచుకునే డా. రాజేంద్ర ప్రసాద్ (1884 డిసెంబర్ 3 %–% 1963 ఫిబ్రవరి 28) భారత దేశపు మొట్టమొదటి రాష్ట్రపతి. 1950 నుండి 1962 వరకు రెండు సార్లు రాష్ట్రపతిగా బాధ్యతలను నిర్వహించారు. బీహార్ లో ప్రముఖ నాయకునిగా ఎదిగి, భారత జాతీయ కాంగ్రెస్ లో భారత స్వాంతంత్ర్యోద్యమ కాలంలో చేరారు. మహాత్మాగాంధీ మద్దతు దారునిగా 1931 లో జరిగిన ఉప్పు సత్యాగ్రహం, 1941లోజరిగిన క్విట్ ఇండియా ఉద్యమాలలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. 1946 ఎన్నికల తరువాత నెహ్రూ మంత్రి వర్గంలో ఆహారం, వ్యవసాయం శాఖకు భారత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. ఆయన భారత రాజ్యాంగ నిర్మాణ శిల్పి. 1948 నుండి 1950 వరకు భారత రాజ్యాంగ ముసాయిదా తయారీ కోసం ఏర్పరచబడిన సంఘానికి అధ్యక్షులు. 1951 సార్వత్రిక ఎన్నికల తరువాత మొదటి భారత పార్లమెంటు ఎలక్టోరల్ కాలేజ్ ద్వారా రాష్ట్రపతిగా ఎన్నుకోబడిన నేత. రాజేంద్ర ప్రసాద్ బీహార్ రాష్ట్రంలో శివాన్ జిల్లాలోని జెర్దాయ్ గ్రామంలో 1884లో డిసెంబరు 3 న జన్మించాడు. అతని తండ్రి మహదేవ్ సహాయ్ సంస్కృతం, పర్షియను భాషలలో పండితులు. తల్లి కమలేశ్వరీ దేవి ఎప్పుడూ రామాయణం నుండి కథలు వివరించేది. ఐదవ ఏటనే పర్షియన్ భాష, హిందీ భాష , అంకగణితం ను నేర్చుకోవడానికి ఒక మౌల్వీ (ముస్లిం పండితుడు) దగ్గరకు పంపించ బడ్డారు. తరువాత ఛాప్రా ప్రభుత్వ పాఠశాలలో ప్రాథమిక విద్యాభ్యాసం చేసారు. 12 సంవత్సరాల వయసులోనే రాజ్‌వంశీ దేవిని వివాహం చేసుకున్నారు. అటు తరువాత విద్యకై పాట్నాలో కె.ఘోష్ పాఠశాలలో చదువుకున్నారు. ఛాప్రా ప్రభుత్వ పాఠశాలలో చేరి కలకత్తా విశ్వవిద్యాలయ ప్రవేశ పరీక్షలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడై నెలకు రూ.30 ఉపకారవేతనం పొందారు. 1902లో అతడు కలకత్తా ప్రెసిడెన్సీ కాలేజీలో చేరాడు. మొదట్లో సైన్సు విద్యార్థి. 1904లో కలకత్తా విశ్వవిద్యాలయం నుండి ఎఫ్.ఎ ఉత్తీర్ణుడయ్యారు. అక్కడే 1905లో మొదటి స్థానంలో గ్రాడ్యుయేషన్ చేసారు. అతని అధ్యాపకులలో జగదీష్ చంద్రబోసు, ప్రఫుల్ల చంద్ర రాయ్ మొదలగువారు ఉన్నారు. ఆయన మేధాశక్తికి ఒక ఎక్జామినర్ (పరీక్షకుడు) ప్రభావితుడై అతడి పరీక్షా జవాబు పత్రంపై "పరీక్షకుని కంటే పరీక్షితుడు గొప్పవాడు" అనే వ్యాఖ్య రాశారు. 1917లో కలకత్తా విశ్వవిద్యాలయంలో ఆర్థిక శాస్త్రంలో ఎం.ఎ. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. బి.ఎల్. ఆ తర్వాత ఎం.ఎల్. పూర్తి చేసి డాక్టరేట్ కూడా పొందారు. అన్నతో కలిసి స్వదేశీ ఉద్యమాన్నీ నడిపారు. అతడు "ద్వాన్ సమాజం" లో క్రియాశీల సభ్యునిగా సేవలందించారు. అతడు పాట్నా కళాశాలలో1906లో జరిగిన బీహారీ స్టూడెట్స్ కాన్ఫరెన్సు ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. ఉపాద్యాయునిగా అనేక విద్యాసంస్థలలో పనిచేసారు. ఆర్థిక శాస్త్రంలో ఎం.ఎ పూర్తి చేసిన తరువాత అతడు బీహార్ లోని ముజఫర్‌పూర్ లాంగట్ సింగ్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకునిగా చేరారు. తరువాత ఆ సంస్థకు ప్రధానాచార్యునిగా తన సేవలనందించారు. తరువాత 1909లో కలకత్తాలోని రిప్పన్ కళాశాలలో న్యాయవాద విద్యను అభ్యసించడానికి గాను ఉద్యోగాన్ని వదిలి వెళ్ళారు. అతడు ఆ కళాశాలలో న్యాయవాద విద్యను అభ్యసించే సమయంలో కలకత్తా సిటీ కళాశాలలో ఆర్థికశాస్త్ర అధ్యాపకునిగా పనిచేసారు.



1915 లో "మాస్టర్ ఆఫ్ లా" పరీక్షలకు హాజరై ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడై బంగారు పతకాన్ని పొందారు. 1937లో అలహాబాదు విశ్వవిద్యాలయం నుండి న్యాయ శాస్త్రంలో డాక్టరేట్ డిగ్రీని పొందారు. 1916 లో, బీహార్, ఒడిషా రాష్ట్రాల హైకోర్టులలో చేరాడు. తరువాత 1917లో అతడు పాట్నా విశ్వ విద్యాలయంలోని సెనేట్, సిండికేట్ లో మొదటి సభ్యునిగా నియమింప బడ్డారు. న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించిన అనతికాలంలో స్వాతంత్ర్య పోరాటంవైపు ఆకర్షితు డై, 1906లో మొదటి సారి కలకత్తాలో నిర్వహించబడిన భారత జాతీయ కాంగ్రెస్ వార్షిక సమావేశాల ద్వారా సంబంధాన్ని పెంచుకున్నారు. 2011లో రెండవసారి వార్షిక సమావేశాల సమయంలో జాతీయ కాంగ్రెస్ లో చేరారు. 1916 లో లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ సమావేశాలలో మహాత్మా గాంధీని కలిసారు. చంపారన్ లో జరగనున్న నిజ నిర్ధారన కమిటీలోనికి తనతో పాటు స్వచ్ఛంద కార్యకర్తగా రావాలని మహాత్మా గాంధీ అతనిని కోరారు. 1918 లో'సర్చ్ లైట్'అనే ఆంగ్ల పత్రికను, ఆ తర్వాత 'దేశ్' అనే హిందీ పత్రికను నడిపారు. 1920లో భారత జాతీయ కాంగ్రెస్ ద్వారా నిర్వహించబడిన సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొన్నారు. అతడు తన లాభదాయకమైన న్యాయవాద వృత్తిని, అలాగే విశ్వవిద్యాలయంలోని అధ్యాపక వృత్తి విధులను తప్పుకున్నాడు. భారతీయ సాంప్రదాయ విధానాలలొ విద్యాభ్యాసం అందిస్తున్న బీహార్ విద్యాపీఠాన్ని 1921లో తన మిత్రబృందంతో కలిసి స్థాపించి భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా నడిపారు. 1921లో మహాత్మా గాంధీతో ఒకమారు సమావేశం తరువాత, విశ్వవిద్యాలయంలో తన సెనేటర్ పదవికి రాజీనామా చేశారు. రాజేంద్రప్రసాద్ 1934 అక్టోబరులో బొంబాయిలో జరిగిన అఖిల భారత కాంగ్రెసు మహాసభలకు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అలాగే 1939లో, నేతాజీ రాజీనామా చేసిన తరువాత, 1947లో ఇంకోసారి, మొత్తం మూడుసార్లు ఆ పదవిని చేపట్టారు. 1942 ఆగస్టు 8 న క్విట్ ఇండియా సందర్భంగా అరెస్టు చేసి, బాంకిపూర్ కేంద్ర కారాగానికి తరలించారు. దాదాపు మూడు సంవత్సరాల పాటు జైలు శిక్ష తర్వాత, 1945, జూన్ 15 న విడిచిపెట్టారు. 1946 సెప్టెంబరు 2 న ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వం జవాహర్ లాల్ నెహ్రూ నాయకత్వంలో 12 మంది మంత్రులను ఎంపిక చేయగా, రాజేంద్ర ప్రసాద్ ఆహారం, వ్యవసాయ శాఖకు మంత్రిగా పనిచేసారు. 1946 డిసెంబరు 11 న రాజ్యాంగ సభకు అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. కృపాలానీ కాంగ్రెస్ అధ్యక్షునిగా రాజీనామా చేసిన తరువాత 1947 నవంబరు 17 న కాంగ్రెస్ అధ్యక్షునిగా భాధ్యతలు స్వీకరించారు. భారత స్వాతంత్ర్యం వచ్చిన రెండున్నర సంవత్సరాల తరువాత 1950 జనవరి 26 న స్వతంత్ర భారత రాజ్యాంగం ఆమోదించ బడింది. రాజేంద్ర ప్రసాద్ ను తొట్టతొలి రాష్ట్రపతిగా ఎన్నుకున్నారు. భారతదేశంలో విద్యాభివృద్ధిని ప్రోత్సహించేందుకు ప్రధానమంత్రి నెహ్రూ కు వివిధ సందర్భాలలో సలహాల నిచ్చేవారు. "హిందూ కోడ్ బిల్" చట్టం పై వివాదాల తరువాత అతను రాష్ట్ర వ్యవహారాల్లో మరింత చురుకైన పాత్రను పోషించారు. 12 సంవత్సరాల పాటు భారత రాష్ట్రపతిగా సేవలందించి 1962 న పదవీ విరమణ చేశారు. 1963 ఫిబ్రవరి 28 న ఆయన రాం రాం అంటూ కన్ను మూశాడు. దేశ్ రత్న అని పిలువ బడిన ఆయనకు మరణానంతరం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# పలు ప్రత్యేకతల సమాహారం మొరార్జీ దేశాయ్ జీవితం - ఏటా జన్మ తేదీ లేని దివంగత ప్రధాని



పాశ్చాత్య సాంప్రదాయం ప్రకారం పుట్టిన తేదీన జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ప్రతి ఏడూ అలా పాశ్చాత్య సంస్కృతి ప్రభావాన పుట్టిన తేదీన భారత దేశంలోనూ జన్మదినం సందర్భంగా వేడుకలు జరుపుకోవడం సర్వసాధారణం. అయితే భారత దేశ చరిత్రలో సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగి, వివిధ పదవులను అలంకరించి, దాదాపు శత సంవత్సరాలు జీవించిన ఒక గొప్ప నాయకునికి అలాంటి అవకాశం లేకుండా పోయింది. అందుకే ఆ దివంగత గొప్ప నాయకుని జన్మదినం చాలా మందికి గుర్తుండదు. ఆయనే దివంగత భారత ప్రధాని మొరార్జీ దేశాయ్. కారణం ఆయన ఫిబ్రవరి 29వ తేదీన జన్మించడమే. లీపు సంవత్సరము అయితే తప్ప ఆయనది ప్రతి సంవత్సర జన్మదినం కాకపోవడమే. నాలుగు ఏళ్లకు ఒకసారి మాత్రమే ఫిబ్రవరి 29 రావడం కావడమే. జన్మదిన ప్రత్యేకత లాగే పలు విధ ప్రత్యేకతల సమాహారం మొరార్జీ జీవితం. మొరార్జీ దేశాయ్ పండిన 99 ఏళ్ళ వయసు వరకు జీవించినా, ఫిబ్రవరి 29 న జన్మించి నందున అయన తన జీవిత కాలంలో కేవలం 24 పుట్టిన రోజులను మాత్రమే చూసి, 25వది రావడానికి కొద్ది రోజుల ముందు కన్ను మూశారు. పార్లమెంటులో ఎనిమిది వార్షిక మరియు రెండు మధ్యంతర బడ్జెట్లను ప్రదర్శిస్తూ మొరార్జీ దేశాయ్ ఒక ప్రత్యేకమైన రికార్డును కలిగి ఉన్నారు. 1964 మరియు 1968 లో ఫిబ్రవరి 29 న రెండు కేంద్ర బడ్జెట్లను సమర్పించిన ఆర్థిక మంత్రిగా ఆయనకు ప్రత్యేకమైన ప్రత్యేకత ఉంది, ఇది అయన పుట్టినరోజు కావడం గమనార్హం. దేశంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని ఏర్పరచిన నేతగా చరిత్రలో మిగిలి పోయారు. అత్యధిక పౌర పురస్కారాలను అందుకున్న ఏకైక భారతీయుడిగా ఆయన గుర్తింపు పొందారు. పాకిస్తాన్ సంబంధిత అత్యున్నత పౌర పురస్కారం... నిషానే – ఎ – పాకిస్తాన్ – 1986 లో గెలుచుకున్న ఏకైక భారతీయుడు. 1991లో భారత రత్న పురస్కారం పొందారు. అలా భారత దేశం, పాకిస్తాన్ దేశాల అత్యున్నత పౌర పురస్కారాలైన భారత రత్న, నిషానే పాకిస్తాన్ లను పొందిన ఏకైక భారతీయుడు మొరార్జీ. మొరార్జీ దేశాయ్ బొంబాయి రాజ్యంలో (ప్రస్తుతం గుజరాత్) బ్లస్టర్ జిల్లాకు చెందిన భడేలీ గ్రామంలో 1896 ఫిబ్రవరి 29 న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ముంబైలోని విల్సన్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ చేసిన తరువాత ఆయన గుజరాత్ లో సివిల్ సర్వీసులో చేరారు. 1927–28 గోద్రాలో జరిగిన అల్లర్ల సమయంలో హిందువులపై మెతక వైఖరి అవలంభించాననే అపరాధ భావంతో మే1930న అతను గోద్రా డిప్యూటీ కలెక్టరు ఉద్యోగానికి రాజీనామా చేసారు. మహాత్మాగాంధీ అధ్వర్యంలో జరిగిన భారత స్వాతంత్ర్యోద్యమంలో చేరారు. భారత దేశంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో అనేక సంవత్సరాల పాటు జైలు శిక్ష అనుభవించారు. తన తెలివైన నాయకత్వ నైపుణ్యాల వల్ల స్వాతంత్ర్య సమర యోధులందరికీ అభిమాని అయ్యారు. గుజరాత్ ప్రాంతంలో భారత జాతీయ కాంగ్రెస్‌కు ముఖ్యమైన నాయకుడయ్యారు .1934, 1937 లలో ప్రాంతీయ ఎన్నికలు జరిగినప్పుడు, అతను బొంబాయి ప్రెసిడెన్సీలో వరుసగా రెవెన్యూమంత్రి, హెూంమంత్రి బాధ్యతలను చేపట్టారు. 1952లో బొంబాయి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎన్నుకో బడ్డారు. బొంబాయి రాష్ట్రం ద్వి భాషా రాష్ట్రంగా ఉండేది. బొంబాయి రాష్ట్రంలో గుజరాత్, మరాఠీ భాషలు మాట్లాడే ప్రజలు ఉండేవారు. ధృఢమైన గంధేయవాదిగా దేశాయ్, ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ సోషలిస్టు విధానాలకు వ్యతిరేకంగా సామాజిక సంప్రదాయ వాదిగా, అనుకూల – వ్యాపార, ఉచిత సంస్థ సంస్కరణలకు అనుకూలంగా ఉన్నారు. కాంగ్రెస్ నాయకత్వంలో ఎదిగిన దేశాయ్, అవినీతి వ్యతిరేక అంశాలతో తీవ్ర జాతీయ వాదిగా, ప్రధానమంత్రి నెహ్రూ, అయన మిత్రపక్షాలను విభేదించారు. దేశాయ్ ఇందిరా గాంధీ ప్రభుత్వంలో ఉప ప్రధాన మంత్రిగా సేవలనందించారు. తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో ప్రభుత్వంలో అనేక కీలక పదవులను చేపట్టారు. బొంబాయి రాష్ట్ర ముఖ్యమంత్రి, భారత హెూం మంత్రి, ఆర్థిక మంత్రి, ప్రతిపక్ష నేత పదవులతొ పాటు భారతదేశ 2వ ఉపప్రధాని పదవిని కూడా చేపట్టారు. 1977 మార్చి 24వ తేది మొరార్జీ దేశాయి ప్రధానమంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించారు. 1979 జూలై 26 వరకు భారత దేశానికి 4వ ప్రధానిగా తన సేవల నందించారు. భారత రాజకీయ చరిత్రలో 81 సంవత్సరాల వయసులో ప్రధాని పదవిలో ఉన్న నేత. అలాగే కాంగ్రెసేతర ప్రధానిగా పదవి చేపట్టి, 1979 లో ప్రధాని పదవి నుంచి తప్పుకున్నారు. రెండున్నర సంవత్సరాలు (మార్చి 1977 నుండి జూలై 1979 వరకు) మాత్రమే ప్రధానిగా ఉన్నారు. వివాదం లేకుండా ప్రజా జీవితంలో నాలుగు దశాబ్దాలు గడిపిన గొప్ప నాయకుడు. ప్రధాని పదవికి రాజీనామా చేసిన తరువాత, ఆయన ఎప్పుడూ చురుకైన రాజకీయాల వైపు తిరిగి చూడలేదు. మొరార్జీ దేశాయ్ జనతాపార్టీకి 1980 సార్వత్రిక ఎన్నికలలో సీనియర్ రాజకీయ నాయకుడిగా ప్రచారం చేశారు, కాని ఎన్నికలో పోటీ చేయలేదు. అయన "యూరిన్ థెరపీ"ని అభ్యసించే వారు. 1978లో "మూత్ర చికిత్స" దీర్ఘకాలిక అభ్యాసకుడైన దేశాయ్ డేంరాథర్ తో "60 మినిట్స్" కార్యక్రమంలో మాట్లాడుతూ మూత్రం త్రాగడం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్య చికిత్స పొందలేని లక్షల మంది భారతీయులకు మూత్ర చికిత్స అనేది పరిపూర్ణ వైద్య పరిష్కారం అని దేశాయ్ వివరించారు. స్వ మూత్రం తాగడం ద్వారా తన దీర్ఘాయువుని కాగలిగానని చెప్పారు. దీనిని "జీవజలము" అని పిలిచారు. మొరార్జీ దేశాయ్ దృష్టిలో నిజాయితీ అనేది ఒక విశ్వాసం తప్ప అవసరం కాదు. ఎట్టి పరిస్థితుల్లో అయినా ఆయన తాను నమ్మిన సిద్ధాంతాలకే కట్టుబడి ఉండేవారు. క్లిష్టమైన సందర్భాల్లో కూడా ఆయన రాజీపడిన దాఖలాలు లేవు. 'జీవితంలో ప్రతి ఒక్కరూ నిజాయితీకి కట్టుబడి నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండాలన్న ధర్మ సూత్రాన్ని' మొరార్జీ దేశాయ్ ఆచరించి చూపించారు. దేశాయ్ 1896 లో జన్మించారు. పదవీ విరమణ తరువాత అయన ముంబైలో నివసించి సంతోషంగా గడిపి, 1995 లో 99 సంవత్సరాల వయసులో మరణించారు. దేశాయ్ తన 100 వ పుట్టిన రోజుకు కొద్ది నెలల వ్యవధిలో 1995 ఏప్రిల్ 10 న కన్ను మూశారు. అత్యధిక కాలం జీవించిన దివంగత భారత ప్రధానిగా పేరు గడించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సహస్రాధిక వ్యాస రచయిత జానమద్ది - తెలుగు సాహితీ తాపసి జానమద్ది - ఫిబ్రవరి 28.. జానమద్ది హనుమచ్ఛాస్త్రి వర్ధంతి



తెలుగు భాష వికాసం కోసం అహర్నిశలూ శ్రమించి, అహరహం ఆలోచించి, నిరంతరం తపించిన సాహితీ తపస్వి జానమద్ది హనుమచ్ఛాస్త్రి. విజ్ఞాన సర్వస్వంగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా, ఎందరికో ఆదర్శప్రాయంగా, స్ఫూర్తి దాయకంగా, మార్గ నిర్దేశం చేశారు హనుమచ్ఛాస్త్రి. జానమద్ది హనుమచ్ఛాస్త్రి 1926 జూన్ 5 న అనంతపురం జిల్లా రాయదుర్గం లో జన్మించారు. జానకమ్మ , సుబ్రహ్మణ్యశాస్త్రి వీరి తల్లిదండ్రులు. ఎస్ఎసఎల్‌సీ తరువాత కొన్ని కారణాల వల్ల పై చదువులు చదవలేక పోయినా, ఉపాధ్యాయ శిక్షణ అనంతరం, ఉపాధ్యాయుడిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. ఆ తరువాత ఆంగ్లంలోను, తెలుగులోను ఎంఏ పట్టాలు పొందారు. చాలా కాలం కడప డిగ్రీ కళాశాలలో ఆంగ్లోపన్యాసకులుగా పనిచేశారు. జానమద్ది యవ్వన దశలో రంగస్థల నటుడిగా కూడా రాణించారు. నాట్య కళాప్రపూర్ణ బళ్లారి రాఘవాచారితో పరిచయం ఏర్పడటం, నాటక రంగం మీద ఆయనకు ఇష్టం ఏర్పడడమే కాక రాఘవ సరసనే పాదుకా పట్టాభీషేకం నాటకంలో నటించారు. తర్వాత చంద్రగుప్త నాటకంలో జానమద్ది చంద్రగుప్తుడు తల్లి మురా పాత్రను ఎంతో గొప్పగా పోషించారు. ఇలా రంగస్థల నటుడిగా కూడా తన ప్రతిభ కనబరిచారు. స్కూళ్ల ఇన్ స్పెక్టర్ గా, జిల్లా విద్యావిషయక సర్వే ఆఫీసర్ గా, కళాశాలలో ఇంగ్లీష్ లెక్చరర్ గా నాలుగు దశాబ్దాలు పనిచేశారు. కడప లో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపకులు. ట్రస్టును నెలకొల్పి, దాని మొదటి కార్యదర్శిగా అహర్నిశలూ పాటుపడి 10 లక్షల రూపాయల విరాళాలు సేకరించారు. జానమద్ది కృషి కారణంగా బ్రౌన్ లైబ్రరీలో దాదాపు లక్ష గ్రంథాలు, 300 వరకు తాళపత్ర గ్రంథాలు, తెలుగు గ్రామాల స్థానిక చరిత్ర తెలిపే మెకంజీ కైఫీయత్తులు, బ్రౌన్ లేఖలు, రాతప్రతులు సమ కూరాయి. బ్రౌన్ లైబ్రరీకి ఏటా ముప్పై లక్షల రూపాయల గ్రాంట్ ను ముఖ్య మంత్రి రాజశేఖర రెడ్డి తో మంజూరు చేయించుకొన్న ఘనత ఆయనది. డాక్టర్ జానమద్ది ఆరు దశాబ్దాల తన సాహితీ ప్రస్థానంలో సహస్రాధిక వ్యాసాలను రాశారు. శతాధిక ప్రముఖుల జీవిత చరిత్రలను గ్రంథస్తం గావించారు. ఆయన రచన ప్రచురించని పత్రిక లేదనే ఖ్యాతి పొందారు. ఆకాశ వాణి కేంద్రాల నుంచి అనేక అంశాలపై 150కి పైగా ప్రసంగాలు చేశారు. కరుణశ్రీ, బోయి భీమన్న, దాశరథి, పురిపండ అప్పలస్వామి, పుట్టపర్తి నారాయణాచార్యులు, శ్రీ శ్రీ, డా.బెజవాడ గోపాలరెడ్డి మొదల్కెన ప్రసిద్ధుల్కెన సాహితీ వేత్తలతో ఆయనకు సాన్నిహిత్యం ఉండేది. కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణతో ఆయనకు స్నేహం ఉండేది. తెలుగు, ఆంగ్ల, కన్నడ దిన, వార, మాస పత్రికలలో ప్రచురితమైన దాదాపుగా 2500 వ్యాసాలు వీరి నిరంతరం సాహితీ సేవకు ప్రతిబింబాలు. 1964లో పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్యకు, తాళ్లపాకలో గుడి కట్టించడానికి తాళ్లపాక గ్రామస్థులకు ప్రేరణనిచ్చి సఫలీకృతులయ్యారు. తాళ్లపాకలో ప్రసిద్ధి చెందిన అన్నమయ్య గుడికి ఆనాడు బీజం వేసింది జానమద్ది వారే. సర్వమత సౌభ్రాతృత్వంతో జీవిత యాత్ర సాగించిన ఆయన జాన్ అహ్మద్ శాస్త్రి గా పేరు గడించారు. జానమద్దికి అనేక అవార్డులు లభించాయి. 1980లో బళ్లారి రాఘవ శతజయంతి పురస్కారం, కర్ణాటక రాష్ట్ర పురస్కారం, ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ పురస్కారం, 1988లో వావిలాల గోపాలకృష్ణయ్యచే పురస్కారం, 2003లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిచే సత్కారం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కారం, లోకనాయక్ ఫౌండేషన్ సాహితీపురస్కారం, కవిత్రయ పురస్కారం, గుంటూరులో అయ్యంకి వెంకటరమణయ్య అవార్డు, అనంతపురం లలిత కళా పరిషత్ అవార్డు, ధర్మవరం కళాజ్యోతి వారి సిరిసి ఆంజనేయులు అవార్డు, కడప సవేరా ఆర్ట్స్ వారి సాహితీ ప్రపూర్ణ అవార్డు, మదనపల్లి భరతముని కళారత్న అవార్డు, తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారం, ఢిల్లీ ఆంధ్ర సంఘం సత్కారం, అయ్యంకి వెంకటరమణయ్య పురస్కారం... ఇలా మూడు పదులకు పైగా సత్కార, పురస్కారాలను అందుకొన్నారు. ఉడిపి పెజావరు పీఠాధిపతిచే 'ధార్మికరత్న' బిరుదు మొదలైన అనేక పురస్కారాలు ఇతనికి లభించాయి. శాస్త్రిగారి నిర్విరామ తెలుగు భాషా సాహిత్యసేవను గుర్తించి జ్ఞానపీఠ పురస్కార్ గ్రహీత డా.సి.నారాయణరెడ్డి ఆయనను 'బ్రౌన్‌శాస్త్రి' బిరుదుతో సత్కరించారు. తనకెన్ని సత్కారాలు జరిగినా ఈ బిరుదు తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందని చెప్పేవారు. జానమద్ది హనుమచ్ఛాస్త్రి ఫిబ్రవరి 28,2014న మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతూ కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు

శుక్రవారం 28 ఫిబ్రవరి 2025

# రూ.కోట్లు వృథా..!

నల్గొండ : అధికారుల నిర్లక్ష్యం..పాలకుల అలసత్వం వెరసి రూ.కోట్ల విలువైన భవనాలు శిథిలావస్థకు చేరాయి. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నల్గొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి సంత ఫలితాలను ఇవ్వలేకపోతోంది. యార్డు నిర్మాణం చేపట్టి 13 ఏళ్లు గడుస్తున్నా ఎలాంటి నిర్వహణ కార్యకలాపాలు నిర్వహించకపోవడంతో ఆరంభ శూరత్వంగా మారింది. రూ.కోట్ల నిధులు వెచ్చించి నిర్మించిన భవనాలు, సంత కోసం కేటాయించిన స్థలం నిరుపయోగంగా మారిపోతున్నాయి. దీంతో గొర్రెల మేకల పెంపకందారులకు,



వ్యాపారులకు ప్రయోజనం లేకుండా పోయింది.

**నిర్వహణపై దృష్టి ఏదీ..!**

గొర్రెల, మేకల పెంపకందారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు 2012లో అప్పటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వం నల్గొండ జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి మేకల సంత నిర్వహించాలని నిర్ణయించింది. పట్టణ పరిధిలోని నకిరేకల్-మాచర్ల జాతీయరహదారి (565) పక్కన ఏఎమ్మార్పీకి సంబంధించిన స్థలంలో 5 ఎకరాల స్థలాన్ని యార్డుకు ప్రభుత్వం కేటాయించింది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన నిధుల ద్వారా ఆస్థలంలో రెండు అంతస్తులతో కూడిన కార్యాలయ భవనం, సంత నిర్వహణకు అవసరమైన భవనాలు, నీటి సౌకర్యార్థం నిల్వ ట్యాంకు, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పించారు.

అధికారుల నిర్లక్ష్యం..పాలకుల అలసత్వం వెరసి ప్రభుత్వ ఆశయం నీరుగారిపోయింది. నిర్వహణ లేమితో పూర్తిగా ముళ్ల పొదలతో నిండిపోయింది. భవనాలు శిథిలావస్థకు చేరాయి. తెలంగాణలో ఆశించిన స్థాయిలో గొర్రెలు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వం పొరుగున ఉన్న కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన సంతలను ఆశ్రయించి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. అదే తెలంగాణలో పెద్ద సంతలు నిర్వహించినట్లయితే ఇతర రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. రవాణా ఛార్జీల భారం తగ్గుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హైదరాబాద్ శంషాబాద్ మార్కెట్ల మాదిరిగానే నల్గొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మార్కెటు యార్డు (సంత) నిర్వహణను పున:ప్రారంభించాలని యాదవ, కురుమ సంఘాలు, గొర్రెల, మేకలపెంపకం దారులు సొసైటీల సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

# ఏడుతోంది.. పొలం'బాట'..!

సూర్యాపేట : ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలోని పుప్పాలగూడెం వెళ్లే మార్గంలో డొంక దారి ఇది. ఈ బాట నుంచే రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్తున్నారు. కాగా నిత్యం వర్షాకాలంలో మోకాళ్ల లోతు గుంతలతో, బురద మధ్య నరకయాతన అనుభవిస్తూ అన్నదాతలు పొలాల వద్దకు చేరుకుంటారు. ఇలాంటి దారులకు ఈ వేసవిలో వంద రోజుల ఉపాధి పనిలో భాగంగా మోక్షం కలగనుంది. రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే దారులను బాగు చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. అందులో భాగంగా ఉపాధి హామీ పనిలో భాగంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న కంపచెట్ల నరికివేత, మట్టి దారుల్లో గుంతలను పూడ్పించి చదును చేసేందుకు చర్యలు తీసుకుంటోంది. దీంతో కూలీలకు ఉపాధి కలిగి, రైతులకు ఎంతో ఉపయుక్తం కానుంది.

ఇప్పటికే వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే దారులు అధ్వానంగా ఉన్న రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది. సంబంధిత రైతులు ఎంపీడీవో కార్యాలయాల్లో, గ్రామ పంచాయతీ కార్యదర్శికి ఆయా వ్యవసాయ బావుల సర్వే నెంబర్లు, పేర్లతో ఫిర్యాదు అందించాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఆయా దారులను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తారు. ఆ తరువాత ఆయా దారులను మరమ్మతుల చేయనున్నారు.

జిల్లా వ్యాప్తంగా 23 మండలాల్లోని 475 పంచాయతీల్లో ఇప్పటివరకు



42 దరఖాస్తులు అందాయి. కాగా ఇప్పటికే ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయి. 58,463 మంది కూలీలు పని చేస్తున్నారు. అందులో భాగంగా రహదారులను బాగు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రహదారిలో గుంతలను పూడ్చేందుకు రహదారికి ఇరువైపులా కాల్వలు తీసి ఆ మట్టిని గుంతల్లో పోయనున్నారు. దీంతో వర్షం నీరు వెళ్లేందుకు కాల్వలు ఉపయుక్తం కానుండటంతోపాటు పొలాలకు నీరు దరి చేరనుంది. దీంతో ఒకేసారి రెండు పనులు పూర్తి కానున్నాయి.

**యుద్ధ ప్రాతిపదికన చేపడతాం: అప్పారావు, డీఆర్డీవో, సూర్యాపేట**

పంట పొలాలకు వెళ్లే బాటలను మరమ్మతులు చేసేందుకు ఆదేశాలు అందాయి. ప్రస్తుతం దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. త్వరలో పనులు ప్రారంభించేందుకు కార్యాచరణ రూపొందించాం. క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పనులను ఎప్పటికప్పుడు పరిశీలించేలా ఆదేశాలు జారీచేశాం. పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

# రాజన్నక్షేత్రం.. ఆధ్యాత్మిక వైభవం



సిరిసిల్ల: దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయంలో నేటి నుంచి మూడు రోజుల పాటు అత్యంత వైభవోపేతంగా జరిగే మహాశివరాత్రి వేడుకలకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. దాదాపు రూ.2.03 కోట్లతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. రాజన్న ఆలయంతో పాటు పట్టణంలోని ప్రధాన కూడళ్ల స్వాగత తోరణాలతో, విద్యుత్తు దీపాల అలంకరణతో మహా జాతర శోభను సంతరించుకున్నాయి. ఆలయ పార్కింగ్ ప్రాంతంలో భక్తులు జాగారాలు చేసేందుకు భారీగా చలువ పందిళ్లు వేశారు. పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు శివార్చన వేదికను తీర్చి దిద్దారు. రెండు రోజుల పాటు దాదాపు 700 మంది కళాకారులు ప్రదర్శన ఇవ్వనున్నారు.

**కొందరి తీరుతో తప్పని అవస్థలు**

రాజన్న దర్శనానికి మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూలైన్లలోకి చేరతారు. వీఐపీలు, స్థానిక నాయకుల రాకతో అక్కడ విధుల్లో ఉన్న కొందరు పోలీసులు దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేస్తుంటారు. తెలిసినవారిని దొడ్డిదారిన దర్శనానికి పంపిస్తుంటారనే విమర్శలున్నాయి. దీంతో ప్రధాన ఆలయం ఆవరణలో భక్తుల రద్దీ పెరుగుతుంది. కోడె మొక్కులు చెల్లించుకునేవారికి ప్రదక్షిణలకు ఇబ్బందులు ఎదురవుతాయి. క్యూలైన్లు నిలిపివేయకుండా సాఫీగా దర్శనాలు కొనసాగేలా పోలీసులు వ్యవహరించాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఆలయ ఈవో వినోద్‌రెడ్డిని 'ఈనాడు' సంప్రదించగా దర్శనాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశామన్నారు. నాలుగు లక్షల మంది భక్తులు వస్తారనే అంచనాతో సదుపాయాలు కల్పిస్తున్నాం. చలువ పందిళ్లు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీరు ఏర్పాటు చేశాం. భక్తులకు మజ్జిగ, పండ్లు, అల్పాహారం అందించడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు.

**778 ప్రత్యేక బస్సులు**

కరీంనగర్ రీజియన్‌లోని 11 డిపోల నుంచి 778 ఆర్టీసీ బస్సులను వేములవాడకు నడిపించేందుకు ఏర్పాట్లు చేశారు. తిప్పాపూర్ బస్టాండ్ నుంచి ఆలయ పార్కింగ్ వరకు మరో 14 ఆర్టీసీ ఉచిత బస్సులను భక్తులకోసం సిద్ధం చేశారు. వేములవాడ ఆర్టీసీ బస్టాండ్, గ్యాస్‌గోదాం వద్ద రెండు తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేశారు.

జాతర సందర్భంగా అధికారులు పారిశుద్ధ్యం, వైద్యం సేవలపై దృష్టి సారించారు. ఆలయ పరిసరాలు, ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతం, క్యూలైన్లలో పారిశుద్ధ్య నిర్వహణకు దాదాపు 1200 మంది, పట్టణంలో శుభ్రతకు 505 కార్మికులకు విధులు కేటాయిస్తున్నారు.

జాతరకు వచ్చే భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకునే అవకాశం ఉండటంతో ఆలయ అధికారులు కోడెలను సిద్ధం చేశారు. నాలుగు గంటలను ఒక షిఫ్టుగా విభజించి షిఫ్టుకు 60 కోడెల చొప్పున సిద్ధంగా ఉంచుతున్నారు.

# నివేదిక సిద్ధం.. పరిశీలనే ఆలస్యం



సారంగాపూర్: బీర్‌పూర్, ధర్మపురి మండలాల చివరి ఆయకట్టు రైతులకు నీరందించేందుకు ప్రారంభించిన బీర్‌పూర్ రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు వేగవంతమయ్యాయి. 0.25 టీఎంసీ నుంచి 1 టీఎంసీ సామర్థ్యం పెంచేందుకు చేపట్టిన పనుల్లో అటవీ అనుమతులు జాప్యం కావడంతో ప్రస్తుతం రెవెన్యూ శాఖ భూములు అప్పగించడంతో అటవీశాఖ పరిశీలించి, అవసరమైన నిధుల కోసం ప్రభుత్వానికి నివేదించేందుకు ప్రతిపాదనలు తయారు చేశారు.

**అటవీశాఖకు భూముల అప్పగింత**

ప్రాజెక్టు ఆధునికీకరణలో ముంపునకు గురవుతున్న 335 హెక్టార్ల అటవీభూములకు బదులు పెగడపల్లి, వెల్గటూర్, గొల్లపల్లి మండలాల్లోని రెవెన్యూ భూములను అప్పగించారు. ఇందులో పెగడపల్లి మండలంలోని దేవికొండలో 361 సర్వే నంబరులో 40.62 హెక్టార్లు, నంచెర్లలో 379/1లో 100.21 ఎకరాలు, గొల్లపల్లి మండలం చందోళిలో 54/2, 54/1లో 123.90 హెక్టార్లు, దట్నూర్ 112లో 32.05 హెక్టార్లు, వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట్‌లో 364/అ/1లో 38.22 హెక్టార్ల భూమిని అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

**అడవుల అభివృద్ధికి ప్రతిపాదనలు**

రెవెన్యూ అధికారులు భూములు అప్పగించడంతో అటవీశాఖ అధికారులు అడవుల అభివృద్ధి చేపట్టేందుకు పరిశీలన పూర్తి చేశారు. మూడు రకాలుగా విభజించి అటవీ సంపద పెంచేందుకు అవసరమైన నిధులు, చేపట్టాల్సిన చర్యలపై నివేదిక తయారు చేశారు. వన్యప్రాణుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, అడవుల సంరక్షణకు చేపట్టాల్సిన వాటి కోసం రూ.12 నుంచి రూ.15 కోట్లు అవసరమవుతున్నట్లు ప్రాథమికంగా ప్రతిపాదనలు తయారు చేశారు. వన్యప్రాణుల సంరక్షణ కోసం 100 పర్క్‌లేషన్ ట్యాంకులు, 30 చెక్‌డ్యాంల నిర్మాణాలు, వేసవిలో వన్యప్రాణుల దాహార్తికి 200 సాసర్ ఫిట్లు ఏర్పాట్లు, అటవీ భూమి కోతకు గురికాకుండా రాళ్ల కట్టలు నిర్మించనున్నారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖ అప్పగించిన భూములలో అనువైన చెట్ల పెంపకం చేపట్టేందుకు అధికారులు పరిశీలించారు. 810 ఎకరాల్లో దాదాపు 53 వేల చెట్లు మునిగిపోతుండగా వాటి సంరక్షణకు చేపట్టాల్సిన అవసరమైన చర్యలపై నివేదిక తయారు చేశారు.

అటవీశాఖ నివేదించిన ఆధారంగా ప్రాజెక్టు స్క్రీనింగ్ కమిటీ అధికారుల బృందం పరిశీలించనుంది. ఇందులో అటవీశాఖ, ఇంజినీరింగ్ రాష్ట్ర అధికారుల బృందం సంయుక్తంగా ప్రాజెక్టును పరిశీలించనుంది. అధికారులు ఆధునికీకరణతో సాగయ్యే ఆయకట్టు, రైతుల ప్రయోజనం, అవసరాలపై వివరాలు సేకరించనున్నారు.

**రెవెన్యూ భూములు అప్పగించాం**

రోళ్లవాగు ఆధునికీకరణ పనులు వేగవంతం చేసి పూర్తి చేసేందుకు ఇప్పటికీ ముంపునకు గురవుతున్న అటవీ భూములకు బదులుగా 335 హెక్టార్ల రెవెన్యూ భూమిని అప్పగించాం. ప్రస్తుతం రైతులకు ఇబ్బంది లేకుండా సాగునీరు అందుతుంది. అటవీశాఖ నివేదిక ఆధారంగా అటవీ అనుమతులు రాగానే పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం.

– సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్

**నిధులు మంజూరుకాగానే..**

ప్రాజెక్టు ఆధునికీకరణలో ముంపునకు గురవుతున్న భూములకు బదులుగా అందించిన వాటిలో అటవీ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేశాం. ఆయా భూములలో అనువైన చెట్లు, భూగర్భ జలాల పెంపునకు నిధుల అవసరంపై ప్రతిపాదనలు తయారు చేశాం. నిధులు మంజూరు కాగానే అడవుల అభివృద్ధి పనులు చేపట్టనున్నాం.

– శ్రీనాథ్, రేంజ్ అధికారి, అటవీశాఖ

# ఆధునికీకరణకు అడుగులు పడేనా!

కరీంనగర్: సాగునీటి కాలువల పరిస్థితి ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా మారింది. చిన్నకాలువలు శిథిలమయ్యాయి. ఎక్కడికక్కడ లైనింగ్ దెబ్బతిని, గండ్లుపడి, చెట్ల పొదలు మొలిచి నీటిపారుదలకు అడ్డంకిగా మారాయి. ఎస్సారెస్పీ, ఎగువ, మధ్య, దిగువ మానేరు, ఎల్లంపల్లి జలాశయాలకు అనుబంధంగా ఉన్న కాలువలు చాలాచోట్ల రూపు కోల్పోయాయి. దశాబ్ద కాలంగా వీటి మరమ్మతులకు పూర్తిస్థాయి నిధులు రాలేదు. మూడేళ్ల కిందట వీటన్నింటికి చిన్నపాటి మరమ్మతులకు రూ.1008 కోట్లు నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపారు. పెరిగిన ఖర్చుల దృష్ట్యా ప్రస్తుతం రూ.1500 కోట్ల వరకు అవసరమని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

**సర్వేతోనే సరిపెట్టారు..!**

ప్రతి వేసవి వచ్చిందంటే రైతుల ఆశలన్నీ ఈ కాలువల మరమ్మతులపైనే ఉంటుంది. ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌కు అనుబంధంగా ఉన్న కాలువల్లో పిచ్చి మొక్కలు పెరిగి నిరుపయోగంగా మారాయి. ఈ ప్రాజెక్టు పరిధిలో 1,65,700 ఎకరాల ఆయకట్టుంది. ఎగువ మానేరు కుడి, ఎడమ కాలువల పరిధిలో ఉప కాలువల పరిస్థితి దయనీయంగా మారడంతో 13,085 ఎకరాలకు పూర్తిగా నీరందడం లేదు. మూడేళ్ల కిందట ఎక్కడెక్కడ ఏఏ పనులు చేపట్టాలని అధికారులు సర్వే చేపట్టారు. ప్రాథమికంగా ఏ పనులను అత్యవసరంగా చేపట్టాలనే వాటిని గుర్తించారు. కానీ పంపిన ప్రతిపాదనలు బుట్టదాఖలవడంతో మరోసారి అప్పటి ప్రతిపాదనలను సరిచూసి ఈ సారి నిధుల అంచనాలు రూపొందిస్తున్నారు.

**కొన్నేళ్లుగా ఊసే లేదు!**


ఉమ్మడి జిల్లాలోని 5.73 లక్షల ఎకరాల స్థిరీకరణతోపాటు మరో 30వేలకుపైగా కొత్త ఆయకట్టుకు జిల్లాలోని కాకతీయ, వరద కాలువల



నీళ్లే ఆధారం. ఎస్సారెస్పీకి అనుబంధంగా దాదాపు 150 కి.మీ.ల పరిధిలో కాకతీయ కాలువ ఏర్పాటైంది. దీని పరిధిలో ప్రధాన, డిస్ట్రిబ్యూటరీ, చిన్న కాలువలు వేలాది కి.మీ.లు విస్తరించి ఉన్నాయి. వీటిలో పారే నీటితోనే 5,338 చెరువులకు, పంట పొలాలకు నీరు చేరుతోంది. వీటిని నిర్మించిన తరువాత పూర్తిస్థాయి మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. 2015-18 మధ్య కాకతీయ కాలువ లైనింగ్ పనుల్ని మాత్రం అక్కడక్కడా చేశారు. ఎస్సారెస్పీ నుంచి ఎల్ఎండీ దిగువ వరకు పూర్తిగా ఆధునికీకరించాలని భావించినా కార్యరూపం దాల్చలేదు. అనుబంధ కాలువల సిమెంట్ లైనింగ్ దెబ్బతిన్న పరిస్థితి నేటికీ నెలకొంది. చొప్పదండి మండలం కొలిమికుంట

# 'ఫలం' ఇంటికే వచ్చేస్తుందిక..!

మిర్యాలగూడ : ఇటీవలి కాలంలో ప్రజలు ఆరోగ్యాలను కాపాడుకునేందుకు రకరకాల ప్రయోగాలు, కసరత్తులు చేస్తున్నారు. దీనికి తోడు సామాజిక మాధ్యమాల పరిధి విస్తృతం కావడంతో అనేక మంది వైద్యులు, యోగా శిక్షకులు, న్యూట్రిషన్ల సలహాలు నిత్యం వందల కొద్దీ మన సెల్ ఫోన్లలో ప్రత్యక్షమవుతున్నాయి. దీంతో అనేక మంది వారికి నమ్మకం కలిగిన సలహాలను స్వీకరిస్తూ.. పాటిస్తున్నారు. చిరు ధాన్యాలు, కూరగాయలు, ఆకుకూరల రసాలు, రాగి, జొన్న జావలు, గానుగ నూనెలు వంటివి ఈ కోవలోకే వస్తాయి. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. తాజాగా నగరాలకే పరిమితమైన పండ్ల ముక్కలు సైతం ఉమ్మడి జిల్లాలో విక్రయాలకు పెడుతున్నారు. గతంలో మనకు అవసరం ఉన్న పండ్లు కొనుక్కొని తినేవారు. అయితే ధర ఎక్కువగా ఉంటే పేద, మధ్య



తరగతి కొనేందుకు వెనకాడేవారు. అయినా ఒకసారికి ఒకటి, రెండు రకాల పండ్లు మాత్రమే కొనుగోలు చేస్తారు. అయితే ఇటీవల కాలంలో నగరాల్లో పలు రకాల పళ్ల ముక్కలు ఇంటి వద్దకే పంపిణీ చేస్తున్నారు. నాలుగైదు రకాల పండ్ల ముక్కలతో పాటు డ్రైఫ్రూట్స్, మొలకలు సైతం అందిస్తుండడంతో వీటికి ఆదరణ బాగుంది. ఈ సంస్కృతి ఇప్పుడు ఉమ్మడి జిల్లాలోని పట్టణాలకు సైతం విస్తరిస్తుంది. మిర్యాలగూడకు చెందిన యువకుడు ఈ పండ్ల ముక్కల పంపిణీ ఇటీవలే శ్రీకారం చుట్టి విజయవంతంగా నడిపిస్తున్నారు. త్వరలోనే నల్గొండలో సైతం పంపిణీకి సిద్ధమవుతున్నట్లు యువకుడు చెబుతున్నాడు. ప్రతి రోజు సీజన్‌లో దొరికే పలు రకాల పండ్లు. మొలకలు, ఉడకబెట్టిన గింజలు, డ్రైఫ్రూట్స్ పంపిణీ చేస్తున్నానని యువకుడు కల్యాణ్ చెబుతున్నాడు. దీనిని వ్యాపారంగా కాకుండా సామాజిక బాధ్యతగా చేస్తున్నానన్నారు.

# మహిమాన్విత క్షేత్రం.. ఏడుపాయల

మెదక్ : ప్రసిద్ధ ఏడుపాయల వనదుర్గమ్మ పుణ్యక్షేత్రానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. మంజీరానది ఏడుపాయలుగా చీలి ప్రవహించడంతో ఈ ప్రదేశానికి ఏడుపాయల అని పేరొచ్చింది. దేశంలోనే రెండో వనదుర్గా ఆలయంగా ప్రాచుర్యం పొందింది. ఏటా జరిగే జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రకు చెందిన లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మను దర్శించుకుంటారు. బుధవారం నుంచి వేడుకలు షురూ కానున్నాయి.

**ఆలయ విశిష్టత..**

ఏడుపాయల ఆలయం మెదక్ జిల్లా పాపన్నపేట మండలం నాగ్సాన్‌పల్లి శివారులో ఉన్న అటవీప్రాంతంలో ఉంది. ఓ నదీపాయ ఒడ్డున రాతిగుహలో అమ్మవారు స్వయంభూగా వెలిసింది. నల్లసరపు రాతిపై చెక్కిన అమ్మవారి రూపం భక్తులను ఆకట్టుకుంటుంది. జాతర సందర్భంగా అమ్మవారిని స్వర్ణకిరీటం, వజ్ర వైఢుర్యాల నగలతో అలంకరిస్తారు. ఓ వైపు ఆధ్యాత్మికతను పంచుతూనే మరోవైపు ఆహ్లాదాన్ని పంచుతోంది. ఆలయం వెనక ఉన్న గుట్టపై ఉన్న మునిపుట్ట, ఆలయం సమీపంలో నిజాం కాలంలో నిర్మించిన వనదుర్గా ప్రాజెక్టును సందర్శిస్తుంటారు.

**మూడు రోజులు వేడుకలు**

జాతరలో బోనాలు, ఎడ్ల బండ్లు, పటాలు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల సిగాలు.. తెలంగాణ సంస్కృతికి అద్దం పడతాయి. మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే ఈ జాతరను ప్రభుత్వం రాష్ట్ర పర్యాటక ఉత్సవంగా నిర్వహిస్తోంది. ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాల సమర్పణతో వేడుకలకు శ్రీకారం చుడతారు. రెండో రోజు గురువారం



సాయంత్రం ప్రధాన ఘట్టం బండ్ల ఊరేగింపు ఉంటుంది. చివరి రోజు రథోత్సవం ఉంటుంది. భక్తుల సౌకర్యార్థం షామియానాలు, తాగునీటి కుళాయిలు, తాత్కాలిక శౌచాలయాలు, పార్కింగ్ స్థలాలు, ప్రత్యేక క్యూలైన్లు, జల్లు స్నానాలకు ఏర్పాట్లు పూర్తిచేశారు.

**400 ప్రత్యేక బస్సులు**

ఏడుపాయల జాతరకు ఆర్టీసీ ఆధ్వర్యంలో మెదక్ రీజియన్ నుంచి 400 ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపించనుంది. ఈ నెల 26 నుంచి 28 వరకు జరిగే వేడుకలకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రయాణ ప్రాంగణలను శుభ్రంగా ఉంచడంతో పాటు తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు. టేకులగడ్డ బస్టాండ్ నుంచి ఆలయం సమీపానికి 10 ఉచిత సర్వీసులను నడిపించనున్నారు.సర్వీసులు ఇలా.. మెదక్-బాలానగర్ నుంచి టేకులగడ్డ మార్గంలో..: 300

సంగారెడ్డి, శంకర్‌పల్లి, సదాశివపేట, జోగిపేట నుంచి టేకులగడ్డకు..: 50నాగ్సాన్‌పల్లి మీదుగా బొడ్మట్‌పల్లి, నారాయణఖేడ్ మార్గంలో..: 50ఇవే కాకుండా 20 ప్రత్యేక సర్వీసులను అందుబాటులో ఉంచనున్నారు.

చురకలు



# ఆటలతో ఆటలు

హైదరాబాద్ : కోటిన్నర జనాభా ఉన్న నగరంలో బల్దియా మైదానాలు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ల్లో ఒక్క క్రీడా శిక్షకుడు లేడంటే ఆశ్చర్యమే కదా. తాత్కాలిక శిక్షకులతో నెట్టుకొస్తూ.. యంత్రాంగం మమ అనిపిస్తోంది. దీని ప్రభావం ఔత్సాహిక క్రీడాకారులపై పడుతోంది. పేద, మధ్య తరగతి యువత ప్రైవేటు అకాడమీల్లో శిక్షణ పొందలేక ఆటలకు దూరమవుతున్నారు. ప్రతిభగల క్రీడాకారులు వెలుగులోకి రాలేకపోతున్నారు.

**నాటి వైభవం..**క్రికెట్, ఫుట్‌బాల్, బాక్సింగ్, హాకీ, బ్యాట్మింటన్ వంటి క్రీడలకు బల్దియా మైదానాలు, స్పోర్ట్స్ కాంప్లెక్సులు అనేక మంది క్రీడాకారులను అందించాయని అధికారులు చెబుతున్నారు. అప్పట్లో సర్కిల్‌కు ఒక గేమ్ ఇన్‌స్పెక్టర్, పదుల కొద్దీ పూర్తిస్థాయి కోచ్‌లు ఉ



ండేవారు.

**నేటి ప్రభావం**

ప్రస్తుతం క్రీడల విభాగంలో జోన్‌కు ఒకరు చొప్పున పనిచేస్తున్న ఆరుగురు గేమ్ ఇన్‌స్పెక్టర్లు, అదనపు కమిషనర్, ఆయన కార్యాలయంలో పనిచేసే ఇతర ఉద్యోగులు మాత్రమే. 1990 నుంచి జీహెచ్ఎంసీలో పూర్తిస్థాయి శిక్షకుల నియామకం జరగక పోవడం గమనార్హం. ఎల్బీనగర్ జోన్‌లో 69 మైదానాలు, 3 స్పోర్ట్స్ కాంప్లెక్సులు ఉన్నా ఒక్క కోచ్‌ను కూడా కేటాయించలేదు. కూకట్‌పల్లి జోన్‌లో ఇద్దరు, శేరిలింగంపల్లి జోన్‌లో ఆరుగురు తాత్కాలిక శిక్షకులు మాత్రమే పనిచేస్తున్నారు. బాక్సింగ్, క్రికెట్, వాలీబాల్, స్కేటింగ్, సైక్లింగ్ వంటి ఆటల్లో శిక్షణకు నోచుకోవడం లేదు. 134 మంది కోచ్‌లు అవసరమని ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల నుంచి అభ్యర్థనలు వచ్చాయి. జీహెచ్ఎంసీ అంచనాల ప్రకారం. 150 నుంచి 160 మంది అవసరమని గుర్తించారు.

# పనులు పూర్తయినా.. పై వంతెన ప్రారంభించరేం?

హైదరాబాద్ : గోల్నాక నుంచి అంబర్‌పేట వరకు పైవంతెన నిర్మాణం పూర్తయి నెలవుతోంది. దాదాపు రూ.350 కోట్లు ఖర్చయ్యాయి. నేటికీ ప్రారంభించకపోవడంతో వాహనదారులకు, స్థానికులకు తిప్పలు తప్పట్లేదు. ఐదో ఏటా నరకం చవిచూస్తున్నారు. పెండింగులో ఉన్న చిన్నపాటి సమస్యలను పరిష్కరించలేక ప్రజాప్రతినిధులు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు. మరికొంత సమయం కావాలంటూ అధికారులు సైతం నాన్చుతున్నారు.

**కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేతుల మీదుగా..**

అంబర్‌పేట పైవంతెన నిర్మాణానికి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ 2018లో శంకుస్థాపన చేశారు. అనంతరం రెండేళ్లకు పనులు మొదలయ్యాయి. ఐదేళ్ల తర్వాత పైవంతెన నిర్మాణం పూర్తయింది. ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతున్నప్పుడు.. అంబర్‌పేట మీదుగా నల్లకుంట, గోల్నాక, ముసారాంబాగ్, రామంతాపూర్, ఉప్పల్ ప్రాంతాల మధ్య నిత్యం రాకపోకలు సాగించే వేల మందికిపైగా వాహనదారులు ప్రత్యక్ష నరకం అనుభవించారు. నెలరోజుల క్రితం పైవంతెన పూర్తికాగా.. నేటికీ అవే కష్టాలు కొనసాగుతున్నాయి. ఫ్లైఓవర్ నిర్మాణానికి వేసిన పిల్లర్లతో దానికింద శ్రీరమణ థియేటర్ చౌరస్తా సమీపంలోని రోడ్డు ఇరుకుగా మారడంతో.. అక్కడి ఖబ్రస్థాన్ మీదుగా స్టీలు బ్రిడ్జి నిర్మించేందుకు ముస్లిం మతపెద్దలతో చర్చలు జరుపుతున్నామని అధికారులు చెబుతున్నారు. వారు అంగీకారం తెలిపాక 15 రోజుల్లో పనులు పూర్తిచేసి పైవంతెనను ప్రారంభిస్తామని చెబుతున్నారు. పంజాగుట్ట హిందూ శ్మశానవాటికపై ఇనుప దిమ్మెలతో కట్టిన వంతెన తరహాలో అంబర్‌పేటలోనూ నిర్మిస్తామంటున్నారు. వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. రోడ్డు విస్తరణ ప్రతిపాదనకు సంబంధిత వర్గాలు ఒప్పుకోవట్లేదు.ప్రయోజనం ఇలా.. ఛే నంబరు చౌరస్తా, శ్రీరమణ థియేటర్ చౌరస్తాలపై 1.5 కి.మీ. పొడవు, నాలుగు లైన్ల వెడల్పుతో వరంగల్ జాతీయ రహదారిపై చేపట్టిన పైవంతెన అందుబాటులోకి వస్తే.. మహాత్మాగాంధీ బస్టాండు, ఉప్పల్ కూడళ్ల మధ్య రాకపోకలు సాగించే వాహనాలు రయ్యిమంటూ సాగిపోతాయి.



ముసారంబాగ్, నల్లకుంట సమీప ప్రాంతాల్లోని ప్రధాన రహదారులపైనా ట్రాఫిక్ సమస్య తగ్గుతుంది.

**ఉప్పల్ కూడలిలోనూ నిలిచిన పనులు**

వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్సార్డీపీ)లో భాగంగా ఉప్పల్ కూడలిలో, అక్కడి నుంచి రామంతాపూర్ వైపు, ఉప్పల్ క్రికెట్ స్టేడియం రోడ్డులో పైవంతెనల నిర్మాణం కూడా నిలిచిపోయింది. నాలుగేళ్ల కిందట శంకుస్థాపన జరిగింది. వాటి పురోగతి మాత్రం 5 శాతానికి మించలేదు. నారపల్లి నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు నిర్మిస్తున్న పైవంతెనను.. అక్కడి నుంచి రామంతాపూర్ వైపు కొనసాగించి, కూడలిలో, స్టేడియం రోడ్డుపై పైంతెనలను నిర్మించాలన్న లక్ష్యాన్ని జీహెచ్ఎంసీ అటకెక్కించింది. కూడలి నుంచి రామంతాపూర్ వైపు చేపట్టిన పిల్లర్ల నిర్మాణం సగంలో నిలిచిపోవడం ప్రమాదాలకు కారణమవుతోంది. సర్వే ఆఫ్ ఇండియా సంస్థ 8 ఎకరాలు, ప్రైవేటు వ్యక్తుల 6 ఎకరాల స్థలాన్ని సేకరించలేక పనులు ఆపేసినట్లు సమాచారం.

# ప్రకృతి వైద్యం.. ఇక ఖరీదు!



హైదరాబాద్ : ప్రభుత్వ ప్రకృతి చికిత్సాలయంలో వైద్య సేవల ధరలు సామాన్యులు, పేదలకు షాక్ ఇస్తున్నాయి. కొన్ని సేవల ధరలు రెండు, మూడు రెట్లు పెరగడంతో పేద, మధ్యతరగతి రోగులు బెంబేలెత్తుతున్నారు. దీర్ఘకాలిక రోగాలతో వచ్చే వారికి హైదరాబాద్‌లోని అమీర్‌పేట ప్రభుత్వ ప్రకృతి చికిత్సాలయం సేవలు అందిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచీ రోగులు వస్తుంటారు. సేవల్లో ఈ కేంద్రానికి రోగుల్లో మంచి పేరుంది. అయితే ఎక్కువ మంది సామాన్య, మధ్యతరగతి రోగులే ఈ చికిత్సాలయాన్ని ఆశ్రయిస్తుంటారు. పెంచిన ఛార్జీలు భారంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**పలు దీర్ఘకాలిక వ్యాధులకు...**

క్యాన్సర్, గుండెకు సంబంధించిన వ్యాధులతో పాటు పలు జీవనశైలి వ్యాధులకు ప్రకృతి చికిత్సతో ఇక్కడ వైద్యం అందిస్తారు. థైరాయిడ్, మధుమేహం, స్థూలకాయం, చర్మవ్యాధులు, మెడ, నడుము, కీళ్ల నొప్పులు, కీళ్లవాతం, జీర్ణకోశ, శ్వాసకోశ వ్యాధులు, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, మలబద్ధకం వంటి వాటికీ ప్రకృతి చికిత్స అందిస్తారు. గర్భిణులు సాధరణ ప్రసవం అయ్యేలా యోగా, వ్యాయామాలు చేయిస్తుంటారు. స్త్రీ, పురుషుల్లో నెలకొన్న సంతానోత్పత్తి, గర్భధారణ వంటి సమస్యలకూ చికిత్స అందిస్తారు. ఆసుపత్రిలో ఎలాంటి రసాయనాల చికిత్స, ఆపరేషన్లు ఉండవు. వ్యాధి తీవ్రతను బట్టి వారం నుంచి నెలలపాటు చికిత్స చేస్తారు. మట్టి, జల, మర్దన, ఆహార చికిత్సలు, తానాబాత్, డీలక్స్ హైడ్రో మసాజ్, యోగా, ప్రాణాయామం, ధ్యాన క్రియలు, వాయు చికిత్స, సూర్యకిరణ్ చికిత్స, ఆథపత్(వివిధ రకాల ఆకులను వేడి నీటిలో మరిగించి చేసే స్నానం), షట్‌కర్మల చికిత్స, వివిధ రకాల ఫిజియోథెరపీలు, ఆక్యూపంచర్ వంటివి అందుబాటులో ఉన్నాయి.

**ఛార్జీలు భారమే...**

ఆసుపత్రిని ఇటీవలి రూ.10 కోట్ల నిధులతో ఆధునికీకరించారు. అనంతరం రెండు, మూడింతలు ఛార్జీలు పెంచడంతో రోగుల రాక తగ్గింది. వైద్యానికి జనరల్ వార్డులో వారానికి గతంలో రూ.2500 వసూలు చేస్తే.. ప్రస్తుతం రూ.9,600కి పెంచారు. తెల్ల రేషన్‌కార్డు ఉంటే గతంలో వారానికి కేవలం రూ.వెయ్యితో చికిత్స అందిస్తే.. దానిని రూ.3,600 చేశారు. రోగులకు ఇచ్చే డైట్ గతంలో రోజుకు రూ.100 ఉంటే.. రూ.300 చేశారు. ప్రత్యేక వార్డు ఏసీ షేరింగ్ గతంలో రూ.9 వేలు ఉంటే.. దానిని ఏకంగా రూ.13,700 చేశారు. ఇక ప్రత్యేక కాటేజీ కావాలంటే వారానికి రూ.23,500 చెల్లించాల్సిందే. ఇది రెండింతలు పెరిగింది. ఇలా అన్ని సేవల ధరలు భారీగా పెంపుతో పేద రోగులకు ఇబ్బందిగా మారింది. మానవీయ కోణంలో పేదలకు రాయితీలు ఇవ్వాలని రోగులు కోరుతున్నారు.

# మీ ఠాణా నుంచి వాటా అందలే!




హైదరాబాద్ : అది ప్రైవేటు వ్యవహారం.. పోలీసులు జోక్యం చేసుకుంటే ఇబ్బందులు వస్తాయని ఇన్‌స్పెక్టర్ చెప్పినా వినలేదు.. నిందితుడికి బెయిల్ లభించినా వారం పాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఠాణాలో కూర్చోబెట్టి నరకం చూపారు. ఫలితంగా 5-6 సార్లు కోర్టులో రిట్ దాఖలైంది. ఖరీదైన కారు వ్యవహారంలో ఒక ఏసీపీ అత్యుత్సాహానికి నిదర్శనమిది.

గన్‌లైసెన్స్ గడువు ముగిసింది. రెన్యువల్ చేయమంటూ దరఖాస్తు చేసుకున్న వారికి మరో ఏసీపీ చుక్కలు చూపుతున్నాడు. ప్రాణహాని ఉన్నంత తప్పేంచేశారంటూ ప్రశ్నలు. పనికావాలంటే వ్యక్తిగతంగా వచ్చి కలవాలంటూ సలహాలు.

ఇవి గ్రేటర్ పరిధిలోని కొందరి ఏసీపీల వ్యవహార శైలికి ఉదాహరణలు మాత్రమే. మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ కీలకం. ప్రధానమైన ఠాణాల్లో విధినిర్వహణ కత్తిమీద సాముగా మారింది. పండగలు, ఉత్సవాలు, ప్రముఖుల బందోబస్తు నుంచి కేసుల దర్యాప్తు వరకు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి. ఇటువంటి వాతావరణంలో కొందరు అసిస్టెంట్ మిషనర్ ఆఫ్ పోలీస్ (ఏసీపీ)లు కాసుల కక్కుర్తితో కిందిస్థాయి సిబ్బందిపై ఒత్తిడి పెంచుతున్నారు. వీటిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నట్టు సమాచారం.

**శివార్లలో ఇలా..**

సైబరాబాద్ పరిధిలోని కీలక జోన్‌లో పనిచేస్తున్న ఏసీపీ నుంచి ఫోన్‌కాల్ వచ్చిందంటే కిందిస్థాయి సిబ్బంది హడలెత్తిపోవాల్సి వస్తోందంటూ ప్రచారం సాగుతోంది. ఒక కేసులో తన వద్దకు మాట్లాడేందుకు వచ్చిన వ్యాపారి విన్నపం విన్నాక.. సమస్య పరిష్కారం కావాలంటే 4 బంగారు గాజులు కావాలంటూ బేరసారాలు ప్రారంభించినట్టు తెలిసింది. ఇదే కమిషనరేట్‌లో ఒక ఏసీపీ పరిధిలోని భూముల ధరలు రూ.కోట్లు పలుకుతున్నాయి. అక్కడ ఏ భూ వివాదం తలెత్తినా బయటపడాలంటే ఆయనకు పెద్దమొత్తం ముట్టజెప్పాల్సిందేనంటూ పోలీసువర్గాల్లో చర్చ సాగుతోంది. పోలీసు కమిషనర్ తన కార్యాలయానికి పిలిచి పద్ధతి మార్చుకోమని హెచ్చరించినా అదే తీరు. రాచకొండ పరిధిలో ఒక ఏసీపీ ఉన్నతాధికారుల ఆదేశాలను బేఖాతర్ చేస్తాడని సమాచారం.

**నగరంలో మరోలా**నగరంలో కీలకమైన జోన్.. సినీ, రాజకీయ, వ్యాపార ప్రముఖులుండే ప్రాంతం. అక్కడ ఏసీపీ తన మాటే చెల్లుబాటు కావాలంటూ కిందిస్థాయి సిబ్బందికి తెగేసి చెప్పాడు. ఇటీవల దంపతుల వివాదాన్ని తానే పెద్దగా మారి పరిష్కరించి రూ.20లక్షలకు పైగా లాభపడినట్టు చర్చ జరుగుతోంది. ఉత్తరమండలంలో ఒక ఏసీపీ తన పరిధిలో ఏ కేసు నమోదైనా బాధితులు తనను కలవాలంటూ అనధికార ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలుస్తోంది. ఎస్సైలు నెలవారీ ఎంతెంత ఇవ్వాలనేది ముందుగానే లక్ష్యం నిర్దేశించాడు. మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో సుమారు 10 మంది ఏసీపీల అవినీతి, అక్రమదందాలపై బాధితులు, ఠాణాల్లోని సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం.

# ఆశల ఊసులాట.. మాయగాళ్ల దొంగాట

హైదరాబాద్ : అరచేతిలో స్వర్గం చూపించే రంగురంగుల బ్రోచర్లు.. ఖరీదైన ప్రాంతాల్లో అద్దాల మేడలాంటి భవనాల్లో కార్యాలయాలు.. తియ్యని మాటలతో నమ్మించే కమీషన్ ఏజెంట్లు.. ఆశపెట్టే లాభాలు.. ఇదీ రాజధాని కేంద్రంగా పంజా విసురుతున్న ఆర్థిక నేరగాళ్ల నిజస్వరూపం. తేలిగ్గా డబ్బు సంపాదించాలనుకునే అమాయకుల బలహీనతే ఆసరాగా.. ఆకర్షణీయ వడ్డీలు, లాభాలు ఇప్పిస్తామంటూ నేరగాళ్లు సరికొత్త దోపిడీకి తెరతీస్తున్నారు. రూ.లక్ష పెట్టుబడికి నెలకు 30 శాతం వడ్డీ.. 6 నెలల్లో అసలుతో కలిపి రెట్టింపు సొమ్ము తిరిగి ఇస్తామంటూ ప్రకటనలతో రూ.వేల కోట్లు ముంచేస్తున్నారు. తాజాగా క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ.. ఇన్‌వాయిస్ డిస్కౌంట్ పేరుతో 6,979 మందిని రూ.850 కోట్ల మేర ముంచింది. నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా రూ.1,700 కోట్లు సేకరించి బోర్డు తిప్పేసింది. గతేడాది డీకేజడ్ సంస్థ 17,500 మందిని రూ.229 కోట్ల మేర మోసగించింది.

**ఠంఛనుగా ఇచ్చి.. నిండా ముంచేసి**

బాధితులను నమ్మించేందుకు నిందితులు కొన్ని నెలలపాటు వడ్డీలు, లాభాలు ఠంచనుగా జమ చేస్తున్నారు. ఎక్కువ మంది నిజమేనని ఆశపడుతున్నారు. భారీగా లాభం వస్తోందంటూ స్నేహితులు, కుటుంబ సభ్యులతో పెట్టుబడులు పెట్టిస్తున్నారు. ఈ ప్రచారమే నేరగాళ్ల జేబు నింపుతోంది. కొందరు కష్టపడి సంపాదించిన పింఛను, బంగారం కూడా అప్పగిస్తున్నారు. సాధారణంగా బ్యాంకులు.. ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పొదుపు పథకాల్లో వడ్డీలు గరిష్ఠంగా 9 శాతంలోపే ఉంటాయి. ఏటా రూ.లక్షల కోట్ల వ్యాపార లావాదేవీలుండే ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులే అంతకుమించి వడ్డీ ఇవ్వలేనప్పుడు ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు ఇస్తాయంటే నమ్మకూడదు.నగరానికి చెందిన యునానీ వైద్యుడు (49), సయ్యద్ నజీర్ స్నేహితులు. మాదాపూర్‌లోని డీకేజెడ్ టెక్నాలజీ, డికాజో సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో పెట్టుబడులు పెడితే బాగా



లాభాలు వస్తాయని, రూ.12 లక్షలు డిపాజిట్ చేస్తే 24 నెలలపాటు రూ.లక్ష చొప్పున లాభం వస్తుందని వైద్యుడిని సయ్యద్ నజీర్ నమ్మించాడు. దీంతో వైద్యుడు 2024 ఫిబ్రవరిలో రూ.8.8 లక్షలు పెట్టుబడి పెట్టాడు. జులై వరకూ రూ.18 వేల చొప్పున ప్రతినెలా లాభం వచ్చింది. ఈలోపు వైద్యుడు తన తల్లిదండ్రులు, సోదరి, సోదరులు, కుమార్తె, ఇతర కుటుంబ సభ్యులు, స్నేహితులు 22 మందితో రూ.1.8 కోట్లు పెట్టుబడి పెట్టించారు. 2 నెలలు లాభం ఇవ్వకపోవడంతో అడగాలని వెళ్తే మాదాపూర్‌లో కార్యాలయం మూసేసి ఉంది. అందరి ఫోన్లు స్విచాఫ్ అయ్యాయి. దీంతో వైద్యుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బైబ్యాక్ ఓపెన్ ప్లాట్స్, డబుల్ గోల్డ్ స్కీమ్, గోల్డ్ చిట్స్ స్కీమ్, దివాలీ గోల్డ్ స్కీమ్ పేరుతో 12 వెల్త్ క్యాపిటల్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధులు 3,600 మంది నుంచి రూ.300 కోట్లు సేకరించారు. రూ.8.08 లక్షలకు 2 గుంటల భూమి కొంటే కంపెనీ 24 నెలలపాటు ప్రతినెలా 4 శాతం లాభం ఇస్తుందని నమ్మించారు. గడువు ముగిశాక డబ్బు తిరిగిస్తామని ముంచారు.రికవరీ 30 శాతంలోపేకొట్టేసిన డబ్బుతో నేరగాళ్లు ఇతర వ్యాపారాలు చేస్తుంటారు. బినామీల పేరుతో ఆస్తులు కొనుగోలు చేస్తారు. దీంతో సొమ్ము రికవరీ ఎక్కువగా ఉండటం లేదు. 2024లో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 1,036 కోట్ల ఆర్థిక మోసాలు జరగ్గా జప్తు చేసింది రూ.324 కోట్లు మాత్రమే. అంటే 30 శాతమే స్వాధీనమైనట్లు.

# అపోహలు తొలగించు.. దాహార్తి తీర్చు

వికారాబాద్ : నీటి ఎద్దడిని నివారించడంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన పథకం మిషన్ భగీరథ. కోట్లాది రూపాయలను వెచ్చించి శుద్ధి చేసిన నీటిని నేరుగా పంపిణీ చేస్తున్నా ప్రజలు సద్వినియోగం చేసుకోవడం లేదు. సరైన అవగాహన లేకపోవడంతోపాటు పలుచోట్ల నిర్వహణ లోపం కూడా ఇతర అవసరాలకు వినియోగించడానికి కారణమవుతోంది. దీనిని గుర్తించడంతోపాటు ఎండాకాలంలో నీటి ఎద్దడి సమస్యను కూడా దృష్టిలో ఉంచుకుని క్షేత్రస్థాయిలో దృష్టి సారించారు. గతంలో మండల స్థాయిలో సర్పంచులు, ఎంపీపీలు, మండల ప్రాదేశిక సభ్యులకు అవగాహన కల్పించగా ఇప్పుడు ప్రత్యేక సిబ్బందితో అవగాహన కల్పిస్తున్నారు.

**జిల్లాలో ఇదీ లెక్క..**

అంశం: – మిషన్ భగీరథ (2018లో ప్రారంభం)
నీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటు: – పరిగి మండలం రాఘవాపూర్ సమీపాన
నిత్యం శుద్ధి జరిగే నీరు: – 1.35కోట్ల మిలియన్ లీటర్లు
నీటి సరఫరా: – శ్రీశైలం రిజర్వాయర్ బ్యాక్ వాటర్



ఎంత దూరం నుంచి: – 231 కిలోమీటర్లు పైప్‌లైన్ల ద్వారా
వెచ్చించిన వ్యయం: – ఉమ్మడి జిల్లాకు రూ.1800కోట్లు
లక్ష్యం: – ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీరు అందించడం

పంచాయతీకి ఒక సహాయకుడు

తాగునీటి సరఫరా సవ్యంగా జరగాలన్న ఉద్దేశంతో పంచాయతీకి ఒక సహాయకుడు పనిచేస్తున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా సుమారు 583 మంది విధుల్లో ఉన్నారు. ఇతర శాఖల నుంచి ఆర్‌డబ్ల్యూఎస్‌కు వెళ్లిన హెల్పర్లు 101కూడా ఇందులోనే కొనసాగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటీవలే విడతల వారీగా శిక్షణ కార్యక్రమాలను వారికి ఉన్నతాధికారులు పూర్తిచేశారు.

పథకం అమలు తీరు
సరఫరా పనితీరు – మెరుగ్గానే..
ప్రజాదరణ.. నామమాత్రం
కారణం – అవగాహన ఏర్పర్చక పోవడం
నిర్వహణ: శుభ్రతలేని ట్యాంకుల ద్వారా సరఫరా
దేనికి వినియోగిస్తున్నారు – ఇతర అవసరాలకు.

ఆరోగ్యానికి ఎంతో మేలు

ఖనిజ, లవణాల మిశ్రమంతో కూడిన జలాన్ని పంపిణీ చేస్తున్నాం. తాగునీటి విషయంలో ఎలాంటి అపోహలు వద్దు. భగీరథ నీరు ఆరోగ్యానికి ఎంతో సురక్షితం. డబ్బా నీటితో అనేక రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇందుకోసమే క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

చల్మారెడ్డి, ఈఈ, మిషన్ భగీరథ ఇంట్రా, గ్రిడ్.

# శిఖం భూములు.. యథేచ్ఛగా ఆక్రమణలు

పెద్దపల్లి : సుల్తానాబాద్ పెద్దచెరువు శిఖం ఇది. 300 ఎకరాలు ఉంటుంది. ఈ చెరువు కింద 3 వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. వంద ఎకరాల శిఖం కబ్జా చేసి పొలాలు, చేపల చెరువులు, స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నారని ఫిర్యాదులున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడం లేదు. ఆయకట్టుకు సాగు నీరందించే చెరువులు, కుంటలు చిన్నబోతున్నాయి. ఫుల్ ట్యాంకు లెవల్ (ఎఫ్‌టీఎల్) గుర్తింపులో ఆయా శాఖల ఉదాసీనత వైఖరితో యథేచ్ఛగా ఆక్రమణలు కొనసాగుతున్నా అధికారులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**ఇదీ పరిస్థితి**

జిల్లాలో వంద ఎకరాల్లోపు 832, వంద కంటే పైనా 107 కలిపి 939 చెరువులున్నాయి. వీటి పరిధిలో 55,332 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువు, కుంటల శిఖానికి ఎఫ్‌టీఎల్ భూమితోపాటు బఫర్‌జోన్ ఉంటుంది. చెరువు నిండి ఎంత నిలిచి ఉంటుందో ఆ ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్ హద్దుగా గుర్తించాలి. కబ్జాకు గురికాకుండా ఈ జోన్‌లో మొక్కలు నాటి పర్యావరణం, పచ్చదనం పెంచాలి. చెరువుల హద్దులను తేల్చకపోవడంతో ఆక్రమణలు ఆగడం లేదు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల్లో సమన్వయం కొరవడింది. ఏదైనా ఫిర్యాదు వస్తే తప్ప కబ్జాలు పట్టించుకోవడం లేదు. ఇరు శాఖల సంయుక్త సర్వేతో ఆక్రమణకు అడ్డుకట్ట పడనుంది. చెరువుల కట్జాకు గురికావడంతో పంట కీలక దశలో నీటి తడులు అందక ఎండిపోతున్నాయి. మత్స్యకారులకు నష్టం వాటిల్లుతోంది.

**మచ్చుకు కొన్ని ఇలా**

సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి చెరువు 2 వేలకు పైగా ఆయకట్టు ఉంది. శిఖాన్ని 30 ఎకరాలు కబ్జాకు గురికావడంతో ఆయకట్టు, చేపల పెంపకానికి విఘాతం కలుగుతోంది. రైతులు రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలో 496 సర్వేనంబరులో పెద్ద చెరువు సుమారు 150 ఎకరాల విస్తీర్ణంతో ఉంది. సుమారు 300 ఎకరాల ఆయకట్టు ఉండగా 25 ఎకరాలు కబ్జాకు గురైంది. చెరువులో నీరు ఉంటే గంగారం ఊషన్నపల్లి, పెగడపల్లి, ఓదెల మండలం నాంసానిపల్లె గ్రామాల్లోని రైతుల వ్యవసాయ బావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి.మంథని మండలం చిన్నఓదాలలో నేతలపల్లి చెరువు శిఖం 34 ఎకరాలు ఉంది. శిఖం పక్కనే సీలింగ్ భూములు ఉండటంతో వాటి పేరిట కబ్జా చేసి పంట పొలాలుగా మార్చుతున్నారు. సమీప రైతులు ఫిర్యాదు చేయడంతో అధికారులు పరిశీలనకే పరిమితమైంది.

పెద్దపల్లి మండలం నిట్టూరు ఊరు చెరువు శిఖంలో హరితహారంలో నాటిన మొక్కలను కబ్జాదారులు తొలగించారు. అధికారుల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మూడేళ్లుగా పట్టించుకోవడం లేదు. నిమ్మనపల్లి, అప్పన్నపేట, బ్రాహ్మణపల్లిలో చెరువులు కనుమరుగవుతున్నాయి.

సర్వే చేస్తున్నాం

జిల్లాలో చెరువుల కబ్జాపై ఫిర్యాదుల ఆధారంగా సర్వే చేస్తున్నాం. రెవెన్యూ అధికారులను సమన్వయం చేసుకొని హద్దులు నిర్ధారిస్తున్నాం. కబ్జాలపై పర్యవేక్షణ పెంచుతున్నాం.

– శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఈఈ

చురకలు



# ఇల్లాలు..ఎన్నాళ్లీ కన్నీళ్లు?

హైదరాబాద్: కుషాయిగూడ పరిధిలో రెండోసారి గర్భం దాల్చిన భార్యపై అనుమానంతో.. పొట్టపై కూర్చొని తల్లితో పాటు కడుపులో ఉన్న శిశువును భర్త హత్య చేశాడు. మీర్‌పేట్ పరిధిలో మాజీ సైనికుడు భార్యను హత్య చేసి ముక్కలు చేసి, ఉడకబెట్టి పొడి చేశాడు. రోజుల వ్యవధిలో జరిగిన రెండు ఘటనలు నగర ప్రజలను ఆందోళనకు గురిచేశాయి. నగరంలోని వివిధ ఠాణాల పరిధిలో నిత్యం 15–20 వరకూ దంపతుల తగాదాలపై ఫిర్యాదులు వస్తుంటాయి. వీటిలో 2–3 శాతం మానసిక, శారీరక వేదనకు గురి చేస్తున్నవే. అక్రమ సంబంధం, అనుమానం, క్షణికావేశంతో మగాళ్లు విచక్షణ కోల్పోతున్నారు. రాజధానిలో గతేడాది సుమారు 40 మంది గృహిణులు హత్యకు గురవ్వగా, 54 మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు.



తప్పించుకునేందుకు.. కేసు నుంచి తప్పించుకునేందుకు కొందరు అతితెలివి ప్రదర్శిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. గతేడాది ఆసిఫ్‌నగర్‌లో అనుమానంపై భార్యను కత్తితో పొడిచిన భర్త.. ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. ప్రమాదం జరిగిందంటూ వైద్యులను నమ్మించే ప్రయత్నం చేశాడు. పోలీసులు రంగంలోకి దిగటంతో అసలు విషయం వెలుగుచూసింది. నగరంలో చాలావరకూ గృహిణుల అనుమానాస్పద మరణాలు మిస్టరీగానే మిగిలి పోతున్నాయి.

**తీరని వరకట్న దాహం**

కొందరికి పెళ్లి సమయంలో ఇచ్చిన లాంఛనాలు చాలడం లేదంటూ కాపురానికొచ్చిన మొదటి రోజు నుంచే అత్తింట వేధింపులు మొదలవుతున్నాయి. కోడలిని సూటిపోటి మాటలతో వేధిస్తున్న అత్త, ఆడపడచులపై మహిళా పోలీస్ స్టేషన్లకు ఫిర్యాదులు పెరుగుతున్నాయి. పాత బస్తీకి చెందిన యువతి ఉన్నత చదువులు పూర్తి చేసింది. ఆర్థిక స్తోమత లేకపోవటంతో తల్లిదండ్రులు సూచించిన ఆటో డ్రైవర్‌ను వివాహమాడింది. నెలరోజుల తరువాత ఆటో కొనేందుకు రూ.2 లక్షలు తీసుకురమ్మంటూ భర్త వేధింపులతో పుట్టింటికి చేరింది.

# పంచాయతీ పోరుకు చకచకా ఏర్పాట్లు

పెద్దపల్లి : పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు జిల్లా అధికారులు సిద్ధమవుతున్నారు. అవసరమైన అన్ని ఏర్పాట్లు చకచకా చేస్తున్నారు. తుది ఓటరు జాబితా సిద్ధం చేసిన అధికారులు.. నాలుగు నెలలుగా తీరిక లేకుండా శ్రమిస్తున్నారు. ఇప్పటికే జిల్లాకు ఎన్నికల సామగ్రి రాగా.. అధికారులు బ్యాలెట్ పెట్టెలకు మరమ్మతులు చేసి గోదాంలో భద్రపరిచారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ పూర్తయింది. ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా అధికారులకు నోడల్ బాధ్యతలు అప్పగించారు.

**పోలింగ్ కేంద్రాల్లో వసతులపై ఆరా**

గ్రామపంచాయతీ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాలపై అధికారులు ఆరా తీశారు. శాసనసభ, లోక్‌సభ ఎన్నికలకు వినియోగించిన పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ప్రహరీ, విద్యుత్తు, ఫ్యాన్‌లు, ర్యాంపులు ఇతర మౌలిక వసతులు తనిఖీ చేశారు. సమస్యలు తెలుసుకున్నారు. లోపాలు సవరించుకోవాలని ఆయా గ్రామ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటు అంశాన్ని కూడా పరిశీలించారు. వార్డుల్లో ఓటర్లు పెరిగితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

**ఆన్‌లైన్‌లో ఎన్నికల సేన**

జిల్లాలోని 269 పంచాయతీల్లో ఎన్నికలకు అధికారులు, సిబ్బంది వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. పెద్దపల్లి డివిజన్‌లో 3,181, మంథనిలో 890 మంది సిబ్బంది ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయింది. మండల పరిషత్ కార్యాలయాల్లో ఉద్యోగుల స్థానికత, ఎప్పుడు విధుల్లో చేరారు? ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారు? ఆధార్, చరవాణి నంబరు, ఇతరత్రా వివరాలు నమోదు చేస్తున్నారు. ఉద్యోగుల ఆన్‌లైన్‌పై ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తున్నారు.

**పూర్తయిన బ్యాలెట్ పత్రాల ముద్రణ**



ఎన్నికల బ్యాలెట్ పేపర్ల ముద్రణ ముగిసింది. సర్పంచిల ఎన్నికకు గులాబి, వార్డు సభ్యుడికి తెలుపు రంగులో బ్యాలెట్ పేపర్లను ముద్రించారు. ఎన్నికల సంఘం సర్పంచికి 20, వార్డు సభ్యుడికి 10 గుర్తులు కేటాయించారు. జిల్లాలో 4,13,086 ఓటర్లు ఉండగా సర్పంచికి 5,04,000 వార్డు సభ్యులకు 4,99,000 బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేశారు. వీటిని జిల్లా గోదాములో భద్రపరిచారు.

**బ్యాలెట్ పెట్టెలకు మరమ్మతులు చేశాం**

జిల్లాలో ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. కలెక్టర్ ఆదేశాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించాం. బ్యాలెట్ పెట్టెలకు మరమ్మతులు చేశాం. సర్పంచి, వార్డు సభ్యులకు అవసరమైన బ్యాలెట్ పేపర్లు ముద్రించాం.వీరబుచ్చయ్య, జిల్లా పంచాయతీ అధికారి

జిల్లా వివరాలు

గ్రామపంచాయతీలు: 269

మొత్త ఓటర్లు: 4,13,086

పోలింగ్ కేంద్రాలు : 2,486

ఎన్నికల సిబ్బంది : 4,071

బ్యాలెట్ పెట్టెలు :3,125

# బడి బస్సులు భద్రమేనా!



కరీంనగర్ : విద్యార్థుల రవాణాకు ఉపయోగించే బస్సులు పూర్తి సామర్థ్యంతో ఉండాలి.. లేకపోతే ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. ఏటా రవాణా శాఖ అధికారులు విద్యా సంస్థల బస్సులకు సామర్థ్య పరీక్షలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందజేసిన తర్వాతే ఆ వాహనాలు రోడ్లపైకి రావాల్సి ఉంటుంది. విద్యా సంస్థలు ప్రారంభమై నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు అన్ని బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి కాలేదు. అధికారులు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలలకు సంబంధించి 1,720 బస్సులు ఉండగా అందులో 108 బస్సులకు ఇంకా సామర్థ్య పరీక్షలు నిర్వహించలేదు. ప్రతి ఏటా మే 15 నుంచి జూన్‌లో విద్యా సంస్థలు తిరిగి ప్రారంభమయ్యే లోపు ఫిట్‌నెస్ పరీక్షలు చేయాల్సి ఉంటుంది. మరో మూడు నెలల్లో విద్యాసంవత్సరం ముగుస్తుండగా బస్సుల సామర్థ్య పరీక్షలు పూర్తి కాకపోవడం చూస్తే యాజమాన్యాల నిర్లక్ష్యం.. అధికారుల ఉదాసీనత అర్థం చేసుకోవచ్చు.

**నిబంధనల అమలు ఎక్కడ?**

విద్యార్థుల రవాణాకు ఉపయోగించే బస్సులు తప్పనిసరిగా పూర్తి కండిషన్‌తో ఉండాలి. ఆర్టీఏ నుంచి ధ్రువీకరణ పత్రం పొందిన తర్వాతే రోడ్లపై తిరగాలి. ప్రతి బస్సులో పరిమితి మేరకు విద్యార్థులను ఎక్కించుకోవాలి, సుశిక్షితులైన, అనుభవజ్ఞులైన చోదకులు, అనుభవం ఉన్న అటెండర్ తప్పనిసరిగా ఉండాలి. ప్రతి బస్సులో ప్రథమ చికిత్స పెట్టె తప్పనిసరి. డ్రైవరు వివరాలు కన్పించేలా బోర్డుపై ప్రదర్శించాలి. అయితే చాలా బస్సుల్లో ఈ నిబంధనలు పాటించడం లేదు.

**తనిఖీలు ఏవీ?**

విద్యాసంస్థల ప్రారంభంలో హడావుడి చేసే రవాణా శాఖ అధికారులు తిరిగి వాటి జోలికి వెళ్లడం లేదు. నామమాత్రంగా తనిఖీ చేసి ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విద్యాసంస్థల బస్సులను తరచూ తనిఖీ చేసినట్లైతే లోపాలు బయటపడే అవకాశం ఉంటుంది. ఒకవైపు ప్రభుత్వం భద్రతా మాసోత్సవం పేరిట అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇలాంటి తరుణంలో సామర్థ్య పరీక్షలు చేయకుండానే బస్సులు రోడ్లపై తిరుగుతుండటం విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తోంది.

**నోటీసులు జారీ చేస్తాం**

ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకుండా బస్సులు రోడ్లపై తిరగొద్దు. సామర్థ్య పరీక్షలకు రాని బస్సుల్లో కొన్నింటిని స్క్రాప్ చేశారు. తనిఖీలు ముమ్మరం చేస్తాం. ఫిట్‌నెస్ పరీక్షలకు సంబంధించి బస్సుల యజమానులకు నోటీసులు జారీ చేస్తాం.పురుషోత్తం, డీటీసీ, కరీంనగర్ ఉమ్మడి జిల్లా

# నిధుల మంజూరుతోనే పనులకు మోక్షం



జగిత్యాల : నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ ద్వారా జిల్లాలో పెద్దఎత్తున ఆయకట్టు స్థిరీకరణ పనులకు అధికారులు గతంలోనే ప్రతిపాదనలు పంపించారు. త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్లో ప్రతిపాదిత పనులకు నిధులను విడుదల చేసేలా ప్రజాప్రతినిధులు కృషి చేస్తే ఆయకట్టేతర ప్రాంతం కూడా ఆయకట్టు పరిధిలోకి వస్తుందని అన్నదాతలు అభిలషిస్తున్నారు.

**ప్రతిపాదిత పనులు**

వరద కాలువకు అనుబంధంగా రూ.763.31 కోట్లతో పలు పనులకు ప్రతిపాదించారు. ఇందులో కథలాపూర్ మండలం దుంపేట వద్ద పంపుహౌస్‌ను నిర్మించి 52.30 కి.మీ. వద్ద ఓటీ ద్వారా నీటిని తీసుకొని కలికోట సూరమ్మ చెరువు, లక్కాకుల, తుమ్మల చెరువులను నింపాలి. రుద్రంగి చెరువు ప్రధాన కుడికాలువ కొత్తపేట, మోత్కురావుపేటల వద్ద పంపుహౌస్‌లను నిర్మించి కథలాపూర్, మేడిపల్లి, బీమారం మండలాల్లోని ఎల్లమ్మ తదితర చెరువులను నింపాలి.

వరద కాలువ 47.600 కిలోమీటరు వద్ద ఎడమ కాలువ పంపుహౌస్ నిర్మాణంతో 14ఆర్ కాలువ నింపటం ద్వారా కథలాపూర్, మెట్పల్లి మండలాలకు నీరందుతుంది.

వరద కాలువ 67.500 కి.మీ. వద్ద కుడికాలువ పంపుహౌస్ నిర్మాణంతో 15ఆర్ కాలువను నింపటం ద్వారా మేడిపల్లి, జగిత్యాల, మల్యాల మండలాలకు నీరందుతుంది.

59.500 కి.మీ. వద్ద కుడి కాలువ పంపుహౌస్ ద్వారా మేడిపల్లి, బీమారం, కథలాపూర్, కోరుట్ల మండలాలకు నీరు పారుతుంది.

76.22 కి.మీ. మద్దుట్ల వద్ద పంపుహౌస్ నిర్మాణంతో కొత్తచెరువు నిండుతుంది. గొర్రెగుండం గుడిచెరువు వద్ద పంపుహౌస్‌తో నల్లమట్టు చెరువును నింపవచ్చు. ఈ ప్రధాన పనులతో పాటుగా కొడిమ్యాల మండలంలో పలు నిర్మాణాలు, వరదకాలువలో రంగాపూర్ వద్ద 3.5 కి.మీ లైనింగ్ తదితర పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు.

ప్రధానంగా 8 పనులను రూ.805.31 కోట్లతో చేపట్టడంతో అదనంగా 54,215 ఎకరాల భూమికి సాగునీరంది ఆయకట్టు పరిధిలోకి వస్తుంది.జిల్లాలో 35 చెక్‌డ్యాంల నిర్మాణాన్ని తలపెట్టగా 34 పూర్తయ్యాయి. మిగిలిన ప్రతిపాదిత 40 చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులను విడుదల చేయాల్సి ఉంది. ఆయకట్టు పరిధిలో ఆపరేషన్, నిర్వహణ, మరమ్మతుల నిమిత్తం 130 పనులకు అనుమతులు రాగా పనుల పూర్తికి ఇంకనూ రూ. 20 కోట్లను విడుదల చేయాల్సి ఉంది. 13 లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తి చేయాల్సి ఉండగా 17 లిఫ్ట్ స్కీంలకు మరమ్మతులు, 5 లిఫ్ట్ స్కీంల పునరుద్ధరణ పనులను పూర్తిచేయాలి. వరదకాలువ నుంచి రూ.13.43 కోట్లతో చేపట్టిన కొండగట్టు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయాలి.

రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీరణను రూ.136 కోట్లతో చేపట్టగా ఈ వేసవిలోపు నిధులను విడుదలచేసి పనులను పూర్తిచేయాలి. కేంద్రం నుంచి పరిపాలన అనుమతులు వచ్చిన 6 చెరువుల పునరుద్ధరణతో పాటుగా మిషన్ కాకతీయ పథకం ద్వారా అసంపూర్తి చెరువుల పునరుద్ధరణకు రూ.119 కోట్ల వరకు నిధులను విడుదల చేయాల్సి ఉంది. ఆయకట్టు, ఆయకట్టేతర ప్రాంతంలో నూతన నిర్మాణాలు, మరమ్మతులకు ఇప్పట్నుంచి వేసవి వరకు కాలం అనువుగా ఉంటుంది.

# అయిదేళ్లలో అభివృద్ధి జాడలు

సిరిసిల్ల: మున్సిపల్ పాలకవర్గాలు గత అయిదేళ్లలో వివిధ పనులు చేపట్టడంతో పట్టణంలో అభివృద్ధి జాడలు కనిపిస్తున్నాయి. పట్టణ సమగ్ర అభివృద్ధిలో భాగంగా దాదాపు రూ.110 కోట్ల నిధులతో వేములవాడలో పనులు చేపట్టారు. సిరిసిల్లలో సుమారు రూ.145 కోట్లతో పనులు చేశారు. పాలకవర్గం పదవీ కాలం ఆదివారంతో ముగిసింది. ఈనేపథ్యంలో గత పాలకవర్గాలు చేపట్టిన పనుల తీరుపై ప్రత్యేక కథనం. వేములవాడ పట్టణంలో తెలంగాణ కూడలి, శాత్రాజుపల్లి వైపు, నందికమాన్, మల్లారం రోడ్డు, అంబేడ్కర్ కూడళ్ల సుందరీకరణ, మురుగు కాలువలు, సీసీ రోడ్లు నిర్మించారు. పట్టణంలో కూరగాయల మార్కెట్, వైకుంఠధామాలు, హరితహారం, డంపింగ్ యార్డు, ఫుట్‌పాత్‌లు, ఎంపీడీవో కార్యాలయంలో పార్కు, బైపాస్ రోడ్డులో చిల్డ్రన్స్ పార్కు నిర్మాణం వంటి పనులు చేశారు.

**చేయాల్సినవి అనేకం..**

పట్టణంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. వ్యవసాయ మార్కెట్ యార్డులో సమీకృత కూరగాయలు, మాంసం మార్కెట్ నిర్మాణం నిధులు సరిపోక నిలిచిపోయాయి. శివారు కాలనీల్లో అనేక వీధులు ఇంకా కాలువలు, సీసీ రోడ్లకు నోచుకోలేదు. దీంతో మురుగు రోడ్లపై పారుతోంది. బైపాస్ రోడ్డులోని కూరగాయల వ్యాపారులకు షెడ్లు నిర్మించాల్సి ఉంది. చాలా వీధుల్లో రోడ్లు గుంతలు పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

**సిరిసిల్లలో...**

సిరిసిల్లలో కొత్త చెరువు కట్ట, పార్క్ అభివృద్ధి, చిన్న బోనాలలో మినీ స్టేడియం, ముస్లిం శ్మశాన వాటిక, గణేశ్‌నగర్, వెంకంపేటలో ఆధునిక ధోబీఘాట్‌లు, ఆర్‌సీసీ స్టార్మ్ వాటర్ డ్రైన్, పద్మానగర్ ఉదార వాగు నిర్మాణం, పోతిరెడ్డిపల్లిలో అర్బన్ ఫారెస్ట్ పార్క్, బైపాస్ రోడ్లలో సెంట్రల్ లైటింగ్, ప్లాంటేషన్, మురుగునీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు వంటివి చేపట్టారు.

**వీడని సమస్యలు**

గత మూడేళ్లుగా వర్షాకాలంలో వరదలతో పట్టణమంతా నీట



మునుగుతోంది. ఇందుకు ప్రధాన కారణమైన పద్మానగర్ ఉదార వాగు పునర్నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేశారు. రూ.6.21 కోట్లతో ప్రారంభించినప్పటికీ పూర్తి చేయలేదు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి.పట్టణంలోని 38వ వార్డులో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కేంద్రం నిధులు మంజూరు చేసినా పనులు చేపట్టలేదు. ఓపెన్ జిమ్ పనులు ప్రారంభించలేదు. పదో వార్డులో చిన్న బోనాల గురుకుల వసతి గృహం నుంచి భూపతినగర్ వరకు డ్రైనేజీ నిర్మాణం చేపట్టలేదు. ఏళ్లుగా డ్రైనేజీ వ్యవస్థ లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

**అందరి సహకారంతోనే...**

ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో అనేక పనులు చేపట్టి పట్టణాన్ని అభివృద్ధి పథం వైపు తీసుకెళ్లడం జరిగింది. తమ పాలకవర్గం అన్ని వార్డుల్లో దాదాపు రూ.110 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.రామతీర్థపు మాధవి, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ వేములవాడ

**పట్టణాభివృద్ధికి కృషి**

అయిదేళ్ల కాలంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం. మౌలిక వసతులు కల్పించాం. వార్డుల అభివృద్ధికి కృషి చేశాం. గతంలో రూ.40 కోట్లు మంజూరైనప్పటికీ పనులు కాలేదు. అభివృద్ధికి సహకరించిన స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్‌కు, పట్టణవాసులకు కృతజ్ఞతలు.జిందం కళ, సిరిసిల్ల పురపాలక సంఘం మాజీ ఛైర్‌పర్సన్

# ఎన్టీపీసీ రెండో దశ పనులకు అడుగులు

ఖని : ఎట్టకేలకు తెలంగాణ ఎన్టీపీసీ రెండో దశ పనులకు అడుగు పడుతోంది. మొదటి దశలో 1600 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను నిర్మించగా రెండో దశ పనులపై సందేహాలు వ్యక్తమయ్యాయి. విద్యుత్తు కొనుగోలు ఒప్పందం కుదరకపోవడంతో రెండో దశలో చేపట్టాల్సిన 2400 మెగావాట్ల మూడు యూనిట్ల ఏర్పాటుపై సందిగ్ధం నెలకొంది. చివరికి రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో రెండో దశ పనులకు ఎన్టీపీసీ యాజమాన్యం చర్యలు చేపట్టింది. ఈ మేరకు బోర్డు ఆమోదం తెలిపింది. ప్రాజెక్టు నిర్మాణంపై మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే రెండు దఫాలుగా వాయిదా పడిన ప్రజాభిప్రాయ సేకరణను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టు నిర్మించిన మొదటి దశ ప్రాంతంలోనే రెండో దశలో నిర్మించే 800 మెగావాట్ల సామర్థ్యం గల మూడు యూనిట్లను నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించి పరిసర



గ్రామాలు, రామగుండం ప్రాంత ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు చేశారు.

పూర్తిస్థాయిలో అందుబాటులోకి..

రాష్ట్ర విభజన చట్టంలో రూపొందించిన విధంగా తెలంగాణకు ఎన్టీపీసీ ద్వారా 4000 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అందులో భాగంగానే మొదటి దశలో 1600 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలు నిర్మించి ఉత్పత్తిని ప్రారంభించారు. ఉత్పత్తి చేసిన విద్యుత్తును తెలంగాణ గ్రిడ్‌కు సరఫరా చేస్తారు. కొత్తగా మరో 2400 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలను కూడా నిర్మించి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు చేపడుతోంది. ఏటా 11.7 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేసే విధంగా సింగరేణితో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. నిర్మాణం మొదలు పెట్టిన తర్వాత నాలుగేళ్లలో 2400 మెగావాట్ల మూడు యూనిట్లు అందుబాటులోకి రానున్నాయి. మొదటి దశలో చేపట్టిన 1600 మెగావాట్ల రెండు యూనిట్లు గత ఏడాది నుంచి అందుబాటులోకి వచ్చాయి. 2016లో మొదటి దశ విద్యుత్తు కేంద్రాలకు శంకుస్థాపన చేశారు. 2023, 2024లో రెండు యూనిట్ల పనులు పూర్తిగా వాణిజ్య ఉత్పత్తిలోకి తీసుకువచ్చారు. ప్రస్తుతం రెండో దశలో చేపట్టే 2400 మెగావాట్ల మూడు యూనిట్లను 2030 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఎన్టీపీసీ లక్ష్యంగా నిర్దేశించుకుంది.

**పర్యావరణవేత్తల ఆందోళన**

రామగుండంలో నిర్మించనున్న రెండో దశ విద్యుత్తు కేంద్రాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందనే ఆందోళన స్థానికంగా వ్యక్తమవుతోంది. పారిశ్రామిక ప్రాంతంలో గాలి నాణ్యత దెబ్బతింటుందని పర్యావరణ వేత్తలు అంటున్నారు. సల్ఫర్ డయాక్సైడ్ గాలిలో కలిసి ప్రాణవాయువు ప్రమాదకరంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 4,200 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలున్న రామగుండంలో మరో 2400 మెగావాట్ల విద్యుత్తు కేంద్రాలు నెలకొల్పడం ద్వారా పూర్తి ఉత్పత్తి 6,600 మెగావాట్లకు చేరుకుంటుంది. దీనికోసం రోజుకు సుమారు 80 వేల టన్నుల బొగ్గును మండించాల్సి ఉంటుందని, దీని వల్ల సల్ఫర్‌డయాక్సైడ్ ఉద్గారాలు భారీగా వెలువడుతాయని స్థానికులు చెబుతున్నారు. వీటితో పాటు పరిసర ప్రాంతంలో ఆర్‌ఎఫ్‌సీఎల్, రామగుండం బి–థర్మల్ కేంద్రం, కేశోరాం సిమెంటు కార్మాగారాలు ఉన్నాయని .. వీటి నుంచి సైతం కాలుష్య కారకాలు వెలువడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఉపాధి అవకాశాలపై పరిసర గ్రామాల ప్రజల నిరసన**

ఎన్టీపీసీ ప్రాజెక్టు కోసం భూములు సేకరించిన యాజమాన్యం పరిసర గ్రామాల యువతకు ఉపాధిని విస్మరించిందన్న ఆరోపణలున్నాయి. ప్లాంటు నిర్మాణం కోసం ఎన్టీపీసీ యాజమాన్యం చుట్టు పక్కల గ్రామాలైన లక్ష్మీపురం, ఎల్కలపల్లి, కుందనపల్లి, రాజాపూర్, రాణాపూర్, మొగల్‌పహాడ్, రామగుండం ప్రాంతాల నుంచి గతంలో భూములు సేకరించింది. ఈ ప్రాంతాలకు చెందిన వారికి ఉపాధి కల్పించకపోవడంతో పాటు కనీసం ఆయా గ్రామాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు సామాజిక బాధ్యతను కూడా సక్రమంగా నిర్వర్తించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు.

# సింహభాగం.. సాగుకు యోగ్యమే!

కరీంనగర్ : జిల్లాలో సింహభాగం సారవంతమైన సాగు భూమి విస్తీర్ణమే ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే రైతుభరోసా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇటీవల వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సర్వే జరిపారు. అనంతరం గ్రామసభల ద్వారా రైతుల అభిప్రాయాలు తీసుకొని, జిల్లాలో సాగుకు యోగ్యమైన



భూవివరాలను వెల్లడించారు.

**డివిజన్ల వారీగా వివరాలు..**

జిల్లాలో నాలుగు వ్యవసాయ డివిజన్లు, 207 రెవెన్యూ గ్రామాలున్నాయి. డివిజన్ల వారీగా కరీంనగర్‌లో అత్యధికంగా 1830, మానకొండూర్‌లో 1568, హుజూరాబాద్‌లో 994, చొప్పదండిలో 962 ఎకరాలను సాగుకు యోగ్యం కానివిగా గుర్తించారు. ఈ భూమికి భవిష్యత్తులో రైతుభరోసా నిలిపివేయనున్నట్లు అధికారులు తెలిపారు.

**ఆర్థిక వెసులుబాటు మేరకు..**

సాగుకు యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో సర్వే అనంతరం సాగు యోగ్యమైన భూ వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వ ఆర్థిక వెసులుబాటును బట్టి విడతల వారీగా రైతు భరోసా ఖాతాల్లో జమ అవుతాయి. భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి

# ఎంఐజీ లేఅవుట్లు.. కలేనా?



తిరుపతి : మధ్య ఆదాయ వర్గాల (ఎంఐజీ) కోసం లేఅవుట్లు వేసి అందుబాటు ధరల్లోనే ప్లాట్లు ఇస్తామని గత వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పింది. భూసేకరణపై ఎంతకూ శ్రద్ధ చూపకపోవడంతో ప్రకటన కాగితాలకే పరిమితమైంది. కొన్నిచోట్ల సార్వత్రిక ఎన్నికలకు ముందు మౌలిక వసతుల కల్పనకు శంకుస్థాపన చేసి చేతులు దులుపుకొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వీటిని ముందుకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. అయినా యంత్రాంగంలో కదలిక రాలేదు. ఇప్పటికైనా వీటిపై దృష్టిపెడితే మధ్య తరగతి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

జగన్ సీఎంగా ఉన్న సమయంలో ప్రతి నియోజకవర్గంలోనూ ఒక ఎంఐజీ లేఅవుట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇందులో ఉద్యోగులు, పెన్షనర్లకూ ప్లాట్లు ఇస్తామని తెలిపారు. 20 శాతం రాయితీ ఇస్తామని స్పష్టం చేశారు. ఆచరణలో ఇవన్నీ గాలికి కొట్టుకుపోయాయి. చిత్తూరు పట్టణాభివృద్ధి సంస్థ (చుడా) పరిధిలో పూతలపట్టు, గంగాధరనెల్లూరు, చిత్తూరులో భూసేకరణ చేస్తామని వెల్లడించారు. పూతలపట్టులో తొలుత 12.60 ఎకరాల్లో ప్లాట్లు వేయాలని నిర్ణయించారు. అనంతరం 25 ఎకరాలు సేకరించాలని భావించారు. తీరా రైతులకు పరిహారం ఇచ్చేంత డబ్బులు ప్రభుత్వం వద్ద లేవని వెనక్కు తగ్గారు. గంగాధర నెల్లూరులోనూ పారిశ్రామికవాడకు ఎదురుగా లేఅవుట్ వేయాలని భావించినా ప్రజల నుంచి డిమాండ్ ఉండదని విరమించుకున్నారు.

**చిత్తూరులో హడావుడిగా శంకుస్థాపన**

చిత్తూరు నగరంలో కొడిగుట్టలో 35.25 ఎకరాల్లో లేఅవుట్ వేసేందుకు స్థలాన్ని ఎంపిక చేశారు. ఇందులో 19.18 ఎకరాలు డీకేటీ కాగా మిగిలినవి పట్టా భూములు. డీకేటీ వరకు భూములు కోల్పోయే వ్యక్తులకు పరిహారం ఇచ్చారు. మౌలిక వసతులు కల్పించేందుకు టెండర్లు ఆహ్వానించినా అప్పట్లో ఆసక్తి చూపలేదు. చివరకు సార్వత్రిక ఎన్నికలకు ముందు హడావుడిగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయించారు. తర్వాత పనులు ముందుకు సాగలేదు.

**నిబంధనల్లో మార్పే కారణమంటూ**

నగరిలో కీలపట్టులో భూసేకరణ చేసినా మౌలిక సదుపాయాలు లేవు. సూళ్లూరుపేటలో మన్నారుపోలూరులో 25 ఎకరాల్లో స్థలాన్ని ఎంపిక చేయడంతోనే సరిపెట్టారు. పనులు ముందుకు సాగకపోవడానికి ఇటీవల ప్రభుత్వం విధించిన నిబంధనలే కారణమని అధికారులు అంటున్నారు. గతంలో అంతర్గతంగా 40 అడుగుల వెడల్పు రోడ్డు ఉండాలనే ఉత్తర్వులు ఉండగా గతేడాది డిసెంబరులో దీన్ని 30 అడుగులకు సవరించారు. ఈమేరకు మార్పులు చేసేందుకే సమయం పడుతోందని అధికారులు చెబుతున్నారు. రెండు నెలలు గడిచినా ఉన్నతాధికారులకు ప్రణాళికలు పంపకపోవడం విమర్శలకు దారితీస్తోంది.

**ఒడిసి పడితే నగదు**

మమ్మురంగా ఇంకుడు గుంతల తవ్వకంపుత్తూరు, న్యూస్‌టుడే: వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భజలాలు పెంపొందించడమే లక్ష్యంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నడుం బిగించింది.. దీనికి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డ్వామా ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించారు.. ఇళ్లలో వినియోగించిన, వర్షపు నీరు వృథాగా పోనీయకుండా ఇంటి ప్రాంగణంలోనే ఇంకేలా గుంతలు తవ్విస్తున్నారు. క్షేత్ర సహాయకులు ఆసక్తి ఉన్న కూలీల వివరాలు సేకరించి ఈ నెలాఖరు లోగా పనులు పూర్తి చేయించేందుకు చర్యలు చేపట్టారు.

**కూలీల ఖాతాకే జమ..**

ఒక్కో ఇంకుడు గుంతకు రూ.6 వేలు చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. ఇళ్ల ముంగిట నాలుగు అడుగుల లోతు, 30 అంగుళాల వెడల్పుతో తవ్వడం, సిమెంటు ఒరలు దించడం, ఇసుక, కంకరతో నింపి పైన మూత వేయాలి. జాబ్‌కార్డు కలిగిన ఉపాధి కూలీలతో వీటిని తవ్వించి నిధులు వారి ఖాతాలకు జమ చేస్తున్నారు. ఉమ్మడి చిత్తూరు వ్యాప్తంగా ఉన్న 64 మండలాల్లో.. ఒక్కో మండలానికి వెయ్యి చొప్పున నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ముఖ్యంగా నీటి ఎద్దడి ఉన్న గ్రామాల్లో ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే ఉమ్మడి చిత్తూరులో 30 శాతం పనులు పూర్తయ్యాయి.

# ఆలివ్‌రిడ్లేలకు పునర్జన్మ

విజయనగరం: ఆలివ్‌రిడ్లేలు.. ఎంతో ప్రాముఖ్యతతో పాటు అరుదైన జాతిగా గుర్తింపు పొందిన తాబేళ్లు. విశాఖ, బాపట్ల, శ్రీకాకుళం తదితర తీర ప్రాంతాలతో పాటు జిల్లాలోని పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో దర్శనమిస్తుంటాయి. ఇవి ప్రాణాపాయస్థితిలో పడ్డాయి. నిత్యం ఎక్కడో ఒక చోట ఒడ్డున మరణించి కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రక్షణ కల్పించేందుకు అటవీశాఖ చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే హేచరీలను ఏర్పాటు చేసి, వాటి సంతతిని పెంచుతోంది.ఫిబ్రవరి, మార్చి నెలల్లో రిడ్లేలు గుడ్లు పెడతాయి. ఒడ్డుకు చేరి, ఇసుక బొరియల్లో చేరుతాయి. కొన్ని రోజుల పాటు అక్కడే ఉండి, పొదిగి లోపలికి వెళ్లిపోతాయి. పిల్లలు పుట్టాక అవే తీరానికి చేరాలి. ఈ నేపథ్యంలో పక్షులు, ఇతర క్రిమీరాలు, కుక్కలు, నక్కలు తినకుండా వాటికి రక్షణ అవసరం. దీంతో అటవీ శాఖ ప్రైవేటు సంస్థ అయిన ట్రీ ఫౌండేషన్‌తో చేతులు కలిపింది. ఆ సంస్థతో కలిసి ఎనిమిదేళ్ల నుంచి హేచరీల ద్వారా వాటిని కాపాడుతోంది.10 ప్రాంతాల్లో..బొడ్డుగరయ్యపేట, తిప్పలవలసలో రెండేసి, చేపలకంచేరు, ముక్కాం, భోడసల్లిపేట, పులిగెడ్డపాలెం, బర్రిపేట, చింతపల్లిలో హేచరీలు ఉన్నాయి. ఒక్కో చోట 246 నెస్ట్ (తల్లి తాబేళ్లు గుడ్లు



పొదిగేందుకు పెట్టిన గూళ్లు)లను ఏర్పాటు చేశారు. ఇక్కడ గుడ్లను కృత్రిమంగా పొదిగిస్తారు. ఈ ఆర్థిక ఏడాదిలో ఇప్పటి వరకు 27,449 గుడ్లను సేకరించి, గురువారం నాటికి 104 పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టారు. సంరక్షకులు 25 మంది సిబ్బందిని నియమించారు.ఆ బాధ్యత మనదే.. ఆలివ్‌రిడ్లేలను కాపాడే బాధ్యత మనదే. మత్స్యకారులు, వేటకు వెళ్లేవారు జాగ్రత్తలు తీసుకోవాలి. అవి తిరిగే ప్రాంతాల్లో మెకనైజ్డ్ బోట్లను ఉపయోగించొద్దు. లేకు, నానాజాతి వంటి ప్రమాదకరమైన వలలను వాడొద్దు. తీరంలో కనిపిస్తే మాకు సమాచారం ఇవ్వాలి. ఆర్.కొండలరావు, జిల్లా అటవీ శాఖ అధికారి

# పన్ను వసూళ్లు 52 శాతమే!

భీమవరం : గ్రామ పంచాయతీల్లో పన్ను వసూళ్లు మందకొడిగా సాగుతున్నాయి. పల్లెల్లో నిర్వహణ, అభివృద్ధి పనులకు ఈ నిధులే ఆధారం. ఏటా మార్చి 31 నాటికి పన్ను వసూళ్లు పూర్తి చేయాల్సి ఉంటుంది. దీనిపై ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా స్థానిక సిబ్బంది అలసత్వం కారణంగా పలు పంచాయతీలు లక్ష్య సాధనలో వెనుకబడుతున్నాయి.జిల్లా వ్యాప్తంగా 409 పంచాయతీలు ఉండగా పన్నుల ద్వారా రూ. 52.87 కోట్లు వసూలు చేయాల్సి ఉంది. ఫిబ్రవరి 23 నాటికి రూ.27.40 కోట్లు (దాదాపు 52 శాతం) మాత్రమే వసూలు చేశారు. పంచాయతీల్లో పన్నులు, రుసుముల ద్వారా వచ్చే ఆదాయం పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సేవలు



పారదర్శకంగా అందేలా స్వర్ణ పంచాయతీ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీనిలో గ్రామంలో ఇళ్లు, ఖాళీ స్థలాల వివరాలన్నీ నమోదు చేశారు. ఇంటి, కుళాయి పన్నులు, చెరువుల లీజు, మార్కెట్ ఆశీలు, భవన నిర్మాణ క్రమబద్ధీకరణ తదితర రుసుముల ద్వారా పంచాయతీలకు రూ.కోట్లలో ఆదాయం సమకూరుతోంది. సాధారణ పద్ధతుల్లో చెల్లింపుల కారణంగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. డిజిటల్ చెల్లింపులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే నిధుల దుర్వినియోగానికి అవకాశం ఉండదని అధికారులు భావిస్తున్నారు. పంచాయతీల్లో ఇప్పటికే యూపీఐ క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. స్వర్ణ పంచాయతీ పోర్టల్, డిజిటల్ చెల్లింపులు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే పాలనలో పారదర్శకతతో పాటు సేవలు వేగవంతమవుతాయని జిల్లా పంచాయతీ అధికారిణి బి. అరుణశ్రీ తెలిపారు. పంచాయతీల్లో మార్చి 15 నాటికి శత శాతం పన్ను వసూళ్లు పూర్తి చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేసినట్లు వెల్లడించారు.

# గుడ్లు మింగుతున్న గుత్తేదారు

ఆళ్లగడ్డ: అధికారులు 'గుడ్లు'తేలేయడంతో గుత్తేదారు నెలకు రూ.లక్షలు గుటుక్కున మింగేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.కోట్లు వెచ్చిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న వారికి ఒక్కొక్కరికి నెలకు 25 గుడ్లు అందించాలి. బాలింతలు, గర్భిణులకు టేక్ హోమ్ రేషన్‌తో కలిపి ఇంటికే పంపిస్తున్నారు. మూడేళ్ల లోపున్న చిన్నారులకు పాలతోపాటు గుడ్లు ఇంటికే అందిస్తున్నారు. 3- 6 ఏళ్ల వయస్సున్న పిల్లలకు కేంద్రంలోనే భోజనంతోపాటు గుడ్డు ఇస్తున్నారు.

**రంగులు మరిచారు** ఆళ్లగడ్డలో పంపిణీ చేస్తున్న గుడ్లకు పంపిణీదారు ఎలాంటి రంగులు వేయకుండానే సరఫరా చేస్తుండటం గమనార్హం. "గుత్తేదారు సరఫరా చేసే గుడ్లను పరిశీలిస్తాం. ఒక ట్రేలోని గుడ్ల బరువు 1500 గ్రాములు ఉండాలి. బరువు తక్కువగా ఉంటే వెనక్కి పంపిస్తాం. గుడ్ల మీద రంగులు వేయకున్నా సదరు సరఫరాదారుపై చర్యలు తీసుకుంటామని" సీడీపీవో తేజేశ్వరి పేర్కొన్నారు.

**నెలకు రూ.4 కోట్ల ఖర్చు** ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా నెలకు 80 నుంచి 85 లక్షల వరకు గుడ్లు అవసరం అవుతాయి. సరఫరా బాధ్యతను గుత్తేదారుకు అప్పగించారు. నెలకు రూ.4 కోట్ల వరకు బిల్లు చెల్లిస్తున్నారు.నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ (ఎన్ఈసీసీ) నిర్ధారించిన ప్రకారం ధర నిర్ణయించారు. రవాణా ఛార్జీలు కింద ఒక గుడ్డుకు 81 పైసలు గుత్తేదారుకు ఇస్తున్నారు.'నెక్' ప్రకారం టోకు ధర రూ.4.62 ఉండగా, రవాణా ఛార్జీలు కలుపుకొని ఒక గుడ్డుకు రూ.5.43 వరకు చెల్లిస్తారు. నిబంధనల ప్రకారం ఒక ట్రే (30 గుడ్లు) బరువు 1,500 గ్రాములు ఉండాలి.

# మూడోసారి ఆదరించనున్నారు!



చిత్తూరు : వెనకబడిన తరగతుల సంక్షేమం, స్వయం ఉపాధి లక్ష్యంగా గతంలో తెదేపా ప్రభుత్వం ఆదరణ పథకాన్ని అమలు చేసింది. 1999-2004లో చంద్రబాబు ఈ పథకానికి రూపకల్పన చేసి బీసీలకు రాయితీపై పరికరాలు అందజేయడంతో వేలాది మందికి స్వయం ఉపాధికి అవకాశం లభించింది. తర్వాత వచ్చిన కాంగ్రెస్, వైకాపా ఈ పథకాన్ని అటకెక్కించాయి.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఆదరణ-3 పథకాన్ని అమలు చేసేందుకు సీఎం చంద్రబాబు పచ్చజెండా ఊపారు. బీసీల్లో ఎక్కువ మంది చేతివృత్తులు చేసుకునేవారే. వడ్రంగి, తాపీ పని, ఎలక్ట్రికల్, భవన నిర్మాణం, టైలరింగ్ వంటి వృత్తులు చేసే వారికి అవసరమైన పరికరాలు అందజేయడానికి తెదేపా ప్రభుత్వం ఆదరణ పథకాన్ని తెచ్చింది. 2018లో ఈ పథకాన్ని పునరుద్ధరించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 90 శాతం రాయితీపై యూనిట్లు అందజేశారు. లబ్ధిదారుల వాటాగా యూనిట్ ధరలో 10 శాతం మాత్రమే చెల్లించేలా పథకాన్ని అమలు చేశారు. ఉమ్మడి జిల్లాలో 24 వేల మంది దరఖాస్తు చేసుకోగా, 12 వేల మంది యూనిట్లు పొందారు. తర్వాత వచ్చిన వైకాపా ఈ పథకాన్ని నిలిపివేసింది. అప్పట్లో లబ్ధిదారులు చెల్లించిన 10 శాతం వాటా తిరిగి ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం ఆదరణ-3 పథకానికి పచ్చజెండా ఊపడంతో బీసీ వర్గాల్లో ఆశలు రేగాయి. భవన నిర్మాణ రంగ పని విధానంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా నూతన పరికరాలు అందించాల్సిన అవసరం ఉంది.

'ఆదరణ-3 పథకానికి ఏప్రిల్ నుంచి కార్యాచరణ ప్రారంభం కానుంది. త్వరలో మార్గదర్శకాలు వెలువడనున్నాయని తదనంతరం ప్రక్రియ మొదలు పెట్టి అర్హులకు లబ్ధి చేకూరుస్తా'మని బీసీ కార్పొరేషన్ ఈడీ బి.శ్రీదేవి తెలిపారు.

మళ్లీ ఆశలు..

ఉమ్మడి జిల్లాలో బీసీ కులాలు: 141

కులవృత్తిదారులు: ఐదు లక్షల మంది

ఆదరణ-2 కింద వచ్చిన దరఖాస్తులు: 67 వేలు

లబ్ధిదారులకు మంజూరు: 28 వేలు

# వేణుగోపాలా.. భూముల జాడ లేదయా!



బొబ్బిలి : బొబ్బిలి శ్రీవేణుగోపాలస్వామి ఆలయ భూముల వ్యవహారం అయిదేళ్లు అవుతున్నా కొలిక్కి రాలేదు. 2020 ఆగస్టు 2, 3, 4 తేదీల్లో స్వామి ఆస్తులను దేవదాయశాఖ రాష్ట్ర బృందం ప్రత్యేకంగా లెక్కించింది. ఎక్కడ ఎన్ని ఎకరాలు ఉన్నాయి? ఎన్ని ఆభరణాలు ఉన్నాయన్నది రికార్డుల ప్రకారం తేల్చారు. ఆభరణాల లెక్క తేలడంతో సుమారు 18 కిలోల బంగారం, వెండి పలు బ్యాంకుల లాకర్లలో భద్రపరిచారు. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో ఉన్న భూములను మాత్రం క్షేత్రస్థాయిలో గుర్తించలేకపోయారు. ఆరు నెల్లో కొలిక్కి వస్తాయని అప్పట్లో చెప్పగా ఇంతవరకు అతీగతీ లేదు.

**ఇవీ ఇబ్బందులు** వేణుగోపాలుడి భూముల వ్యవహారంపై రీసర్వేతోనే స్పష్టత వస్తుందని అప్పట్లో చెప్పుకొచ్చారు. కొన్నిచోట్ల సర్వే పూర్తయినా లెక్క తేలలేదు. కొన్ని భూములకు సర్వే నంబర్లు లేక సమస్య వస్తోంది. ఆలయ భూమిలే అని చెప్పడానికి వీలులేకుండా కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని రెవెన్యూ సిబ్బంది తాత్సారం చేస్తున్నారు.

గుర్తించిన వాటిలో బలిజిపేట మండలం అజ్జాడతో పాటు బొబ్బిలి మండలంలో 714 ఎకరాలున్నాయి. వీటి నుంచి ఎలాంటి శిస్తు రాలేదు. పాత బొబ్బిలిలో 10 ఎకరాలు, గొల్లపల్లి-9.30, ఎంబన్నవలస-3, తెర్లాం-6.87 ఎకరాల నుంచి నామమాత్రపు శిస్తులు వస్తున్నాయి. నిబంధనల మేరకు దేవదాయ శాఖకు చెల్లించాల్సిన రుసుములు జమ చేయడం లేదు. వేలం పాటలతో కొత్త వారికి అప్పగించాలని అనుకున్నా ప్రక్రియ ముందుకు కదలడం లేదు. రైతులు సహకరించడం లేదు.

శ్రీకాకుళం జిల్లా పద్మాపురంలో 1.32 ఎకరాలు, రామసేపేట-9, మల్లివీడు-240, వాటపాగు-30 ఎకరాలున్నట్లు తేల్చినా అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి.

మొఖాస కొత్తవలసలో 1,585 ఎకరాల భూములు ఉన్నప్పటికీ వాటి ఆనవాళ్లు లేవు.

స్వామి భూముల చిట్టా

మొత్తం ఎకరాలు: 4,011

గుర్తించినవి: 714

గుర్తించాల్సినవి: 3,297వేలం వేస్తాం.. స్వామి భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆయా మండలాల తహసీల్దార్లను కోరాం. ఇంతవరకు గుర్తించలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. అజ్జాడ రైతుల చేతిలో కొన్ని భూములున్నాయి. సాగు చేస్తున్న వాటికి లీజులు ఇవ్వాలని వారిని కోరాం. అయినా ముందుకు రాలేదు. వాటిని స్వాధీనం చేసుకుని కౌలుకు వేలం వేస్తాం. ప్రసాద్, కార్యనిర్వాహక అధికారి

# కాలువ గట్లనూ వదల్లేదు..!

జీలుగుమిల్లి : మట్టి మాఫియా ఇష్టానుసారంగా రెచ్చిపోతుంది. పగలు రాత్రి తేడా లేకుండా మట్టి రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వీరి అక్రమార్జనకు కొంత మంది అధికారులు చేతులు కలపడంతో ఏకంగా కిలోమీటర్ల మేర కాలువ గట్టునే తవ్వేస్తున్నారు. గోదావరి జలాలను కృష్ణమ్మకు చేర్చి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయాలనే సంకల్పంతో తెదేపా ప్రభుత్వం పదేళ్ల కిందట చింతలపూడి ఎత్తిపోతల పథకం ప్రారంభించింది. తొలి రోజుల్లో ప్రధాన కాలువ తవ్వి మట్టిని గట్టుగా ఇరువైపులా పోశారు. వైకాపా హయాంలో పనులు నిలిపోయాయి. దీంతో ఈ కాలువ గట్టుపై కన్నేసిన మాఫియా ఎక్కడ వదిలే అక్కడ తవ్వేస్తున్నారు. అడిగేవారు లేరని.. ఎత్తిపోతల పథకం మూలనపడటంతో ఆ శాఖాధికారులు వేరే శాఖలకు బదిలీ అయ్యారు. రెవెన్యూ, పోలీసు అధికారులు తమకేమీ సంబంధం లేదంటూ తప్పుకొంటున్నారు. దీంతో అక్రమార్కులు జీలుగుమిల్లి మండలం వి.రాజవరం నుంచి టి.నరసాపురం మండలం సీతాపేట, గంగినీడిపాలెం, బండివారిగూడెం, మక్కినవారిగూడెం, టి.నరసాపురం వరకు గట్టుకు గండ్లు పెట్టి మట్టిని దోచేస్తున్నారు. ఇలా పది కిలోమీటర్ల మేర కాలువ గట్టు కానరాకుండా చేశారు. మాఫియా తవ్వేసిన కాలువ గట్టుపై కొన్ని



చోట్ల రైతులు పంటలు కూడా సాగు చేయడం గమనార్హం. గ్రావెల్‌కు గిరాకీ ఉండటంతో.. ప్రస్తుతం గ్రావెల్‌కు మంచి గిరాకీ ఉంది. ఒక ట్రక్కు మట్టి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు అమ్ముతున్నారు. దీంతో సీతంపేటకు చెందిన వైకాపా నాయకుడు రెండు యంత్రాలు ఏర్పాటు చేసి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి నిత్యం మట్టి రవాణా చేస్తున్నారు. భవిష్యత్తులో కాలువ పనులు సాగిస్తే గట్టును పటిష్ఠం చేసేందుకు గ్రావెల్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. ప్రస్తుతం గట్టు లేకపోవడంతో వర్షపు నీరు నేరుగా కాలువలోకి వస్తూ గండ్లు పడుతున్నాయి. పలుమార్లు రెవెన్యూ సిబ్బంది దిని కాలువ గట్టుపై తవ్వకాలను నివారించేందుకు పంపించామని టి.నరసాపురం తహసీల్దార్ సత్యసాయిబాబా తెలిపారు. వారం రోజుల పాటు గస్తీ ఏర్పాటు చేసి అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

# దృష్టి పెడితే గట్టి మేలు

ఏలూరు: వైకాపా ప్రభుత్వ అలసత్వం..జగన్ అభివృద్ధిని గాలికొదిలేయడం..కేటాయించిన నిధులను దారి మళ్లించడం వంటి కారణాలతో జిల్లాలో ఎన్నో ప్రభుత్వ భవనాలు మొండి గోడలతో దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వ వైఫల్యాలను వెక్కిరిస్తున్నాయి. బడ్జెట్ వేళ కూటమి సర్కారు కొద్దిపాటి నిధులు కేటాయిస్తే జిల్లా వాసులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది.

**గుత్తేదారుకు బకాయిలతో..**

మన్యం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 2020లో పోలవరంలో 30 పడకల సీహెచ్‌సీ ప్రారంభించారు. రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉన్నా వైకాపా పాలకులు నాలుగేళ్లు కాలం గడిపేశారు. రూ.5.16 కోట్లతో మొదలు పెట్టిన నిర్మాణ పనులు 50 శాతం పైగా పూర్తయ్యాయి. ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, కిటికీలు తదితరాలు పూర్తి చేయాల్సి ఉంది. గుత్తేదారుకు భారీగా బకాయిలు ఉండటంతో చాలా కాలంగా పనులు ఆగిపోయాయి. దీంతో ప్రస్తుత ఆసుపత్రిలో చాలీచాలని గదుల్లో రోగులు, వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

**100 పడకలకు అయిదేళ్లుగా..**

చింతలపూడిలోని 100 పడకల ఆసుపత్రి నిర్మాణం రూ.22 కోట్లతో 2020లో మొదలు పెట్టారు. ఇప్పటికి అయిదేళ్లు గడుస్తున్నా నిధుల సమస్యతో పూర్తి కాలేదు. వైకాపా పాలనలో గుత్తేదారుకు దాదాపు రూ.4 కోట్ల బకాయిలున్నాయి. ఇప్పటికి 60శాతం వరకు పూర్తి కాగా నిధులిస్తే త్వరగా ఆసుపత్రి అందుబాటులోకి వస్తుంది.



అంతటా అంతే.. జిల్లాలో సచివాలయాలు మొదలు..రైతు సేవా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ భవనాలు, మార్కెటింగ్ శాఖ పరిధిలోని మల్టీపర్పస్ గిడ్డంగులు, నాడు - నేడు పాఠశాలలు ఇలా చాలా నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. అంగన్‌వాడీ, క్రీడావికాస కేంద్రాల నిర్మాణాలు తెదేపా ప్రభుత్వ హయాంలో 60 నుంచి 80 శాతం వరకు పూర్తి అయినా వైకాపా సర్కారు కనీసం పట్టించుకోలేదు. అసంపూర్తి అంగన్‌వాడీ కేంద్రాలైతే నియోజకవర్గానికి మూడు నాలుగు ఉన్నాయి. వీటిల్లో ఒక్కో రూ.లక్ష నుంచి రూ.5 లక్షలు కేటాయిస్తే పూర్తి చేసే పనులే అధికం. తెదేపా మొదలు పెట్టిన పనులు తాము ఎందుకు పూర్తి చేయాలన్న అక్కసుతో గాలికొదిలేశారు.

**రాజకీయ క్రీనీడ**

భీమడోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో 2017 తెదేపా పాలనలో రూ.2.5 కోట్లతో క్రీడా వికాస కేంద్రం, ఇండోర్ మైదానం, క్రీడాకారులకు వసతి గృహ నిర్మాణం మొదలు పెట్టారు. ఏడాదిన్నరలో శరవేగంగా 65 శాతం పనులు చేశారు. ప్రభుత్వం మారటంతో వైకాపా సర్కారు వీటికి పైసా విదల్చలేదు. రూ.కోటి కేటాయిస్తే అన్ని పనులు పూర్తి చేయవచ్చు. ఈ కేంద్రాలు జిల్లాలో దాదాపు 10 వరకు అసంపూర్తిగా మిగిలాయి.

**కూటమి సర్కారు కరుణిస్తేనే..**

గత తెదేపా పాలనలో చివరి దశలో ఉన్న భవనాలను సైతం వైకాపా గాలికి వదిలేసింది. అలానే వైకాపా అధికారంలో ఉన్న సమయంలో మొదలు పెట్టిన పనులనూ అర్ధంతరంగా నిలిపేసింది. ఫిబ్రవరి-28న కూటమి సర్కారు రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో అసంపూర్తి భవనాలను పరిగణనలోకి తీసుకోవాలి. వాటికి ఎంత ఖర్చు అవుతుందో అంచనాలతో నిధులు మంజూరు చేస్తే పూర్తయ్యే దశలో ఉన్న పనులన్నీ ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

# మారనున్న పురం రూపురేఖలు

హిందూపురం : ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలన్నా రహదారుల పాత్ర కీలకం. కానీ, రెండు లక్షల జనాభా ఉన్న, జిల్లాలోనే అతి పెద్ద పట్టణమైన హిందూపురంలో రహదారులను చూస్తే చిన్న పంచాయతీని తలపిస్తాయి. పట్టణంలోకి రావాలన్నా, బయటకు పోవాలన్నా రాకపోకలకు ఇబ్బంది తప్పదు. ఇక పట్టణంలో అన్నీ ఇరుకు రోడ్లే. ఇక్కడి పరిస్థితిని గుర్తించిన ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురం చరిత్రలోనే చారిత్రాత్మక మార్పునకు శ్రీకారం చుట్టారు. పట్టణంలో కొన్ని రహదారులు మున్సిపల్ శాఖ, మరి కొన్ని రోడ్లు జిల్లా రహదారులు, ఇంకొన్ని రోడ్లు.. భవనాల శాఖ, మరికొన్ని రాష్ట్ర హైవే తదితర శాఖలు, విభాగాల పరిధిలో ఉన్నాయి. దీంతో వీటి పరిధి, విస్తరణ, విస్తీర్ణం, అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై సమగ్ర నివేదిక తయారు చేయించారు. 60 కిలోమీటర్ల పొడవైన 24 రహదారులను రూ.200 కోట్లతో అభివృద్ధి చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

**పనులు ఆర్అండ్‌బీకి..**

ఈ పనులను మున్సిపల్ శాఖతో చేయిస్తే విపరీతమైన జాప్యం అవుతుందని, రెండు శాఖలను సమన్వయం చేసి పనులు చేయించాలన్నా, క్షేత్రస్థాయిలో సమస్యలు వస్తాయని గుర్తించారు. దీంతో హిందూపురం రహదారుల అభివృద్ధి పనులను రోడ్లు భవనాలశాఖకు అప్పగించాలని నిర్ణయించారు. ఇక్కడ ఆర్అండ్‌బీలో ఒకే ఒక్క ఇంజినీర్ ఉండటంతో రూ.200 కోట్ల పనుల పర్యవేక్షణ సాధ్యం కాదని.. ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేసి, మరి కొందరు ఇంజినీర్లను నియమించేలా చూడాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పట్టణంలో రహదారుల విస్తరణకు



అడ్డుగా ఉన్న ఆక్రమణల తొలగింపు, విస్తరణకు అవసరమైన భూసేకరణను మున్సిపల్ అధికారులు చూడాలని ఆదేశాలిచ్చారు. అభివృద్ధికి గుర్తించిన రహదారుల్లో 13 మున్సిపాలిటీ పరిధిలో ఉన్నాయి. వీటితోపాటు మిగిలిన 11 రోడ్లను కూడా రోడ్లు భవనాల శాఖకు అప్పగిస్తూ మున్సిపాలిటీ తీర్మానం చేయించి, ఉన్నతాధికా రులకు పంపించారు.

**ప్రధానమైన రోడ్లు ఇవే..**

పట్టణంలోని రైల్వే రోడ్డు, బైపాస్ రోడ్డు, మేళాపురం నుంచి ముద్దిరెడ్డిపల్లి, సింగిరెడ్డిపల్లి రోడ్, బెంగళూర్ రోడ్, కొటిపి రోడ్, దండు రోడ్డు, వాసవీ ధర్మశాల రోడ్, చర్చి రోడ్, పెనుకొండ రోడ్డు, ఒక్కటో పట్టణ పోలీసుస్టేషన్ రోడ్, పైపులైన్ రోడ్, చిన్న మార్కెట్టు రోడ్డు, కదిరి రోడ్ (కొట్నూరు వరకు) శాసనకోట రోడ్, లేపాక్షి రోడ్డు.


**అప్పగింత దస్త్రం ఉన్నతాధికారులకు- శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్**

ఎమ్మెల్యే బాలకృష్ణ ఆదేశాల మేరకు 24 రహదారుల అభివృద్ధికి చర్యలు చేపట్టాం. ఈ పనులను రోడ్లు భవనాల శాఖకు అప్పగిస్తూ, కౌన్సిల్ ఆమోదం తీసుకొని దస్త్రాలు పంపాము. బడ్జెట్టు ఆమోదం తరువాత నిధులు వచ్చే అవకాశం ఉంది.

# రూ.కోట్లు కుమ్మరింత.. కళ్లప్పగింత!!

విశాఖపట్నం: 'రేపటి ఆర్థిక నగరాలు' అనే అంశంపై విశాఖలో 2023 మార్చిలో జి-20 సన్నాహక సదస్సు నిర్వహించారు. నగరాల్లో నాణ్యమైన మౌలిక వసతుల కల్పన, ఆదాయ వనరుల పెంపు, ప్రైవేటు భాగస్వామ్యం వంటి అంశాలపై ఇందులో కీలకంగా చర్చించారు. అలాంటి సదస్సు నిర్వహణకు రూ.కోట్ల నిధులు కేటాయించినా.. నగరవాసులకు నాణ్యమైన మౌలిక వసతులు కల్పించలేకపోయారు. కొందరు నేతలు, అధికారుల జేబులు మాత్రం నిండాయనే విమర్శలున్నాయి. వైకాపా హయాంలో చేపట్టిన పనులు రెండేళ్లకే ఆనవాళ్లు కోల్పోయాయి.

కాకిలెక్కలతో: జీవీఎంసీ పరిధిలో 'జి-20' సదస్సు నిర్వహణ పేరుతో రూ.115 కోట్ల వరకు ఖర్చు చేశారు. ఇందులో రహదారి డివైడర్ల గ్రిల్స్‌కు రంగులు వేసేందుకు రూ.3.20 కోట్లు కేటాయించారు. బీచ్ రోడ్డులో తెన్నేటి పార్కు, సీతకొండ వద్ద పెయింటింగ్ వేసేందుకు



రూ.30లక్షలు వెచ్చించారు. తెన్నేటి పార్కు వద్ద బొమ్మలు వేసేందుకు రూ. లక్షలు ఖర్చు చేసినట్లు అప్పట్లో కాకి లెక్కలు చూపించారు. ప్రస్తుతం ఈ బొమ్మలు వెలిసిపోయి కళాహీనంగా దర్శనమిస్తున్నాయి. ఆర్కేబీచ్, సీతకొండ వద్ద రూ.1.40 కోట్లతో సోలార్ ట్రీలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దిష్టిబొమ్మల్లా మిగిలిపోయాయే తప్ప రాత్రిళ్లు దీపాలు పని చేయడం లేదు. సాగర్‌నగర్, మరికొన్ని చోట్ల తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

నిర్వహణలేక మూలకు చేరాయి. బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌ల మరమ్మతులకు రూ.23 కోట్ల మేర ఖర్చు చేశారు. ప్రస్తుతం చాలా చోట్ల టైల్స్ ధ్వంసమై దర్శనమిస్తున్నాయి. వ్యూపాయింట్ సమీపంలో చేసిన పనులు సైతం దెబ్బతిన్నాయి. కోస్టల్ బ్యాటరీ నుంచి రాడిసన్‌బ్లూ వరకు ప్రత్యేక లైటింగ్‌కు రూ.3కోట్లుపైగా ఖర్చు చేయగా అవీ మూడురోజుల ముచ్చటే అయ్యాయి. సుందరీకరణ పేరుతో నిధులు కుమ్మరించగా కొద్దిరోజులకే అవి చెల్లాచెదురయ్యాయి.

**టెండర్లు ఇష్టారాజ్యంగా**

నిబంధనలకు విరుద్ధంగా టెండర్లు అప్పగించి నాడు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారు. టెండర్లు ఆహ్వానించడానికి ముందే గుత్తేదారులతో ఆ పనులు చేయించడం గమనార్హం. మరోవైపు షార్ట్ టెండర్లు పేరుతో పెయింటింగ్స్‌కు నిధులు కుమ్మరించి దుర్వినియోగం చేశారు. రహదారుల పేరిట.. చేసిన పనులే చేసి పైపై పూతలు పూసి నిధులు జేబుల్లో వేసుకున్నారు. వీటిపై విజిలెన్స్ విభాగం దర్యాప్తు చేయాలంటూ అప్పట్లో విశ్రాంత ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ ప్రభుత్వానికి లేఖ రాశారు. వైకాపా నేతల హోటళ్లు, ఆస్తులున్న చోట్ల అభివృద్ధి పనులు పేరిట నిధులు ఎక్కువగా ఖర్చుచేసి, మిగిలిన చోట్ల తాత్కాలిక పనులతో మమ అనిపించారు.

# ఆన్‌లైన్‌లో జూదం.. ప్రాణాలే పణం




ఉరవకొండ : ఉమ్మడి అనంత జిల్లాలో బెట్టింగ్ భూతం పడగవిప్పుతోంది. తొలుత సరదాగా ప్రారంభమై.. వ్యసనంగా మారి, చివరకు ప్రాణాలు బలిగొంటోంది. దీని ఉచ్చులోపడి యువత విలవిల్లాడుతున్నారు. ఏదో ఒకరోజు గెలుస్తామనే ధీమాతో అప్పులు చేసి మరీ బెట్టింగ్ ఆడతారు. వాటిని తీర్చే మార్గం కనబడక ఒత్తిడికి గురవుతున్నారు. చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉంటే చాలు సులువుగా ఆన్‌లైన్ జూదానికి అలవాటు పడుతున్నారు. ఆ వ్యసనం నుంచి గట్టెక్కలేక అర్థాంతరంగా ఉసురు తీసుకుంటున్నారు. జిల్లాలో ఇటీవల చోటు చేసుకున్న బెట్టింగ్ యాప్ మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఉరవకొండ మేజర్ పంచాయతీకి చెందిన ఓ యువకుడు బెంగళూరులో ఓ ప్రైవేట్ ఉద్యోగం చేసేవాడు. స్నేహితులతో కలిసి డేటా బెట్‌యాప్‌లో పెట్టుబడి పెట్టాడు. ఆ మొత్తం పోయింది. అంతటితో ఆగకుండా అప్పులు చేసి మరీ ఆడాడు. అవీ పోయాయి. స్నేహితులు సైతం తమ డబ్బులు ఇవ్వాలంటూ ఒత్తిడి తెచ్చారు. అప్పులు రూ.8 లక్షలకు చేరుకోవడంతో తీర్చే మార్గం లేక మనోవేదనకు గురై ఈనెల 8న క్రిమి సంహారక మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. అప్పుల విషయంలో మిత్రులు అనవసరంగా గొడవ చేయడంతో ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. బెట్టింగ్ భూతానికి కొడుకును కోల్పోయామని వాపోయారు.

విడపనకల్లు మండలంలో ఓ గ్రామానికి చెందిన వ్యక్తి ఆన్‌లైన్‌లో ఫజిల్ ఆడితే లభించే గోల్డ్‌కాయిన్ ఆధారంగా రెట్టింపు స్థాయిలో డబ్బు వస్తుందని నిర్వాహకులు వల విసిరారు. ఆశపడి జూదం ఆడాడు. ఇది మోసమని గుర్తించే లోపు రూ.16.31 లక్షలు పోగొట్టుకున్నాడు. వ్యవసాయం చేస్తున్న అతనికి ఆన్‌లైన్ గేమ్ ద్వారా తీరని నష్టం జరిగింది. ఈ విషయమై పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. జూదం రైతును కోల్పోలేని దెబ్బతీసింది.

పుట్టపర్తి పట్టణానికి చెందిన ఓ యువకుడు సాఫ్టవేర్ ఉద్యోగం చేస్తూ నెలకు 70,000 జీతం ఆర్జిస్తూ సంతోషంగా ఉండేవాడు. ఈ సమయంలో ఆన్‌లైన్ జూదానికి అలవాటుపడి జీతం చాలక అప్పులు చేయడం మొదలుపెట్టాడు. చివరికి ఇష్టంగా కొనుక్కున్న ద్విచక్ర వాహనాన్ని కూడా తాకట్టు పెట్టాడు. ఆరంకెలు జీతం సంపాదిస్తున్న కొడుకుని చూసి సంతోషపడిన తల్లిదండ్రులు ఇటీవల అతడి మానసిక పరిస్థితి చూసి విచారిస్తే అప్పుల్లో కూరుకుపోయినట్లు గుర్తించి తల్లడిల్లిపోయారు. గుట్టుచప్పుడు కాకుండా అప్పులుతీర్చి కుటుంబ పరువు కాపాడుకున్నారు. ఇంకెవ్వరూ ఈ మహమ్మారి జోలికి వెళ్లొద్దని కోరుతున్నారు.

**టీ కేఫ్‌లే వేదికలు**

నగరం, పట్టణ పరిసర ప్రాంతాల్లో టీకేఫ్‌లు వేదికగా నిలిచాయి. విద్యార్థులు, యువత కళాశాలలు, పనులు వదులుకుని బృందాలుగా అక్కడికి చేరుకుని గంటలకొద్దీ ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడుతున్నారు. కొన్ని సందర్భాల్లో బహిరంగంగా గొడవలకు దిగుతున్నారు. అలాంటి వేదికలపై పోలీసులు కొంత నిఘా ఉంచితే ఆన్‌లైన్ గేమ్‌ల నియంత్రణకు అవకాశం ఉంటుంది.

**ఏదో ఒకచోట ఆపగలగాలి- గరుగు బాలాజీ, సైకియాట్రిస్టు, అనంతపురం**

మద్యపానం, జూదం లాగే ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ వ్యసనం. తీవ్రత పెరిగితే వ్యాధిగా మారుతుంది. డబ్ల్యూహెచ్‌వో 'గ్యాంబ్లింగ్ డిజార్డర్'ను వ్యాధిగా గుర్తించింది. ఇది తొలుత కుతూహలంతో ప్రారంభమవుతుంది. ఆ జూదంలో ఉన్న ఉన్నతస్థాయి అనుభూతి (కిక్) మనిషికి హాయిని ఇస్తుంది. డబ్బులు గెలిచినప్పుడు కలిగిన అనుభూతి పదేపదే కావాలని కోరుకుంటారు. ఆటలో డబ్బులుపోయినా వెనక్కు తగ్గరు. అప్పులు చేసైనా ఆడతారు. ఇలా ఆడుతూ ఊబిలోకి దిగుతారు. డిప్రెషన్‌కు గురవుతారు. చివరికి చనిపోవాలనే నిర్ణయం తీసుకుంటారు. వ్యసనాన్ని ఏదో ఒకచోట ఆపగలగాలి. లేదా చికిత్స ఇప్పించాలి. ఇలా చేస్తే ఆత్మహత్యలు ఆపవచ్చు.

# గుంతకల్లుపై గురిపెడితేనే..



అనంతపురం : 15 వేల ఎకరాలకు సాగునీరు అందించే గుంతకల్లు బ్రాంచి కెనాల్ ఆధునికీకరణ పనులు వైకాపా హయాంలో నిలిచిపోయాయి. దీనికితోడు ఐదేళ్లపాటు నిర్వహణ లేకపోవడంతో కాలువ ఎక్కడికక్కడ బలహీనపడింది. గట్లు కుంగిపోవడం, గండ్లు పడటం తరచూ సంభవిస్తున్నాయి. అక్విడక్టులు, అండర్ టన్నెల్‌లు పూర్తిగా దెబ్బతిని ఎప్పుడు పడిపోతాయో తెలియని దుస్థితి నెలకొంది. ఫలితంగా 600 క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న కాలువలో కేవలం 320 క్యూసెక్కుల ప్రవాహం మాత్రమే ఉంటోంది. పంట కీలక దశలో ఉన్న సమయాల్లో కాలువలో గండ్లుపడి నీరు ముందుకు సాగడం లేదు. మరమ్మతులకు ప్రతిసారీ ప్రవాహాన్ని నిలిపేసి పనులు చేయాల్సి వస్తోంది. దీంతో ఆయకట్టులో సాగుచేసిన మిరప తదితర పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి జీబీసీని ఆధునికీకరించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

**కూటమి ప్రభుత్వంపై ఆశలు**

2017లో ఎమ్మెల్సీగా ఉన్న పయ్యావుల కేశవ్ జీబీసీ అధునికీకరణ పనుల ఆవశ్యకతను అప్పటి తెదేపా ప్రభుత్వానికి వివరించి పనులు మంజూరు చేయించారు. రూ.232 కోట్లతో రెండు ప్యాకేజీలుగా పనులు చేపట్టారు. మొదటి ప్యాకేజీలో 29 కిలోమీటర్ల ప్రధాన కాలువ లైనింగ్, డిస్ట్రిబ్యూటరీల లైనింగ్, కాలువ విస్తరణ దాదాపు పూర్తి చేశారు. రెండో ప్యాకేజీలో కాలువ విస్తరణ చేపట్టారు. 30 కిలోమీటర్ల మేర పనులు జరగాల్సి ఉంది. వైకాపా అధికారంలోకి వచ్చాక పనుల్ని రద్దు చేసింది. అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపినా పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలో ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టిన పయ్యావుల కేశవ్ హంద్రీనీవాతో పాటు జీబీసీని బాగు చేయాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నారు. ఇందులో భాగంగానే జీబీసీలో అత్యవసర మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నారు.

**ఇదే సరైన సమయం**


ప్రస్తుతం జీబీసీలో ప్రవాహం ఆగిపోయింది. ఆయకట్టు కింద 4 వేల ఎకరాల్లో పంటలు కీలక దశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో మరో టీఎంసీ నీరు విడుదల చేయాలని తుంగభద్ర బోర్డును కోరారు. దీనిపై టీబీ బోర్డు ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఒకవేళ నీరు విడుదలైనా వారం రోజులు మాత్రమే ప్రవాహం కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో మార్చి మొదటివారం నుంచి జీబీసీ మరమ్మతు పనులు మొదలుపెడితే జులై నాటికి పూర్తిచేయవచ్చు. ఇప్పుడు ఆలస్యం చేస్తే మరో ఏడాది సమయం వృథా అవుతుంది. ఈ నేపథ్యంలో మంత్రి పయ్యావుల కేశవ్ ప్రత్యేక చొరవ తీసుకుని పనుల్ని పూర్తిచేయించాలని రైతులు కోరుతున్నారు.

**మరమ్మతులు చేపడతాం- రాజశేఖర్, హెచ్చెల్సీ ఎస్ఈ**

జీబీసీకి మరో 0.5 టీఎంసీ నీరు రావాల్సి ఉంది. ప్రవాహం పూర్తిగా తగ్గిపోయిన తర్వాత మరమ్మతులు చేపడతాం. ఇప్పటికే అత్యవసర మరమ్మతులకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే పనులు మొదలుపెడతాం.

# దళారులను నమ్మొద్దు.. నేతల చుట్టూ తిరగొద్దు

తిరుపతి : వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగ నియామక ప్రకటనతో దళారులు వసూళ్లకు తెర తీశారు. రూ.లక్ష నుంచి రెండు లక్షలిస్తే ఉద్యోగాలు ఇప్పిస్తామని దగా చేస్తున్నారు. ఇప్పటికే కొందరు డబ్బులు ముట్టజెప్పారనే ప్రచారం జరుగుతోంది. స్థానిక నేతల వద్దకు దరఖాస్తుదారులు క్యూకట్టడంతో సిఫార్సు లేఖలిచ్చి ఫోన్ చేస్తున్నట్లు సమాచారం. వైద్య ఆరోగ్యశాఖలో ఒప్పంద, పొరుగు సేవల కింద 66 అటెండర్లు, టెక్నీషియన్లు, పారా మెడికల్ పోస్టులకు 3,800 దరఖాస్తులు అందాయి. ఎస్వీ వైద్య కళాశాల 27, రుయా 27, జీఎన్ఎం స్కూల్ 8, పద్మావతమ్మ నర్సింగ్ కాలేజ్ 1, ప్రసూతి ఆస్పత్రి 3 పోస్టులు భర్తీ చేయనున్నారు. వైకాపా హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నాటి మంత్రి అండతో అధికారులు పోస్టుకు ఇంతని డబ్బు



వసూలు చేశారు. ఈ నేపథ్యంలో నియామకాలను రద్దుచేసి ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎక్కడికక్కడ ప్రకటన ఇచ్చింది. 'ఉద్యోగాల భర్తీలో ఎలాంటి అవినీతి, సిఫార్సులకు అవకాశం ఉండదు. మెరిట్ ప్రాతిపదికను నియామకాలు చేపడతాం. దళారుల మాటలు నమ్మి మోసపోవద్ద'ని ఎస్వీఎంసీ ప్రిన్సిపల్ చంద్రశేఖరన్ తెలిపారు.

# పండగ పూటా పస్తులేనా?

కదిరి : కరవు జిల్లాలో కష్టజీవులకు ప్రధాన ఆధారం ఉపాధి హామీపథకమే. సాధారణ జనంతోపాటు వ్యవసాయం ఉన్న రైతులూ కూలీ పనులపై జీవనం సాగిస్తున్న పరిస్థితి. జీవనోపాధికి కల్పిస్తున్న ఉపాధి హామీ పనులకు సకాలంలో బిల్లులు అందడం లేదు. నెలన్నరగా చేసిన పనులకు కూలి అందక కష్టజీవులు దిక్కుతోచకున్నారు. సంక్రాంతి నుంచి శివరాత్రి పండగ వరకు పనులు చేశాం. అప్పటి నుంచి చెల్లింపులు జరగలేదు. ఈ రోజు గడిస్తే శివరాత్రి పండగను జరుపుకోవాల్సి ఉంది. జాగరణతో పాటు ఉపవాసం ఉండాల్సిందేనా అని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండగకు పస్తులు ఉండకుండా బిల్లులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

**వారానికోసారి ఇవ్వాల్సి ఉన్నా..**

ఉపాధి పథకం కూలీలకు వారానికోసారి బిల్లులు చెల్లింపులు చేస్తారు.



పండగల సందర్భంగా ఆలస్యం జరుగుతోంది. 45 రోజులు గడిచినా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం నెలకొంది. అధికారులు మాత్రం అదిగో ఇదిగో అంటున్నారు. ఇప్పటికే కుటుంబ అవసరాలకు చేతి అప్పులు చేశారు. పండగ సరకులు సమకూర్చుకోవాలంటే అప్పులు పుట్టని పరిస్థితి. కాయకష్టానికి సొమ్ములు అందక పండగ సంతోషమూ లేకుండాపోయిందని కూలీలు వాపోతున్నారు. కనీసం ఒకవారం కూలినైనా చెల్లిస్తే కొంత ఊరట దొరుకుందని కోరుతున్నారు.

**ఐదు వారాల కూలి రావాలి- నారాయణస్వామి, ఉపాధికూలీ**

కూలీ పనులతోనే కుటుంబ జీవనం, భార్యాభర్తలిద్దరం ఐదు వారాలపాటు కూలీ పనులు చేశాం. పండగ నాటికి బిల్లులు ఇస్తారని ఆశపెట్టుకున్నాం. శివరాత్రికి ఒక్కరోజే మిగిలింది. కూలి సొమ్ములు ఇస్తారన్న నమ్మకం లేదు. సంతోషంగా జరుపుకోవాల్సిన శివరాత్రికి అప్పులకు వెళ్లక తప్పేలా లేదు. అవకాశముంటే బిల్లులు ఇచ్చి కూలీలకు సంతోషాన్ని పంచాలి.

**వారంలో బిల్లుల చెల్లింపు- విజయప్రసాద్, ఉపాధిహామీ పథకం పీడీ**

కూలీలకు బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగింది. ఈ వారంలో వచ్చే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా చేసిన పనులకు బిల్లులు పెట్టాం. నిధులు విడుదల కావాల్సి ఉంది. వచ్చిన వెంటనే చెల్లింపు చేస్తాం.

# వాహనదారుల సహనానికి పరీక్ష

విశాఖపట్నం: ప్రభుత్వ కార్యకలాపాల్లో కృత్రిమమేధ(ఏఐ)ను ఉయోగించి సరికొత్తగా, త్వరగా సేవలు అందిస్తుంటే విశాఖ రవాణాశాఖలో అందుకు విరుద్ధంగా సాగుతోంది. చిన్నపాటి ఆన్‌లైన్ సేవలకు కూడా కార్యాలయం బాట పట్టించి ప్రజల సహనానికి పరీక్ష పెడుతున్నారు. అదే అడ్డదారిలో ఏజెంట్ల ద్వారా వస్తే మాత్రం అరగంటలో చేసి పంపేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. దాదాపు అన్ని రకాల సేవల్లో అదే అమలు చేస్తున్నట్లు సమాచారం. దీంతో ప్రజలు విసిగిపోతున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుంతో పాటు అదనంగా చెల్లించుకుంటేనే వేగంగా పనులు అవుతున్నాయి. లేకుంటే కార్యాలయం చుట్టూ తిరగాల్సిందేననే భావన వ్యక్తం అవుతోంది. 'వాహన్' వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చాక కొందరు అధికారులు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. పూర్తిగా ఆన్‌లైన్‌లో చేయాల్సిన ఉన్నా కార్యాలయానికి రప్పిస్తున్నారు. వాహనాలకు ఆధార్ లింకు చేయడానికి, వాహనాన్ని మరో వ్యక్తి పేరున మార్చడానికి ఈకేవైసీ అవసరం. ఈ సందర్భాల్లో డీలర్ల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసినప్పుడు రవాణాశాఖ కార్యాలయంలో సంబంధిత అధికారి పరిశీలించి ధ్రువీకరించాలి. అలా చేయకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వాస్తవానికి నిమిషాల్లో ధ్రువీకరించే అవకాశమున్నా గాజువాక, విశాఖ, అనకాపల్లి, నర్సీపట్నం, పాడేరు ఆర్టీవో కార్యాలయాల్లో చాలాసార్లు అలా చేయడం లేదు. ఈకేవైసీ నిమిత్తం విశాఖ రవాణాశాఖ కార్యాలయానికి వెళితే.. మొదట క్లర్క్‌ను కలవాలి. ఆ తర్వాత ఆర్టీవో ఒక నంబరిచ్చి తిరిగి క్లర్క్ దగ్గరకు పంపుతారు. ఆ తరువాత ఏవో పరిశీలనకు పంపిస్తున్నారు. ఇక్కడ ఒకటి, రెండు రోజులు గడిస్తేగాని ధ్రువీకరించడం లేదు.




అలా కాకుండా ఏజెంట్ ద్వారా వస్తే వరుసకట్టకుండానే ఆమోదిం చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బీ ద్విచక్ర వాహనాల బదిలీల్లో సీ-బుక్, రుణ వివరాల పత్రం, బీమా వంటి పత్రాలను ఆన్‌లైన్‌లో సమర్పిస్తే సరిపోతుంది. వాటిల్లో ఏమైనా తప్పిదాలుంటే కార్యాలయానికి పిలిపించాలి. ప్రస్తుతం అలా కాకుండా అన్ని పత్రాలను తీసుకొని నేరుగా హాజరవ్వాలని చెబుతున్నారు. వెళ్లాక కొన్ని పత్రాలు కనిపించడం లేదని, వెబ్‌సైట్ పనిచేయడం లేదంటూ చెప్పి తిరిగి పంపేస్తున్నారు. ఏజెంట్ల ద్వారా వెళ్తే నిమిషాల్లో పనైపోతుందనే చర్చ సాగుతోంది. కొత్త ఆర్సీల విషయంలోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. నిబంధనల ప్రకారం రెండు వారాల్లో చేయాల్సినవి నెల రోజులకైనా అవ్వడం లేదు. కొన్నింటిని మూడు, నాలుగు నెలలు పెండింగులో ఉంచేస్తున్నారు. లైసెన్సులు, ఎల్ఎల్ఆర్‌లలోనూ అదే పరిస్థితి.జాప్యం లేకుండా: దరఖాస్తుదారులకు ఇబ్బంది లేకుండా చూస్తాం. ఈకేవైసీ, ఇతర సేవల్లో జాప్యాన్ని పరిశీలించి వేగంగా అందించేలా చర్యలు తీసుకుంటాం' అని ఇన్‌ఛార్జి డీటీసీ ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## పెనుముప్పు.. కలగదా కనువిప్పు?

పాయకరావుపేట : రెండు ప్రమాదాల తరవాత జాతీయ రహదారి అధికారుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం వీడలేదు. మరోసారి గోడ కట్టేసి చేతులు దులుపుకొన్నారు. అంతే తప్ప వాహనాలు ఢీకొన్నా కిందకు పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వదిలేశారు. రాజమహేంద్రవరం వద్ద ఉన్న గామన్ వంతెనకు సమీపంలో రెండు వైపుల దాదాపు 10 అడుగుల ఎత్తయిన గోడలు నిర్మించారు. ఇదే విధానాన్ని ఇక్కడ పాటిస్తే భవిష్యత్తులో ప్రమాదాలు జరగకుండా అడ్డుకునే అవకాశముంది. లేదా నిపుణుల సలహాతో గోడ నిర్మిస్తే ప్రయోజనం ఉంటుంది. లేకపోతే రైలు ప్రయాణికుల భద్రత గాలికి వదిలేసినట్లే. పాయకరావుపేట పట్టణ పరిధిలో రైల్వేలైన్ మీదుగా జాతీయ రహదారి పై వంతెన ఉంది. రెండు వైపులా దీనికి సిమెంట్‌తో నాలుగు అడుగుల ఎత్తు, సుమారు అడుగు వెడల్పుతో గోడ నిర్మించారు. 2010 మే 24న జరిగిన సంఘటన వంతెన గోడ నిర్మాణంపై పలు ప్రశ్నలు లేవనెత్తింది. తుని నుంచి విశాఖ వైపు వెళుతున్న ట్రాలర్ లారీ గోడను బలంగా ఢీకొంది. గోడ విరిగింది. లారీ సగభాగం పూర్తిగా గాల్లోకి వేలాడింది. ఇంకొంచెం కిందకు వచ్చి ఉంటే సరాసరి



కిందన ఉన్న రైలు పట్టాలపై పడేది. అదృష్టవశాత్తు లారీ అక్కడితో ఆగింది. ప్రమాద స్థలాన్ని రైల్వే, రహదారి భద్రత అధికారులు పరిశీలించారు. యథావిధిగా గోడ నిర్మించేశారు.

2024, డిసెంబరు 23న మరో ప్రమాదం చోటు చేసుకుంది. తుని వైపు నుంచి విశాఖ వైపు వెళుతున్న కంటైనర్ లారీ వంతెన గోడను ఢీకొంది. ఆ ధాటికి గోడ విరిగి, లారీ ఏకంగా కిందకు పడిపోయింది. పట్టాలకు నాలుగు అడుగుల దూరంలో కుప్పకూలింది. పట్టాలపై లారీపడి, అదే సమయంలో ఏదైనా రైలు వెళితే భారీ ప్రమాదమే చోటు చేసుకునేది. రెండో సారి త్రుటిలో పెనువిపత్తు తప్పింది.

**అధికారుల దృష్టికి సమస్య**

రైల్వేలైన్ పైవంతెనపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వంతెన గోడలను మరింత గట్టిగా నిర్మించాల్సి ఉంది. ఇనుప ఊచలతో మరింత బలోపేతం చేయాలి. దీనిపై జాతీయ రహదారి అధికారులతో చర్చిస్తాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళుతున్నాం .అప్పన్న, పాయకరావుపేట సీఐ

## కాసుక్కూర్చున్న కంత్రీలు

మార్కాపురం : పశ్చిమ ప్రకాశం ఆశాజ్యోతి పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్. ఈ బృహత్తర ప్రాజెక్ట్ నిర్మాణంతో మార్కాపురం మండలంలోని గొట్టిపడియ, అక్కచెరువు తండా, పెద్దారవీడు మండలంలోని సుంకేసుల, కలనూతల, గుండంచెర్ల, కాటంరాజు తండా, చింతలముడిపి, అర్ధవీడు మండలంలోని లక్ష్మీపురం, కృష్ణానగర్, సాయిరాంనగర్, రామలింగేశ్వరపురం గ్రామాలు మునిగిపోనున్నాయి. ఇక్కడి వాసులు నిర్వాసితులుగా మిగిలిపోతున్నారు. అటువంటి వారికి ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ అందించడం, పునరావాస కాలనీల నిర్మాణం వంటి పనులు గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టలేదు. ఒక్క నిర్వాసితుడికీ నష్టపరిహారంగా రూపాయి చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వెలిగొండ పూర్తిపై దృష్టిసారించింది. బడ్జెట్‌లో ఇందుకు నిధులూ కేటాయించింది. ముందుగా నిర్వాసితులకు నష్టపరిహారం పంపిణీ చేయాలని తలచింది. ఆ మేరకు ప్రాజెక్టు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

ఆ 27 మందిపై కళ్లు: మొదటి విడతగా పెద్దారవీడు మండలం చింతలముడిపి నిర్వాసితులకు పరిహారం అందించేందుకు అధికారులు




ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. ఈ గ్రామంలో దాదాపు 45 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మొత్తం 95 మంది వరకు నిర్వాసితులున్నారు. అయితే గతంలో అధికారులు 68 మందికి మాత్రమే అవార్డును పాస్ చేశారు. వీరికి ఒక్కొక్కరికి రూ.13.10 లక్షలు ఇవ్వనుంది. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక మిగిలిన 27 మందికి కూడా అందించేలా పూర్తి ఆధారాలతో పాటు అన్ని రికార్డులను సేకరించాలని ప్రాజెక్టు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయం వైకాపా నేతలు, దళారులకు ఇప్పుడు వరంగా మారింది.

**మృతుల స్థానంలో ఇతరులు**

నిర్వాసిత గ్రామంగా ప్రకటించడంతో చింతలముడిపిని అక్కడి వాసులు ఖాళీ చేశారు. పెద్దారవీడు చెంచు కాలనీ, దోర్నాల మండలంలోని పెంటికలపాడు, చిలకచెర్ల, బంధంబావి, పనుకుమడుగు ల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. గతంలో అవార్డుకు అర్హులైన పలువురు ప్రాణాలు కూడా కోల్పోయారు. దీంతో కలనూతలకు చెందిన ఓ వైకాపా నేత, దళారులు రంగంలోకి దిగారు. మృతుల స్థానంలో చెంచు గిరిజనుల పేర్లను గెజిట్‌లో చేర్పిస్తామంటూ వసూళ్లకు తెర లేపారు. అసలైన చింతలముడిపి గ్రామానికి చెందిన చెంచు గిరిజనులను కాకుండా అర్ధవీడు మండలంలోని మావుటూరు తండా, యాచవరం, చీమవేటుపల్లె గ్రామాల్లో ఉన్న వారి పేర్లు చేర్చి పరిహారం కొట్టేసే కుటిల యత్నాలకు దిగారు. సదరు వ్యక్తుల బ్యాంకు పాసుపుస్తకాలు, ఏటీఎం కార్డులు, రేషన్ కార్డులు, ఇంటి పట్టాలతో పాటు ఆధార్‌కార్డులను సదరు నేత తన వద్దే దాచారు. నష్టపరిహారం కింద అందించే రూ.13.10 లక్షల్లో గిరిజనులకు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలు ఇచ్చి మిగిలిన మొత్తం బొక్కేందుకు సిద్ధమైనట్లు పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయమై వెలిగొండ ప్రాజెక్టు మార్కాపురం యూనిట్ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.సత్యనారాయణతో 'న్యూస్‌టుడే' మాట్లాడింది. చింతలముడిపి తండాలోని గిరిజనులకు నష్టపరిహారం పంపిణీ చేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివరాలు నమోదు చేస్తున్నట్లు చెప్పారు. దళారులు కొట్టేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు దృష్టికి రాలేదన్నారు. పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సంతకాలు సృష్టించి.. పట్టాలు పుట్టించి..



చిత్తూరు : కాదేదీ అక్రమానికి అనర్హం అన్నట్లు వైకాపా హయాంలో ఆ పార్టీ నేతల అండతో చెలరేగిన కొందరు రెవెన్యూ సిబ్బంది.. అదే నిర్వాకాన్ని ఇంకా కొనసాగిస్తున్నారు. సంతకాలు ఫోర్జరీ చేసి పట్టాలు పుట్టిస్తున్నారు. వైకాపా హయాంలో విచ్చలవిడిగా జరిగిన వ్యవహారంపై ఉన్నతాధికారులు మిన్నకుండిపోయారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కొన్ని ఘటనలు బయటపడగా బాధ్యులపై చర్యలు తీసుకున్నారు. అయినా ఇంకొందరు వెనక్కు తగ్గడంలేదు. ఇలాంటి వారిపై క్రిమినల్ చర్యలకు ఉపక్రమిస్తేనే దారిలోకి వస్తారు.

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వ్యక్తులకే ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇస్తుంది. వైకాపా హయాంలో పలుమార్లు పేదలు తహసీల్దారు కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరిగినా స్థలం మాత్రం మంజూరు చేయలేదు. ఇలాంటి వారి అవసరాన్ని రెవెన్యూ సిబ్బంది, కొందరు దళారులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు.

**ప్రధానంగా ఇళ్ల స్థలాల విషయంలోనే..**

పట్టా ఇవ్వాలంటే తహసీల్దారు సంతకం పెట్టి, సీలు వేసి ఒక నంబరు కేటాయించి రిజిస్టర్‌లో నమోదు చేయాలి. ఇలా నిబంధనలు పాటించకుండానే చిత్తూరు జిల్లాలో చిత్తూరు నగరం, గ్రామీణ, గుడిపాల, కుప్పం, వెదురుకుప్పం తదితర మండలాల్లో తహసీల్దారు సంతకాలు ఫోర్జరీ చేసి కొందరు కేటుగాళ్లు గుట్టుగా పట్టాలు ఇచ్చేశారు. ఇలా చిత్తూరు నగరంలోని ప్రశాంత్‌నగర్, బోడిగుట్టలో వందలాదిగా దొంగ పట్టాలు సృష్టించారు. వీటికి సీళ్లు వేయించడంలో సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇందుకు రూ.10- 30వేలు వసూలు చేస్తున్నారు. తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లు మండలంలో ఇటువంటి ఉదంతాలు బయటపడ్డాయి.

**భూమి లేకుండానే పాస్‌పుస్తకాలు**

సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో వ్యవసాయ భూమి లేకుండానే అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ పట్టాదారు పాస్ పుస్తకాలు పుట్టించారు. ఇందులో బయటి వ్యక్తుల ప్రమేయం ఉంది. దీనిపై పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు.

**నకిలీ పట్టా ఎలా గుర్తించాలంటే!**

లబ్ధిదారుడికి ఇంటి పట్టా ఇస్తే దానికి ఓ నంబరు కేటాయిస్తారు. రెవెన్యూ యంత్రాంగం కాకుండా ఎవరైనా ఇలా మంజూరు చేస్తే తొలుత తహసీల్దారు కార్యాలయానికి వెళ్లాలి. గ్రామీణ ప్రాంతంలో ఇచ్చిన పట్టా నకిలీనా? అసలైనదేనా? అని సంబంధిత తహసీల్దారు 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' వెబ్‌సైట్‌లోకి వెళ్లి.. ఆ పట్టా నంబరు నమోదు చేస్తారు. వివరాలన్నీ సరిపోలితే అది నిజమైన పట్టా. వేరే వ్యక్తుల పేరు లేదా అసలు ఆ నెంబరే లేకుండా నకిలీది అని గుర్తించాలి. పట్టణాల్లోనైతే సంబంధిత మున్సిపల్ అధికారులు ఇలానే పరిశీలించి వివరాలు చెబుతారు. వ్యవసాయ భూములైతే సామాన్య పౌరుడే నేరుగా 'మీ భూమి' పోర్టల్‌లోకి వెళ్లి పరిశీలించే సౌలభ్యం ఉంది.

**చిత్తూరు ఘటన మరవక ముందే..**

దాదాపు రెండున్నరేళ్ల కిందట చిత్తూరు నగరంలోని కట్టమంచితోపాటు మరో ఆరు స్థలాలకు సంబంధించిన యజమానుల సంతకాలను ఏడుగురు సభ్యుల ముఠాల ఫోర్జరీ చేసింది. ముగ్గురు వీఆర్వోలతోపాటు ఓ తహసీల్దారు, సబ్ రిజిస్ట్రార్ పాత్ర కూడా ఉంది. దాదాపు రూ.50 కోట్ల విలువైన భూములు హస్తగతం కావడంలో రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ అధికారులు యథేచ్ఛగా సహకరించారు. స్థలాలను తాకట్టు పెట్టి బ్యాంకు రుణాలు సైతం పొందడం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ వ్యవహారంలో తహసీల్దారు, సబ్ రిజిస్ట్రార్, వీఆర్వోలనూ అరెస్టు చేశారు.

గుడిపాల మండలంలో మరణించిన ఓ తహసీల్దారు సంతకంతో వైకాపా హయాంలో భారీగా ఇంటి పట్టాలు పుట్టించారు. ఇష్టారాజ్యంగా స్థలాలు ఇచ్చేశారు. నాటి తహసీల్దారు అండదండలతో స్థానిక రెవెన్యూ సిబ్బంది సంతకాలు పెట్టేశారు.

చిత్తూరు నగరం తిమ్మసముద్రంలో గ్రామకంఠానికి చెందిన 17 సెంట్ల భూమికి అనుభవ పత్రం పొందేందుకు ఓ వీఆర్ఏ ఏకంగా అర్బన్ తహసీల్దారు కళావతి సంతకాన్ని ఫోర్జరీ చేశారు. తహసీల్దారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ప్రస్తుతం తాలుకా స్టేషన్‌లో విచారణ జరుగుతోంది. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేటలో సర్వే నంబరు 329లో వైకాపా హయాంలో ఆ పార్టీకి చెందిన స్థానిక, మండల నాయకులు పదుల సంఖ్యలో దొంగ పట్టాలు సృష్టించారు. ఒక్కో స్థలాన్ని రూ.2 - 4 లక్షల చొప్పున విక్రయించారు. యర్రావారిపాళెం, పులిచెర్ల మండలాలకు చెందిన వ్యక్తులకు సైతం పట్టాలిచ్చిన ఘనత వైకాపా నాయకులదే. స్థానిక రెవెన్యూ సిబ్బంది పరోక్ష సహకారం అందించారు.

## స్వచ్ఛ గోదావరి.. సాకారమవుతున్న కల



రాజమహేంద్రవరం : గోదావరి కాలుష్య నివారణలో భాగంగా రాజమహేంద్రవరంలోని ఆవ ప్రాంతంలో 50 ఎంఎల్‌డీ మురుగు నీటి శుద్ధీకరణ(ఎస్‌టీ) ప్లాంటు నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. నదీ కాలుష్యాన్ని అరికట్టేందుకు మురుగు నీటిని శుద్ధి చేసి తిరిగి గోదావరిలో కలిపే ప్రక్రియలో భాగంగా ప్లాంటు పనులు చేపట్టారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు సంబంధించి తొలి దశ పనులు పూర్తయ్యాయి. కొద్ది రోజుల క్రితం కలెక్టర్ ప్లాంట్ నిర్మాణ పనులు పరిశీలించారు. మురుగు నీటి శుద్ధీకరణ ప్లాంటుకు కీలకంగా మారిన బేస్‌మెంట్ ప్రక్రియ పూర్తికావడంతో సంపు నిర్మాణాలు ప్రారంభించారు. ప్రాజెక్టులో వీటి నిర్మాణమే కీలకం. మురుగు నీటిని వివిధ దశల్లో శుద్ధిచేసే క్రమంలో సంపు ద్వారా పంపింగ్ చేస్తారు. అందుకోసం భారీ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. నీటిని శుద్ధీకరణ చేసే రసాయనిక ప్రక్రియ సంపుల్లోనే జరుగుతుంది. దీంతో ఈ పనులకు ప్రాధాన్యమిచ్చారు. నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గర్గ్ పనులు పర్యవేక్షిస్తున్నారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. త్వరలో ప్లాంట్ అందుబాటులోకి వస్తే నదిలో నీటి కాలుష్యం తగ్గేందుకు ఆస్కారం ఉంటుంది.

**అవసరాలకు అనుగుణంగా..**


ఎస్‌టీపీ ద్వారా శుద్ధి చేసిన నీటిని ఇతర అవసరాలకు వినియోగించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు ప్లాంటులో శుద్ధి చేసిన నీటిని ఓఎన్‌జీసీ, రైల్వే, పరిశ్రమలకు విక్రయించేందుకు ప్రణాళికలు రూపొందించారు. వాస్తవానికి నగరంలో ప్రతీ రోజు 65 ఎంఎల్‌డీ మురుగు విడుదల అవుతుంది. తిరిగి ఆ నీటిని శుద్ధి చేసి నదిలో కలపడం కంటే ఏకంగా విక్రయించడం ద్వారా కాలుష్య ప్రభావం మరింత తగ్గేందుకు ఆస్కారం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే ఆ కంపెనీలతో ఒప్పందం చేసుకున్నట్లు తెలుస్తోంది.

**ఇదీ ప్రణాళిక**

నమామి గోదావరి ప్రాజెక్టులో తొలి విడత నిధులతో పనులు చేపట్టారు. ఆవ ప్రాంతంలో ఏడు ఎకరాల్లో 50.6 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన మురుగునీటి శుద్ధీకరణ ప్లాంటు నిర్మాణం జరుగుతోంది. ఈ ఏడాదే ప్లాంటు అందుబాటులోకి రానుందని అంచనా వేస్తున్నారు. ప్లాంటుకు అనుబంధంగా పక్కనే అయిదు ఎంఎల్‌డీ ప్లాంటు కూడా సిద్ధమవుతోంది. ముందుగా నగరపాలక సంస్థ నిధులతో ఈ ప్లాంటు పనులు చేపట్టారు. పాత ప్లాంటులో 30 ఎంఎల్‌డీ నీటిని శుద్ధి చేయగల సామర్థ్యం ఉంది. ప్రస్తుతం మరమ్మతులకు గురైన దీన్ని కూడా వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు.

## డీమార్ట్‌లో కాలం చెల్లిన మాజా ప్యాకెట్ల విక్రయం

రాజమహేంద్రవరం : రాజమహేంద్రవరంలోని హుకుంపేట దరి డీమార్ట్ స్టోర్‌లో కాలం చెల్లిన ఆహార ఉత్పత్తులు విక్రయిస్తున్నారంటూ పలువురు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేశారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితులు, పోలీసులు వివరాల మేరకు.. హుకుంపేటకు చెందిన నీతిపూడి కిరణ్ కుమార్ డీమార్ట్ స్టోర్‌లో ఒక్కోటి రూ.10 విలువచేసే మాజా టెట్రా 40 ప్యాకెట్లను కొనుగోలు చేశారు. 32 ప్యాకెట్లను ఇంట్లో పది మంది పిల్లలతోపాటు పలువురు పెద్దలు తాగారు. ఈ నెల ఎనిమిదో తేదీతోనే వాటి గడువు ముగిసిపోయిన విషయాన్ని గంట అనంతరం గుర్తించిన కిరణ్ అతడి స్నేహితులు స్టోర్ వద్దకు వెళ్లి మేనేజర్‌ను ప్రశ్నించారు. తమ వద్ద ఆ స్టాక్ లేదని, ప్రతి వెయ్యిలో ఓసారి ఇలా జరుగుతుంటుందని ఆయన చెప్పుకొచ్చారు. వాగ్వాదం జరుగుతున్న సమయంలో స్టోర్‌లో ఉన్న మాజా ప్యాకెట్ల నిల్వలను మార్చేశారని బాధితులు ఆరోపించారు. డ్రింక్ తాగిన పదిమంది చిన్నారుల్లో ఆరుగురికి స్వల్పంగా పెదాల తిమిర్లు, వికారం వంటివి వచ్చాయి. మరో ఇద్దరు పిల్లలకు విరోచనాలు, వాంతులు రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. దీంతో కాలనీవాసులు డీమార్ట్ స్టోర్ వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు స్టోర్ మేనేజర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి పరిస్థితిని చక్కదిద్దే



ప్రయత్నం చేశారు. ఆహార భద్రత ఇన్‌స్పెక్టర్లు రెండు గంటల పాటు తనిఖీలు చేపట్టారు. దీనిపై బొమ్మూరు సీఐ కాశీ విశ్వనాథాన్ని వివరణ కోరగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఆహార భద్రత ప్రమాణాల విభాగం కాకినాడ సహాయ నియంత్రకుడు బి.శ్రీనివాస్‌ను వివరణ కోరగా స్టోర్ తనిఖీల్లో ఎటువంటి లోపాలు కనిపించలేదన్నారు. బాధితులు తమను వెంటనే సంప్రదిస్తే తనిఖీలు చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. బాధితులు తమను కాకుండా ముందుగా స్టోర్ మేనేజర్‌ను కలిశారని, ఆ తరుణంలో వారిని మాటల్లో ఉంచి లోపల కాలం చెల్లిన వస్తువులను తరలించేయడంతో నిర్వాహకులను హెచ్చరించి వెనుదిరిగినట్లు చెప్పారు.

## రైతు గుండె ఘోష.. స్పందిస్తే డెల్టాకు శ్వాస

పి.గన్నవరం : గోదావరి డెల్టా ఆధునికీకరణ పనులు చేపట్టి దశాబ్దిన్నర గడిచింది. క్రమేణా కాలువల నిర్వహణ వదిలేయడంతో పూడిక పెరిగి ప్రవాహం వేగంగా సాగని దుస్థితి. గతంలో వేసవిలో కాలువలు కట్టేసి తిరిగి తెరిచే వ్యవధిలో పూడికతీత, లాకులు, ఇతర కట్టడాల తలుపుల మరమ్మతులు, మురుగు కాలువలు బాగుచేసేవారు. కొన్నాళ్లుగా ఖరీఫ్, రబీ సీజన్లలో గుర్రపుడెక్క, తూడు తొలగింపు తప్ప ఇతర నిర్వహణ పనులు లేవు. వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కూటమి వచ్చాక సాగునీటిసంఘాల వ్యవస్థను పునరుద్ధరించిన నేపథ్యంలో వనరుల నిర్వహణ, ఆధునికీకరణ పనులు చేపట్టాల్సిన అవసరం ఉంది.

**డొక్కా సీతమ్మ అక్విడక్టు.. ఆ వైభవం తెస్తేనే**

పి.గన్నవరం వద్ద వైనతేయ గోదావరి నదీపాయపై ఉన్న డొక్కా సీతమ్మ అక్విడక్టు- రోడ్డు వంతెనపై రాజోలు దీవిలో 40 వేల ఎకరాల



ఆయకట్టు ఉంది. తాగునీటి పథకాలకు దీనిద్వారానే ముడినీరు(రా వాటర్) చేరుతుంది. అక్విడక్టు నిర్వహణకు వార్షిక బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి. విద్యుత్తు దీపాలూ అవసరం.

**కాలువగట్టు బలహీనం.. సాగునీరు వృథా**

పి.గన్నవరం నుంచి అంబాజీపేట మండలం పోతాయిలంక వరకు 6 కి.మీ మేర పంటకాలువ ఇది. 2007లో గోదావరి డెల్టా ఆధునికీకరణలో దీనికి ప్రాధాన్యం ఇచ్చి మూడు కిలోమీటర్ల మేర కాలువకు కాంక్రీటు లైనింగ్ ఏర్పాటుచేశారు. మిగిలిన 3 కి.మీ. కాలువ ఇరువైపులా బలహీనపడటంతో సాగునీరు వృథాగా పోతుంది. బాగుచేసేందుకు రూ.50లక్షల పైబడి నిధులు కావాలి.

**ఆరేళ్లుగా 200 ఎకరాల్లో పంట విరామం**

ఇది ఐ.పోలవరం మండలం కేశనకుర్రులోని పెరుమాళ్లరాజు ప్రధాన కాలువ. వెయ్యి ఎకరాల విస్తీర్ణంలోని వరి చేలకు సంబంధించి ఖరీఫ్‌లో ముంపునీరు గోదావరిలో కలవాలి. నిర్వహణ పనులు లేక ఖరీఫ్‌లో రైతులు ముంపు సమస్యను ఎదుర్కొంటున్నారు. 200 ఎకరాల్లో ఆరేళ్లుగా వరి వేయలేదు. ఆక్వాచెరువుల్లోని వ్యర్థాలను కాలువలోకి వదిలేయడం మరో సమస్య.

**పూర్తయితే 1.70 లక్షల ఎకరాలకు ఆసరా**

గోదావరి మధ్య డెల్టా అయిన కోనసీమలోని సుమారు 1.70 లక్షల ఎకరాలకు సాగునీరు సరఫరా చేసే ప్రధాన లాకులు ఇవి. ర్యాలి ప్రధాన లాకులుగా వ్యవహరించే ఇవి శిథిలమై పదేళ్లవుతుంది. నూతనంగా నిర్మించాలి. రూ.78కోట్లతో జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారులు సవివర నివేదిక (డీపీఆర్) తయారుచేసి ప్రభుత్వానికి పంపారు. మంజూరైతే ఈ వేసవిలో పనులు చేపట్టొచ్చు. ఈ దిశగా ఎంపీ, శాసనసభ్యులు సమష్టిగా కృషిచేయాల్సి ఉంది.

**అత్యవసర పనులు చేపట్టేలా కార్యాచరణ**

వైకాపా ప్రభుత్వం సాగునీటి వ్యవస్థను నాశనం చేసిందని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. రానున్న వేసవిలో అత్యవసర పనులు చేసేలా కార్యాచరణ చేస్తున్నామన్నారు. జలవనరులశాఖ (ధవళేశ్వరం) అధికారులు స్పందిస్తు ఉమ్మడి జిల్లాలో నాబార్డు నిధులు రూ.250 కోట్లతో పంట, మురుగు కాలువలతోపాటు, వివిధ కట్టడాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించామన్నారు.

## సర్కారు బడి.. సౌకర్యాల సందడి!

కాకినాడ : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రయోగశాలల పునరుద్ధరణ, సైన్స్ ల్యాబ్‌లు, నూతన గ్రంథాలయాలు, క్రీడా కోర్టుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం దన్నుగా నిలుస్తోంది. పీఎంశ్రీ పథకం ద్వారా పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తోంది. తొలి విడతలో కాకినాడ జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ పాఠశాలలకు నిధులివ్వగా అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో ర్యాంపులు, కిచెన్ గార్డెన్లు, ఇంకుడుగుంతలకు నిధులు ఇవ్వనున్నారు. దశలవారీగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ పీఎంశ్రీ పథకం ద్వారా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సంకల్పించారు. తాజాగా రెండో విడతలో అయిదు పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లు, ప్రయోగశాలలు, క్రీడా



కోర్టుల ఏర్పాటుకు రూ.3 కోట్లు మంజూరయ్యాయి. పాఠశాలల కమిటీల ద్వారా ఈ పనులు చేపట్టాలని నిర్ణయించారు. టెండర్ల ప్రక్రియ దాదాపు పూర్తికావచ్చింది. ఒప్పందాలు చేసుకుంటున్నారు. పాఠశాలల కమిటీ పర్యవేక్షణలో సమగ్ర శిక్షా అభియాన్ ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షణలో నాణ్యంగా పనులు పూర్తి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

**ఎక్కడెక్కడంటే..**

పీఎంశ్రీ రెండో విడత కింద కాకినాడ నగరంలోని గాంధీనగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, షటిల్, వాలీబాల్, కబడ్డీ కోర్టులు ఏర్పాటు చేయనున్నారు. కాకినాడ గ్రామీణంలోని ఏపీఎస్‌పీ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ప్రయోగశాలలు, సైన్స్ ల్యాబ్, గ్రంథాలయ గదులు నిర్మించనున్నారు. పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, ప్రయోగశాలలు ఏర్పాటు చేస్తారు. పిఠాపురంలోని జగ్గయ్యచెరువులోని ఉన్నత పాఠశాలలో బయాలజీ, కెమిస్ట్రీ ప్రయోగశాలలు, ప్రత్తిపాడు నియోజకవర్గంలోని రౌతులపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్, సైన్స్‌ల్యాబ్ నిర్మించనున్నారు. పాఠశాలలు తిరిగి తెరిచేనాటికి పూర్తి..- వెంకటరాజు, ఈఈ, సమగ్రశిక్షా విభాగం పీఎంశ్రీ యోజనలో రెండో విడితలో నిధులు మంజూరైన పాఠశాలల్లో వివిధ నిర్మాణ పనులను జూన్‌లో వచ్చే విద్యాసంవత్సరానికి పాఠశాలలు తెరిచే నాటికి పూర్తి చేస్తాం. వాటన్నింటినీ విద్యార్థులకు అందుబాటులోకి తెస్తాం. ఈ నిధులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ దాదాపు పూర్తయ్యింది. త్వరలో పనులు ప్రారంభించి పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో పూర్తి చేస్తాం.

చురకలు



# అక్రమ లేవుట్లకు అంతేలేదు!

తాడిపత్రి : తాడిపత్రిలో అక్రమ లేవుట్లకు అంతేలేకుండా పోతోంది. గత ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎక్కడపడితే అక్కడే లేవుట్లు వేశారు. ఇప్పుడు యథేచ్ఛగా క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. పచ్చని పొలాలను సైతం లేఅవుట్లుగా మార్చి నంబరు రాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినా ఏమాత్రం మార్పు కనిపించడం లేదు.

తాడిపత్రి పట్టణ చుట్టు పక్కల భారీగా కొందరు రియల్టర్లు యథేచ్ఛగా అక్రమంగా లేఅవుట్లు వేశారు. సుమారుగా 150 వరకు లేఅవుట్లు ఉండగా వాటిల్లో 4 వాటికి మాత్రమే అనుమతులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ భూమిని వ్యాపార పరంగా మార్చేందుకు ప్రభుత్వానికి చలానా చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఆర్డీవో నుంచి అనుమతులు వచ్చాక అహుడా నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంది. అనంతరం పంచాయతీకి ఎకరాకు 10 సెంట్ల భూమిని



వదులుతూ 40 అడుగుల ప్రధాన రహదారి, 33 అడుగులతో వీధి దారులు వదిలి లేఅవుట్లు వేయాల్సి ఉంటుంది. ఇవేవీ పాటించకుండా లేఅవుట్లు వేసి ప్రజలకు విక్రయిస్తున్నారు. ప్రధానంగా తాడిపత్రి గ్రామీణ పరిధిలోని గన్నెవారిపల్లి పంచాయితీ, చిన్నపొలమడ, సజ్జలదిన్నె, రావివెంకటాంపల్లి, యర్రగుంటపల్లి, ఆలోనగర్, యల్లనూరు రోడ్డు, అనంతపురం రోడ్డులో పలు చోట్ల వందల ఎకరాల్లో అక్రమ లేఅవుట్లు వెలిశాయి. వీటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని అధికారులు కోరారు.

**నిబంధనలు పాటించకపోతే చర్యలు-వెంకటేశ్, ఈవోఆర్డీ**

ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా అక్రమంగా లేఅవుట్లు వేసిన వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. వీటిపై నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతాం. అనుమతులు పొంది నిబంధనలు పాటించని వాటి గురించి ఆరా తీస్తాం.

# ఎట్టకేలకు పురం ఛైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్

హిందూపురం : ఎట్టకేలకు 5 నెలల తరువాత హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ పదవికి ఎన్నిక నిర్వహించడానికి రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ సోమవారం జారీ చేసింది. ఫిబ్రవరి 3న ఉదయం 11 గంటలకు ఎన్నిక జరపాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించింది. ఎన్నిక నిర్వహణకు ప్రత్యేక అధికారిని నియమించి, మున్సిపల్ కౌన్సిలర్లకు ఈ నెల 30వ తేదీలోపు సమాచారాన్ని ఇవ్వాలని సూచించింది. దీంతో ఎన్నిక నిర్వహణకు మున్సిపల్ అధికారులు సిద్ధమవుతున్నారు. మున్సిపల్ ఎన్నికలు 2021లో ఏకపక్షంగా జరగడం, తెదేపా పోటీలో లేకపోవడంతో మున్సిపాల్టీలోని 38 స్థానాలకు గాను వైకాపా 30, తెదేపా 6, భాజపా, ఎంఐఎం పార్టీలు చేరో ఒక్కోటి గెలుపొందాయి. ఛైర్‌పర్సన్‌గా ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని వాల్మీకి కులానికి చెందిన ఇంద్రజను పార్టీ ఎంపిక




చేసినా, ఆమె సొంతంగా పాలన చేయనివ్వకుండా వైకాపా నాయకులు అధికారాన్ని చెలాయించారు. 9 నెలల క్రితం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మున్సిపాల్టీలో మార్పులు శరవేగంగా జరిగిపోయాయి. సొంత పార్టీపై అసంతృప్తిగా ఉన్న ఛైర్‌పర్సన్‌తో పాటు 12 మంది వైకాపా కౌన్సిలర్లు, ఎంఐఎం కౌన్సిలర్ తెదేపాలో చేరారు. తెదేపాతో కుదిరిన ఒప్పందం మేరకు ఛైర్‌పర్సన్ గత ఏడాది ఆగస్టులో పదవికి రాజీనామా చేశారు. ఆమె స్థానంలో తెదేపాకు చెందిన కౌన్సిలర్ డి.ఇ.రమేష్‌ను ఛైర్మన్ చేయాలని ఎమ్మెల్యే బాలకృష్ణ నిర్ణయించారు. అయితే ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయకపోవ డంతో, పాలనను కొనసాగించడానికి పురపాలకశాఖ వైస్ ఛైర్మన్ బలరామిరెడ్డిని తాత్కాలిక ఛైర్మన్‌గా నియమించింది. వైకాపా ఎన్నికను సీరియస్‌గా తీసుకోవడం లేదు. దీంతో రమేష్ ఎన్నిక లాంఛనమే అని తెలుస్తోంది.

# సిబ్బంది చేతివాటం.. ప్రైవేటు బ్యాంకులో రూ. 2.80 కోట్లు స్వాహా

పలమనేరు : పుంగనూరులో కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్ బ్యాంకులో పనిచేసే సిబ్బంది నకిలీ బంగారం, పత్రాలు సృష్టించి రూ.2.80 కోట్లు స్వాహా చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. విజయవాడ కేంద్ర కార్యాలయం ఆడిటర్లు గత వారం ఈ బ్యాంకు తనిఖీ చేయగా రూ.కోట్లు కాజేసినట్లు గుర్తించి సూత్రదారులపై విజయవాడ రిజినల్ మేనేజర్ కిషోర్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సీఐ శ్రీనివాసులు మాట్లాడుతూ.. పుంగనూరు, పలమనేరు పట్టణాల్లో కనకదుర్గా గోల్డులోన్ కంపెనీ పేరిట బ్రాంచిలున్నాయి. ఇందులో గ్రాము బంగారం కుదువ పెడితే దాని విలువకు 70 శాతం పైగా రుణం ఇస్తుండేవా రు. అలా బ్యాంకులో నగలు తాకట్టు పెట్టిన ఖాతాదారుల సంతకాలు, పత్రాలు, చిరునామాలతో నకిలీ పత్రాలు సృష్టించి నకిలీ బంగారాన్ని తీసుకొచ్చి వారిపేరుతో తాకట్టుపెట్టి నగదు కాజేశారు. అందరూ బ్యాంకు సిబ్బందే కావడంతో గుట్టుగా కొనసాగింది. డిసెంబర్‌లో జరిగిన ఆడిట్‌లో గుట్టురట్టం ది. ఈ మేరకు పుంగనూరు బ్రాంచ్‌లో పనిచేస్తున్న మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏరియా మేనేజర్ నరసింహులు, ఆడిటర్ రామాంజునేయు లు, బ్రాంచ్ మేనేజర్ ఖాజాఫీర్, సహాయ మేనేజర్ శ్రావణ్‌కు మార్, క్యాషియర్ జగదీష్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పేర్కొన్నారు.

# అధికారుల భక్తి.. వైకాపా నేత భుక్తి



అనంతపురం : పౌరసరఫరాలశాఖ అధికారులు గుంతకల్లుకు చెందిన వైకాపా నాయకుడికి అప్పనంగా ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారు. గత ప్రభుత్వంలో నిబంధనలకు విరుద్ధంగా సదరు నాయకుడి బంధువులకు చెందిన ప్రైవేట్ గోదాముకు రేషన్‌బియ్యం నిల్వ చేసే కాంట్రాక్టును కట్టబెట్టిన అధికారులు.. కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ బియ్యం, ఇతర పీడీఎస్ సరకుల నిల్వను రాష్ట్ర గిడ్డంగుల సంస్థకే అప్పగించాలని రాష్ట్ర ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా అనంతపురం జిల్లా అధికారులు వాటిని అమలు చేయడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా వైకాపా నేత బంధువులకు చెందిన ప్రైవేట్ గోదాములోనే నిల్వలు ఉంచుతున్నారు.

**నెలకు రూ.17 లక్షల అద్దె**

గతంలో రేషన్ బియ్యాన్ని ఎఫ్‌సీఐ, లేదా గిడ్డంగుల సంస్థ గోదాముల్లో నిల్వ చేసేవారు. వైకాపా ప్రభుత్వం 2021లో ప్రైవేట్ గోదాములను అద్దెకు తీసుకుని బియ్యం నిల్వ చేయడం మొదలుపెట్టింది. బస్తాకు రూ.4.25 అద్దె చెల్లిస్తున్నారు. పర్యవేక్షణ ఛార్జీల కింద మరో 7 శాతం చెల్లిస్తున్నారు. అనంతపురం జిల్లాకు సంబంధించి అప్పటి గుంతకల్లు ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి బంధువులకు చెందిన ప్రైవేట్ గోదాముతో ఒప్పందం కుదుర్చుకున్నారు. 21 వేల టన్నులు నిల్వ చేస్తామనే ప్రాతిపాదికన సదరు గోదామును అద్దెకు తీసుకున్నారు. ఇందుకు గాను ప్రతినెలా రూ.17.50 లక్షల అద్దె చెల్లిస్తున్నారు. ప్రస్తుతం 6 వేల టన్నులకు మించి నిల్వ ఉంచడం లేదని అధికారులే చెబుతున్నాయి. అయినా ఒప్పందం మేరకు 21 వేల టన్నులకు అద్దె చెల్లిస్తున్నారు. ఇప్పటివరకు సదరు గోదాము నిర్వాహకులకు రూ.6 కోట్లకు పైగా అద్దె రూపంలో కట్టబెట్టారు.

**ఎఫ్‌సీఐ ఉన్నా ప్రైవేట్‌కే..**

2021 సెప్టెంబరు వరకు గుంతకల్లులో ఎఫ్‌సీఐ గోదాములోనే రేషన్ బియ్యాన్ని నిల్వ చేసేవారు. అయితే ఎఫ్‌సీఐని కాదని అదే ఏడాది అక్టోబరు నుంచి ప్రైవేట్ గోదాముతో ఒప్పందం చేసుకున్నారు. తిమ్మనచర్ల రైల్వేస్టేషన్‌కు ఆనుకుని ఎఫ్‌సీఐ ఉండటంతో వేగన్లు నేరుగా గోదాములోకి వెళ్లి సరకు దించేవి. ఎమ్మెల్యే బంధువులకు చెందిన గోదాము ఇక్కడికి 4 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఫలితంగా రవాణా ఛార్జీలు అదనపు భారంగా మారాయి.

**అక్రమ రవాణాకు అడ్డాగా..**

బియ్యం నిల్వకు ప్రైవేట్ గోదాములను ఎంచుకున్నప్పటి నుంచి అక్రమ రవాణా ఎక్కువైంది. కాకినాడ, డోన్ ప్రాంతాల్లోని ప్రైవేట్ గోదాముల్లో రేషన్‌బియ్యం మాయం కావడమే ఇందుకు నిదర్శనం. గుంతకల్లులోనూ ఇదే తరహా అక్రమాలు జరిగాయనే ఆరోపణలున్నాయి. కానీ, పౌరసరఫరాలోని కొందరు ఉన్నతాధికారులు దీనిపై సమాధానం చెప్పడం లేదు. అంతా సవ్యంగానే ఉందని సమాధానమిస్తున్నారు. బియ్యం మాయం కావడంపై జేసీ శివనారాయణశర్మ వివరణ కోరగా వెంటనే విచారించి లెక్కలు తేలుస్తామని తెలిపారు.

# సురేశ్ కట్టా.. సేవకు పెద్ద పీట



హిందూపురం : "ఏ దేశ మేగినా.. ఎందుకాలిడినా.. ఏ పీఠ మెక్కినా.. ఎవరేమనినా.. పొగడరా నీ తల్లి భూమి భారతిని.. నిలపరా నీ జాతి నిండు గౌరవము" అంటూ సుప్రసిద్ధ కవి రాయప్రోలు సుబ్బారావు దేశభక్తి గేయాన్ని రచన చేశారు. దీనిని అక్షరాల నిజం చేసి సార్థకత కల్పించారు హిందూపురం నివాసి సురేశ్ కట్టా. హిందూపురంలోని వాసవీ ధర్మశాల రోడ్డులో నివాసముంటున్న కేఎన్.నంజుండయ్య, సరోజమ్మల కుమారుడు సురేశ్. గడ్డమీద ఉన్న నేతాజీ పాఠశాలలో 10వ తరగతి చదివార్న. బెంగళూరులోని ఆర్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఆ తర్వాత అమెరికాలో యూన్సివర్సిటీ ఆఫ్ లూసియానాలో ఆయన చేసిన ఎంఎస్ థీసిస్ మైక్రోచిప్ సామర్థ్యాన్ని పెంచుకున్నారు. అదే సిలికాన్ వ్యాలీ ప్రొఫెషనల్ ప్రయాణానికి మార్గం ఏర్పరిచింది. భార్య రాధ గృహిణి. ఇద్దరు కుమారులు సాహన్, సంకేత్. వీరిద్దరూ ఆటోమెటీవ్ పరిశ్రమలు నిర్వహిస్తున్నారు.

**ఆలోచనకు అంకురార్పణ ఇలా..**

సమాజానికి సేవలందించాలని నాలుగు వేదాల్లోని ఒకటైన సామవేదం పేరు వచ్చేలా "సామా" అనే సాంకేతిక సంస్థను అమెరికాలో 1997లో ఏర్పాటు చేశారు. డేటాను విశ్లేషణాత్మక, అనుభూతిగా మార్చడమే సంస్థ లక్ష్యం. ప్రస్తుతం ఈ సంస్థ ద్వారా ఏడు దేశాలలో 2వేల మంది ప్రతిభావంతుల బృందం పనిచేస్తోంది. వీరిలో 60శాతం భారతీయులే ఉన్నారు. ఎంఐటీ, ఏడీటీ యూనివర్సిటీ, డీవై పాటిల్ యూనివర్సిటీలు ఇతని మానవతా సేవలకు డాక్టర్‌రేట్ను ప్రదానం చేశాయి.

**అందించిన సాయం**

తాను విద్యనభ్యసించిన మున్సిపల్ నేతాజీ ఉన్నత పాఠశాల శిథిలావస్థలో ఉన్నందున పెద్ద మొత్తంలో విరాళాలు ఇవ్వడంతో నూతన గదులు నిర్మాణమయ్యాయి.

పట్టణంలోని ప్రధానరోడ్డులో ఉన్న సరస్వతి విద్యామందిరంలో నూతన గదుల నిర్మాణానికి విరాళాలు ఇచ్చారు.

రైల్వేరోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న ఆర్యవైశ్య మారుతీ యోగ ధ్యాన కేంద్రానికి గత డిసెంబరు 23న సురేశ్ విరాళం ఇచ్చారు.

తాను ఇంజినీరింగ్ చదివిన బెంగుళూరులోని ఆర్వీ సాంకేతిక విశ్వవిద్యాలయం అభివృద్ధి కోసం రూ.10కోట్లు మూడునెలల క్రితం అందజేశారు.

**ప్రావీణ్య విద్యార్థులకు సాయం చేస్తా- సురేశ్‌కట్టా, సామా సంస్థ ఛైర్మన్**

పుట్టిన స్థలానికి ఏదో ఒక విధంగా సహాయం చేయాలన్న ఉద్దేశంతో హిందూపురంలోనే ఉన్న మా చిన్నాన్నలు కె.ఎ.బదిరీనారాయణ, కె.ఎ.రాధాకృష్ణ సలహాలతో కొన్నేళ్ల నుంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నా. ఆర్యవైశ్య నిరుపేదలు చదువుల్లో ఉత్తమ ప్రతిభ సాధించి ఉన్నతచదువులు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నవారికి ఆర్థిక సహాయం అందించా. సాంకేతిక రంగంలో ప్రావీణ్యం కలిగిన విద్యార్థులు ఉద్యోగం దొరకక ఇబ్బంది పడుతుంటే వారి వివరాలు నా దృష్టికి తీసుకొస్తే ఉద్యోగం ఇస్తాం.

# అక్రమాలకే ఉపాధి



పలమనేరు : గ్రామాల్లో అక్రమాలకు ఉపాధి పనులు అండగా నిలుస్తున్నాయి. ప్రతి గ్రామంలో కూలీలతో కుమ్మక్కై మోసాలకు పలువురు పాల్పడుతున్నారు. వైకాపా హయాంలో సామాజిక తనిఖీలు మొక్కుబడిగా నిర్వహించి అధికారులు చేతులు దులుపుకొన్నారు. గత ఏడాది మొత్తం ఎనిమిదిమంది క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి రూ.40 వేల వరకు రికవరీ చేస్తున్నట్లు నోటీసులు జారీచేసి మమ అనిపించారు. రూ.కోట్లలో పనులు చేపడితే రూ.వేలల్లో రికవరీ చేయడంపై సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. యంత్రాలతోనే కాకుండా కూలీలతో పనిలేకుండా చెరువులో పూడిక తీత పనులు చేపట్టారు. ఫారం పాండ్లు, పొలాలకు మట్టి, క్యాటిల్‌షెడ్లు, మొక్కలు నాటడం వంటి పనుల పేరిట రూ.కోట్లలో స్వాహా చేశారు.

**చేయని పనికీ..**

జాబ్‌కార్డులు ఉన్న వారితో కాకుండా జేసీబీలతో తవ్వించి కూలీలతో వాటిని పైపై మెరుగులు చెక్కించి బిల్లులు బొక్కేశారు. నియోజకవర్గ పరిధిలో ఇప్పటి వరకు ఏడాదిలో దాదాపు రూ.4 కోట్ల వరకు పనులు చేపట్టారు. బిల్లులు పెట్టి కూలీల పేరుతో వచ్చే బిల్లులు వీరే తీసుకుని వారికి కొంత మొత్తం ఇచ్చేవారు. చేయని పనికి తమకు కొంత మేర సొమ్ము అందుతుండటంతో కూలీలు కూడా వీరికి సహకరిస్తుంటారు.

**బినామీ కూలీలతో..**

హార్టికల్చర్ విభాగానికి సంబంధించి గతంలో నాటిన మొక్కలకు కూడా బిల్లులు చేసేస్తున్నారు. కొన్ని చోట్ల మట్టి తవ్వకాలు బినామీ కూలీలతో, యంత్రాలతో చేసి తమ వద్ద ఉన్న అసలు కూలీల జాబ్‌కార్డులను జతచేసి బిల్లులు స్వాహా చేస్తున్నారు. అధికారులు, సిబ్బంది సహకారంతో వి.కోట, పలమనేరు, గంగవరం మండలాల్లో ఎక్కువ అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులున్నాయి.

**బిల్లులు బొక్కేశారిలా..**

కొందరు అక్రమార్కులు చెరువుల పైభాగంలో తొవ్విన మట్టి విక్రయించి సొమ్ము చేసుకోవడమే కాకుండా.. తవ్విన గుంతలకు ఉపాధిలో బిల్లులు పెట్టుకుంటున్నారు. ఆ మట్టి కింద పొరల్లో ఇసుకనూ అమ్ముకుంటున్నారు. ఇక అడుగు భాగంలో ఉండే బంకమట్టినీ ఇసుకల పరిశ్రమలకు తరలిస్తున్నారు. అప్పుడు మళ్లీ గుంతలకు ఉపాధి బిల్లులు పెట్టుకుంటున్నారు. ఈ అక్రమాలు నిలువరించాలంటే ప్రస్తుత ప్రభుత్వం సామాజిక తనిఖీలను కచ్చితంగా చేపట్టాల్సిన అవసరం ఉంది. కాగా ఉపాధిలో అక్రమాలకు పాల్పడితే క్షేత్రస్థాయి సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని పలమనేరు ఉపాధి ఏపీవో పుష్పలత తెలిపారు. విషయంలో అప్రమత్తంగా చూస్తున్నామని వివరించారు.

# నీరు-చెట్టు బిల్లులకు మోక్షం

చిత్తూరు : నీరు-చెట్టు బిల్లులకు కూటమి ప్రభుత్వంలో మోక్షం కలగనుంది. ప్రతి పైసా చెల్లించాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బిల్లుల అప్‌లోడ్‌కు ఈ నెలాఖరు వరకు గడువు విధించారు. వైకాపా హయాంలో బాధితులకు అండగా ఉండాలనే సంకల్పంతో దృష్టి సారించారు. గత తెదేపా ప్రభుత్వ పాలనలో భారీఎత్తున నీరు-చెట్టు పథకం అమలు చేసింది. జిల్లాలో జల వనరుల సంరక్షణ పాటు కొత్తగా చెక్‌డ్యామ్‌లు, చెరువుల బలోపేతం పనులు రూ.260 కోట్లతో 5,245 పనులు చేపట్టి భూగర్భ జలాల పెంపునకు కృషి చేసింది. పనులు చేపట్టిన వారికి బిల్లులు చెల్లించకుండా అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వేధించింది. విజిలెన్స్ విచారణ పేరిట గుత్తేదారులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరైతే గ్రామాలు వదలివెళ్లిపోయారు. వైకాపా ప్రభుత్వంపై న్యాయపోరాటం చేసి కొందరు బిల్లులు పొందారు. అయినప్పటికీ



రూ.కోట్లలో బిల్లుల చెల్లింపు నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ బిల్లుల్లో కొంత మేర చెల్లించింది. మరో రూ.133.25 కోట్లు పెండింగ్ ఉన్నట్లు అంచనా.

**మంత్రి ఆదేశాలతో...**బాధితులకు నష్టం కలగకుండా ప్రతి పైసా చెల్లించేలా బిల్లులు అప్‌లోడ్ చేయాలనే మంత్రి ఆదేశాలతో వీలైనంత త్వరగా బిల్లులు అప్‌లోడ్ చేసే పనిలో జలవనరుల శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఫిబ్రవరి నెలలో పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించడానికి అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# కారుచౌకగా భూములు మేసేందుకు..

నాయుడుపేట : పంచాయతీ ఆధీనంలోని మేతపోరంబోకు భూములను ఓ ప్రైవేటు కంపెనీకి కారుచౌకగా ఇచ్చేందుకు వైకాపా ప్రభుత్వంలో దస్త్రాలు సిద్ధం చేయగా... ప్రస్తుతం ఆ భూములను పరిశ్రమకు అప్పగించేందుకు స్థానిక నేతలు కొద్ది రోజులుగా సన్నాహాలు చేస్తున్నారు. దీనిపై స్థానికుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఓజిలి మండలం మాచవరం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 207బీలో 56 ఎకరాలు, సర్వే నంబరు 226లో 254.96 ఎకరాల మేత పోరంబోకు భూములున్నాయి. మాచవరం, ముమ్మయపాళెం, కుందాం గ్రామాలతోపాటు మరో నాలుగు గ్రామాలకు చెందిన పశువులు, గొర్రెలు, మేకలు పెంపకందారులకు ఈ భూములు అనుకూలంగా ఉన్నాయి. వీటిపై కన్నేసిన కంపెనీ యాజమాన్యం వైకాపా హయాంలో మాజీ ఎమ్మెల్సీ ద్వారా స్థానిక రెవెన్యూ అధికారులపై ఒత్తిడి చేయించారు. మాచవరానికి చెందిన వైకాపా నాయకులు వీరితో చేతులు కలిపి ఈ రెండు సర్వే నంబర్లలోని 282 ఎకరాల మేత పోరంబోకు భూములను కంపెనీకి నామమాత్రపు ధరకు ఇచ్చేందుకు పంచాయతీ తీర్మానంతో దస్త్రాలు సిద్ధం చేశారు.

**స్థానికుల అభ్యంతరం**

కొన్ని రోజుల కిందట జాయింట్ కలెక్టర్, ఆర్డీవో, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేసే పరిశ్రమ పేలుడు పదార్థాల తయారీకి సంబంధించినది కావడంతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కంపెనీ యాజమాన్యం నేతలతో కుమ్మక్కై కారుచౌకగా భూములు తీసుకునేం దుకు యత్నిస్తోంది. ఎకరాకు రూ.4.60 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. దీనిపై తహసీల్దారు పద్మావతిని వివరణ కోరగా.. 'పరిశ్రమకు భూములు కేటాయించడంపై రెండేళ్ల కిందటే ప్రతిపాదనలు పంపాం. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదు' అని వివరించారు.


**పారిశ్రామికవాడలున్నా..**మాచవరానికి 6 కి.మీ. దూరంలోని మేనకూరు, అత్తివరం పారిశ్రామికవాడల్లో రసాయన పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐఐసీ భూములను ప్రత్యేకంగా అభివృద్ధి చేసింది. రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ డెస్క్ విధానంలో అనుమతులు, రాయితీలు ఇస్తోంది. వీటిని వదిలిపెట్టి మేత పోరంబోకు భూములు అడగడాన్ని స్థానికులు తప్పుబడుతున్నారు.

# ఎస్వీయూ దూరవిద్య పరీక్షలపై సందిగ్ధం

తిరుపతి : ఎస్వీయూ దూరవిద్య విభాగంలో ఏంజరుగుతుందో అర్థంకాని పరిస్థితిలో విద్యార్థులు సతమతమవుతున్నారు. అసలే పరీక్షలు జరగక ప్రవేశాలు లేక విభాగం మూడేళ్లుగా విద్యార్థులకు దూరంగా ఉంటోంది. 32,500 వేల మంది పరీక్షలు రాయలేక సతమతవుతున్నారు. ఇటీవల యూజీసీ నిపుణుల కమిటీ దూరవిద్య కేంద్రాన్ని సందర్శించింది. వసతులు, సౌకర్యాలు, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై పరిశీలించి వెళ్లింది. ఇదిలా ఉండగా ఫిబ్రవరి మూడో తేదీ నుంచి పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించారు. గతంలో 43 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా వాటిని ఈ పర్యాయం 46కు పెంచినట్లు సమాచారం. అయితే ప్రైవేటు కళాశాలల్లో పరీక్షలు నిర్వహించడంపై అనేక ఆరోపణలున్నాయి. వాటిలో వసతులు లేవని, నిర్వహణ ప్రక్రియ యూజీసీ నిబంధనలకు అనుగుణంగా జరగడం లేదంటూ విద్యార్థి నేతలు ఫిర్యాదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలిని కలిసి ఉల్లంఘనలు ప్రస్తావించారు. దీంతో ఎస్వీయూ వీసీ, రిజిస్ట్రార్‌తో ఆయా పరీక్ష కేంద్రాల కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లతో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. పరీక్షలు అనుకున్న ప్రకారం నిర్వహిస్తారా లేక మళ్లీ వాయిదా పడతాయా అన్నది తేలాల్సి ఉంది. మొత్తం మీద ప్రభుత్వ పాలకుల తప్పిదాలు విద్యార్థుల పాలిట శాపంగా మారాయి.

## భర్తను మిస్ అయినప్పుడు రకుల్ ఏం చేస్తుందో చూడండి..!

హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ గత ఏడాది ఫిబ్రవరి 21న ప్రియుడు జాకీ భగ్నానితో వివాహ బంధంలో అడుగు పెట్టింది. ఇటీవలే రకుల్ ప్రీత్‌సింగ్, జాకీ భగ్నాని మొదటి వివాహ వార్షికోత్సవం జరుపుకున్నారు. గతంలో మాదిరిగా రకుల్ ప్రీత్ సింగ్ వరుస సినిమాలతో బిజీగా లేదు. టాలీవుడ్‌లో ఈ అమ్మడు సినిమాలు చేయడం లేదు. కానీ బాలీవుడ్‌లో మాత్రం ఈ అమ్మడికి ఆఫర్లు దక్కాయి. ఇటీవలే ఈ అమ్మడు మేరే హస్బెండ్ కీ బివి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమా ఇంకా థియేటర్‌లోనే ఉంది. అప్పుడే మరో సినిమా షూటింగ్‌లో రకుల ప్రీత్ సింగ్ పాల్గొంటుంది. హిందీ సినిమా దే దే ప్యార్ దే 2 సినిమా షూటింగ్ నిర్మాణ దశలో ఉంది. ఇటీవల రకుల్ ప్రీత్ సింగ్ ఆసక్తికర పోస్ట్ షేర్ చేసింది. గత కొన్ని రోజులుగా మేరే హస్బెండ్ కీ బివి సినిమాకు సంబంధించిన విషయాలను షేర్ చేస్తూ ప్రమోట్ చేస్తూ వచ్చిన రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా భర్తను మిస్ అవుతున్నట్లు పోస్ట్ షేర్ చేసింది. ఎప్పుడైనా భర్తను మిస్ అయితే అతడి జాకెట్‌ను ధరించాలంటూ సూచించింది. షూటింగ్ కారణంగా జాకీ భగ్నానిని మిస్ అవుతున్నట్లు పేర్కొన్న రకుల్ ప్రీత్ సింగ్ అతడి జాకెట్ ధరించింది. ఆ జాకెట్‌పై జేబీ అని రాసి ఉంది. జాకీ భగ్నానిని సుదీర్ఘ కాలం పాటు ప్రేమించిన రకుల్ ప్రీత్ సింగ్ గత ఏడాది అతడితో మూడు ముడులు వేయించుకుని, ఏడు అడుగులు నడిచిన విషయం తెల్సిందే. 2021లో నటుడు,




నిర్మాత అయిన జాకీ భగ్నానితో తాను రిలేషన్‌లో ఉన్నట్లు రకుల్ ప్రీత్ సింగ్ అధికారికంగా ప్రకటించింది. అంతుకు ముందు నుంచే వీరిద్దరి మధ్య రిలేషన్ కొనసాగుతుంది అనే వార్తలు వచ్చాయి. ప్రేమ విషయం అధికారికంగా ప్రకటించిన మూడు సంవత్సరాల తర్వాత పెళ్లి పీటలు ఎక్కింది. ఆ మధ్య రకుల్ ప్రీత్ సింగ్ కెరీర్ ఖతం అని అంతా అనుకున్నారు. కానీ అనూహ్యంగా బాలీవుడ్‌లో వరుస సినిమాల్లో ఆఫర్లు లభిస్తున్నాయి. దాంతో ఈ అమ్మడు మరికొన్నాళ్ల పాటు హీరోయిన్‌గా బిజీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. తాజాగా మేరే హస్బెండ్ కీ బివి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రకుల్‌కి నిరాశ మిగిలింది. ప్రస్తుతం చేస్తున్న దే దే ప్యార్ దే 2 సినిమాతో అయినార కుల్ ప్రీత్ సింగ్‌కి హిట్ దక్కేనా చూడాలి. బాలీవుడ్‌లో ఒక్క హిట్ పడితేనే ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్ బాలీవుడ్‌లో మరికొన్ని సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటుంది. తద్వారా ఈ అమ్మడికి టాలీవుడ్, కోలీవుడ్‌లోనూ ముందు ముందు ఆఫర్లు దక్కే అవకాశాలు ఉన్నాయని ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రకుల్ ప్రీత్ సింగ్ టాలీవుడ్‌లో ఒకానొక సమయంలో స్టార్ హీరోలకు సైతం డేట్లు ఇవ్వలేనంత బిజీగా సినిమాలు చేసింది. కానీ కొన్నాళ్లకే కనిపించకుండా పోయింది. బాలీవుడ్‌లో అయినా ఈ అమ్మడికి లక్ కలిసి వస్తుందా అనేది చూడాలి.

## కొత్త ఇన్నింగ్స్‌కి సిద్ధమవుతున్న పీసీ

గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా ప్రస్తుతం హాలీవుడ్ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉంది. ఇటీవలే ఈ అమ్మడు తెలుగులో రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు హీరోగా రూపొందుతున్న సినిమాకు ఓకే చెప్పిన విషయం తెల్సిందే. ఆ సినిమా కాకుండా మరే ఇండియన్ మూవీస్‌లోనూ ఈ అమ్మడు నటించడం లేదు. హాలీవుడ్‌లో ఈమె సినిమాలతో పాటు, వెబ్ సిరీస్‌ల్లోనూ నటిస్తుంది. ముఖ్యంగా ప్రియాంక చోప్రా నటించిన హాలీవుడ్ వెబ్ సిరీస్ సిటాడెల్‌కి మంచి స్పందన వచ్చింది. దాంతో ప్రియాంక చోప్రా మరిన్ని వెబ్ సిరీస్‌లను చేసే అవకాశాలు ఉన్నాయి. ప్రియాంక చోప్రా దారిలోనే ఆమె కజిన్ పరిణీతి చోప్రా (పీసీ) సైతం వెబ్ కంటెంట్‌లో అరంగేట్రంకి సిద్ధం అవుతుంది. ఇటీవల 'చంకీలా' సినిమాతో ఓటీటీ ప్రేక్షకుల ముందుకు పరిణీతి చోప్రా వచ్చింది. థియేట్రికల్ రిలీజ్‌ను స్కిప్ చేసిన మేకర్స్ నేరుగా ఓటీటీ ద్వారా చంకీలా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు. ఇంతియాజ్ అలీ దర్శకత్వంలో వచ్చిన అమర్ సింగ్ చంకీలా సినిమా నెట్ ఫ్లిక్స్‌లో సెన్సేషల్ విజయాన్ని సొంతం చేసుకున్న



నేపథ్యంలో ముందు ముందు మరిన్ని వెబ్ కంటెంట్‌లో నటించాలనే ఉద్దేశంతో పరిణీతి చోప్రా ఉందని తెలుస్తోంది. అందుకే ఇటీవల సోను రజ్దాన్, జెన్నిఫర్ వింగెట్‌లతో ఒక మిస్టరీ థ్రిల్లర్ వెబ్ సిరీస్‌లో నటించేందుకు సిద్ధం అయింది. పరిణీతి చోప్రా బాలీవుడ్‌లో అడుగు పెట్టి చాలా సంవత్సరాలు అయింది. ఈమెతో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మలు టాప్ స్టార్ హీరోయిన్స్‌గా పేరు దక్కించుకున్నారు. కానీ ఈమెకు మాత్రం ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కలేదు. స్టార్ హీరోయిన్‌లతో పోటీలో ఈమె వెనుక పడింది. పెద్ద సినిమాల్లో ఈమెకు ఆఫర్లు దక్కలేదు. చేసిన సినిమాలు కొన్ని బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సొంతం చేసుకోలేదు. దాంతో అమర్ సింగ్ చంకీలా ప్రాజెక్ట్‌తో ఓటీటీలో అడుగు పెట్టింది. తక్కువ సమయంలోనే ఈ అమ్మడు ఓటీటీలో మంచి పాపులారిటీని సొంతం చేసుకుంది. అందుకే వెండి తెరపై దక్కని గుర్తింపును ఓటీటీ ద్వారా ఈ అమ్మడు దక్కించుకునే ప్రయత్నాలు చేస్తుంది. అమర్ సింగ్ చంకీలా సినిమాతో వచ్చిన ఓటీటీ గుర్తింపును సద్వినియోగం చేసుకోవడం కోసం వెంటనే వెబ్ సిరీస్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మిస్టరీ థ్రిల్లర్ వెబ్ సిరీస్‌లో పరిణీతి చోప్రాతో పాటు హర్లీన్ సేథి, తాహిర్ రాజ్ భాసిన్, అనుప్ సోని, సుమీత్ వ్యాస్, చైతన్య చౌదరి వంటి ప్రముఖ నటీనటులు నటిస్తున్నారు. ఈ వెబ్ సిరీస్‌పై పరిణీతి చాలా ఆశలు పెట్టుకుంది. వెబ్ సిరీస్‌లు, వెబ్ మూవీస్‌తో ఆకట్టుకుని ఆ తర్వాత తిరిగి సినిమాల్లో నటించి వెండి తెరపై స్టార్‌డం దక్కించుకోవాలని ఈ అమ్మడు ఆశ పడుతోంది. మరి పరిణీతి చోప్రా కొత్త ఇన్నింగ్స్ ఎంత వరకు సక్సెస్ అవుతుందో చూడాలి.




## రమణ గోగుల.. వన్ మోర్ సాంగ్




సీనియర్ సింగర్ రమణ గోగుల రీసెంట్ గా సెకండ్ ఇన్నింగ్స్.. గ్రాండ్ గా స్టార్ట్ చేసిన విషయం తెలిసిందే. సంక్రాంతి కానుకగా రిలీజ్ అయిన సంక్రాంతికి వస్తున్నాం మూవీలోని గోదారి గట్టు మీద సాంగ్ ను పాడి ఓ రేంజ్ లో అలరించారు. ముఖ్యంగా.. చెప్పాలంటే ఆ సాంగ్ తోనే మూవీ స్టార్టింగ్ లో ఫుల్ పాపులర్ అయింది. ఇప్పుడు మ్యూజిక్ సెన్సేషన్ రమణ గోగుల పాడిన మరో సాంగ్.. మహా శివరాత్రి కానుకగా రిలీజ్ చేసింది. నారి మూవీ నుంచి 'గుండెలోన ఏదో గట్టి సప్పుడైనదే' సాంగ్ ను మేకర్స్ బుధవారం ఉదయం విడుదల చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో నారి మూవీ కొత్త పాట.. ఫుల్ గా వైరల్ అవుతోంది.

అందరినీ ఆకట్టుకుంటోంది. మహిళల్ని గౌరవించాలి, ఆడపిల్లలు అన్ని రంగాల్లో ఎదిగేందుకు సహకరించాలి, ఇప్పుడున్న సామాజిక పరిస్థితుల్లో 13-20 ఏళ్ల పిల్లలు ప్రమాదంలో ఉన్నారనే పాయింట్లతో తెరకెక్కిన మూవీ నారి. ఆమని, వికాస్ వశిష్ట, మౌనిక రెడ్డి, ప్రగతి, సునయన, కేదార్ శంకర్, ప్రమోదిని సహా పలువురు నటీనటులు.. కీలక పాత్రల్లో కనిపించనున్నారు. శశి వంటిపల్లి నిర్మించిన ఆ సినిమా.. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 7న గ్రాండ్ గా థియేటర్స్ లో రిలీజ్ కానుంది. ఇప్పుడు ప్రమోషన్స్ లో భాగంగా మేకర్స్.. గుండెలోన ఏదో గట్టి సప్పుడైనదే పాటను రిలీజ్ చేశారు. వికాస్ వశిష్ట, మౌనిక రెడ్డిపై షాట్ చూసిన ఆ పాటను వినోద్ కుమార్ విన్ను బ్యూటిఫుల్ గా కంపోజ్ చేశారు. రమణ గోగుల తన గాత్రంతో మరోసారి ఆకట్టుకున్నారు. హుషారైన వాయిస్ తో మెప్పించారు. దీంతో ఈ సాంగ్ కూడా మంచి హిట్ అయ్యే అవకాశాలు కనిపిస్తోంది. అయితే సాంగ్ బాగుందని మ్యూజిక్ లవర్స్ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. రమణ గోగుల వాయిస్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలుస్తుందని చెబుతున్నారు. అయితే నారి మూవీ నుంచి ఇప్పటికే పలు సాంగ్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'ఈడు మగాడేంట్రా బుజ్జి..', 'నిశిలో శశిలా..' పాటలు మంచి రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. ఆర్పీ పట్నాయక్, సునీత, చిన్మయి శ్రీపాద వంటి పలువురు స్టార్ సింగర్స్.. సినిమాలో భాగమయ్యారు. ఇప్పుడు రమణ గోగుల కూడా ఓ సాంగ్ ను ఆలపించారు. మరి మరికొద్ది రోజుల్లో రిలీజ్ కానున్న నారి మూవీ ఎలాంటి హిట్ అవుతుందో వేచి చూడాలి.

## ప్రభాస్ వల్ల కాలేదు.. తారక్ వల్ల అవుతుందా?




గత దశాబ్ద కాలంలో మన హీరోలు ఒక్కొక్కరుగా మార్కెట్ పరంగా తెలుగు రాష్ట్రాల బౌండరీలు దాటేశారు. మన స్టార్ల సినిమాలు పాన్ ఇండియా స్థాయిలో బాగా ఆడుతున్నాయి. కొందరు స్టార్లు విదేశాల్లో కూడా బాగా ఫాలోయింగ్ పెంచుకున్నారు. యుఎస్‌లో తెలుగు హీరోలకు ఎప్పట్నుంచో మార్కెట్ ఉంది. ఐతే కొన్ని సినిమాలు ఎవ్వరూ ఊహించని కొత్త మార్కెట్లలోకి కూడా చొచ్చుకెళ్లాయి. అలా తెలుగు సినిమాలకు మార్కెట్ ఓపెన్ అయిన దేశాల్లో జపాన్ ఒకటి. ఇక్కడ 'బాహుబలి' సినిమా అదరగొట్టింది. దీని తర్వాత 'ఆర్ఆర్ఆర్' ఇంకా పెద్ద విజయం సాధించింది.

అక్కడ ఇండియన్ సినిమాలకు సంబంధించి అన్ని రికార్డులనూ అది బద్దలు కొట్టేసింది. ఇవి రెండూ రాజమౌళి సినిమాలే అన్న సంగతి తెలిసిందే. ఐతే 'బాహుబలి' హీరో ప్రభాస్ నుంచి వచ్చిన చివరి సినిమా 'కల్కి'ని జపనీస్‌లో అనువదించి బాగా ప్రమోట్ చేసి రిలీజ్ చేశారు. కానీ అది అక్కడ ఆశించిన ఫలితం అందుకోలేకపోయింది. రిలీజ్ తర్వాత దాని గురించి పెద్దగా డిస్కషనే లేదు ఐతే ఇప్పుడు జపాన్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి జూనియర్ ఎన్టీఆర్ రెడీ అవుతున్నాడు. తన చివరి సినిమా 'దేవర' జపనీస్‌లో మార్చి 28న రిలీజ్ కాబోతోంది. ఈ నేపథ్యంలో టీం ప్రమోషన్లు మొదలుపెట్టింది. తాజాగా తారక్ జపాన్ అభిమానులతో ఆన్ లైన్లో వీడియో చిట్ చాట్ చేశాడు. త్వరలోనే తారక్ జపాన్‌కు వెళ్లి సినిమాను ప్రమోట్ చేయనున్నాడట. తారక్ 'ఆర్ఆర్ఆర్' చేయడానికి ముందే జపాన్‌లో కొంత గుర్తింపు సంపాదించాడు. అక్కడ్నుంచి తన కోసం ఫ్యాన్స్ ఇండియాకు వస్తుంటారు కూడా. ఐతే 'కల్కి' లాంటి విజువల్ వండర్‌నే జపాన్ ప్రేక్షకులు పట్టించుకోని నేపథ్యంలో 'దేవర' లాంటి మామూలు సినిమా అక్కడ ఆశించిన ఫలితాన్నందుకుంటుందా అన్నది సందేహం.

తారక్ అక్కడ మార్కెట్ పెంచుకోవాలనుకుంటే.. ఇంకేదైనా పెద్ద ఈవెంట్ మూవీతో వెళ్లాలి. 'దేవర' తెలుగు ప్రేక్షకుల నుంచే మిశ్రమ స్పందన తెచ్చుకుంది. విదేశాల్లో సత్తా చాటేంత కంటెంట్ ఉన్న సినిమా అయితే కాదది. మరి 'బాహుబలి'తో వచ్చిన ఫాలోయింగ్‌తో ప్రభాస్ 'కల్కి'ని జపాన్ ప్రేక్షకులకు చేరువ చేయలేకపోయిన నేపథ్యంలో.. 'ఆర్ఆర్ఆర్'తో వచ్చిన ఫేమ్‌ను ఉపయోగించుకుని 'దేవర'ను తారక్ ఎంతమేర జపాన్‌లో సేల్ చేయగలడో చూడాలి.

## డెకాయిట్ షూటింగ్ అప్డేట్ ఇచ్చిన మృణాల్

సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిరస్థానాన్ని సంపాదించుకున్న మృణాల్ ఠాకూర్ మొదటి సినిమాతోనే మంచి సక్సెస్ అందుకుంది. అయితే మృణాల్ చివరగా విజయ్ దేవరకొండతో కలిసి ఫ్యామిలీ స్టార్ సినిమాతో ఆడియన్స్ ను పలకరించింది. ప్రస్తుతం మృణాల్ అడివి శేష్ తో కలిసి డెకాయిట్ సినిమాలో నటిస్తోంది. ఈ సినిమాలో మృణాల్ ఫస్ట్ లుక్ ను చూసి అందరూ ఆశ్చర్యపోయారు. మృణాల్ ఫస్ట్ లుక్ తర్వాత డెకాయిట్ నుంచి ఎలాంటి అప్డేట్ వచ్చింది లేదు. దీంతో ఈ సినిమా అప్డేట్స్ తెలుసుకోవాలని ఆడియన్స్ ఎంతో ఆసక్తిగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే మృణాల్ డెకాయిట్ గురించి అప్డేట్ ఇచ్చింది. పేపర్ వెయిట్‌ను చేత్తో గుండ్రంగా తిప్పుతూ తాను డెకాయిట్ షూట్ లో ఉన్న విషయాన్ని వెల్లడించింది మృణాల్. ఇప్పటివరకు రొమాంటిక్, ఫ్యామిలీ డ్రామా సినిమాల్లో నటించిన మృణాల్ కు ఈ సినిమా పూర్తి భిన్నంగా ఉండనుంది. మృణాల్ నటిస్తున్న మొదటి థ్రిల్లర్ సినిమా డెకాయిట్.



ఫస్ట్ లుక్ లో మృణాల్ ను చూసి షాకైన అభిమానులు ఈ యాక్షన్ థ్రిల్లర్ లో అమ్మడిని ఎప్పుడెప్పుడు చూస్తామా అని ఎదురుచూస్తున్నారు. పోస్టర్ లో మృణాల్ లుక్ చాలా భీకరంగా కనిపించడంతో డెకాయిట్ పై ఉన్న అంచనాలు మరింత పెరిగాయి. ఇదిలా ఉంటే డెకాయిట్ మూవీతో షానీల్ డియో దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం కాబోతున్నాడు. సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతుంది. తనకు ద్రోహం చేసిన తన ఎక్స్ లవర్ పై ప్రతీకారం తీర్చుకునే కోపంతో ఉన్న దోషి కథగా డెకాయిట్ ఉండబోతుంది. ఈ సినిమాపై అడివి శేష్, మృణాల్ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాస్తవానికి ఈ సినిమా ముందుగా శృతి హాసన్ దగ్గరకు వెళ్లింది. టీజర్ కూడా రిలీజ్ చేసిన తర్వాత కొన్ని కారణాల వల్ల శృతి తప్పుకోవడంతో ఆ ప్లేస్‌లోకి మృణాల్ వచ్చింది.

## ది ఐ ట్రైలర్ టాక్..!

సౌత్ స్టార్ హీరోయిన్ శృతి హాసన్ తన మొదటి హాలీవుడ్ సినిమాగా ది ఐ చేస్తుంది. కొన్నాళ్లుగా సైలెంట్ గా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా నుంచి లేటెస్ట్ గా ట్రైలర్ రిలీజైంది. ది ఐ ట్రైలర్ చూస్తే ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్ గా అనిపిస్తుంది. ది ఐ ట్యాగ్ లైనే చావు అన్నదే ఎండ్ కాకపోతే ఏం జరుగుతుంది అన్నది పెట్టారు. హ్యాపీగా బోయ్ ఫ్రెండ్ తో ఎంజాయ్ చేస్తున్న శృతి హాసన్ లైఫ్ ఒక్కసారిగా తలకిందులు అవుతుంది. అంతేకాదు ఎవరో తనని చూస్తున్నట్టు ఆమెకు అనిపిస్తుంది. ఇంతకీ అసలు ఏం జరుగుతుంది.. దీని వెనుక ఉన్నది ఎవరు.. వాటికి కారణాలు ఏంటి తెలియాలంటే ది ఐ చూడాల్సిందే. ది ఐ సినిమాలో మార్క్ రౌలే శృతికి జోడీగా నటిస్తున్నాడు. ఈ సైకలాజికల్ థ్రిల్లర్ ట్రైలర్ మాత్రం ఇంప్రెసివ్ గా ఉంది. ముందుగా శృతి హాసన్ లుక్ అప్పియరెన్స్ అంతా పర్ఫెక్ట్ గా అనిపించింది. శృతి హాసన్ ఈమధ్య సౌత్ సినిమాలు తగ్గించింది. ఐతే హాలీవుడ్ సినిమాకు అమ్మడికి మంచి పేరు వచ్చేలా ఉంది. ది




ఐ సినిమాను డాఫ్నె షోమాన్ డైరెక్ట్ చేయగా ఎమిలీ కార్ల్ టన్ ఈ సినిమా కథ అందించారు. ఇలాంటి సైకలాజికల్ థ్రిల్లర్ సినిమాలు ముఖ్యంగా హాలీవుడ్ లో ఎన్నొచ్చినా వేటికవే ప్రత్యేకంగా ఉంటాయి. ఐతే శృతి హాసన్ ఈ సినిమాలో నటించడం ప్రత్యేకంగా ఉంది. మరి శృతి హాసన్ హాలీవుడ్ ఎంట్రీ ఎలాంటి రిజల్ట్ అందిస్తుంది అన్నది చూడాలి. ప్రతి హీరోయిన్ ఫైనల్ గా హాలీవుడ్ సినిమాలో నటించాలన్న డ్రీం ఉంటుంది. బహుశా శృతి హాసన్ కి ది ఐ తో ఆ కల నెరవేరిందని చెప్పొచ్చు. సినిమా సైకలాజికల్ థ్రిల్లరే అయినా శృతి హాసన్ ఫ్యాన్స్ కోరుకునే బోల్డ్ అంశాలు కూడా ఉన్నట్టు తెలుస్తుంది. త్వరలో రిలీజ్ కాబోతున్న ది ఐ సినిమా శృతి హాసన్ కి హాలీవుడ్ లో సూపర్ హిట్ తో వెల్కం చెబుతుందా లేదా అన్నది చూడాలి. ఐతే శృతి మాత్రం ఈ సినిమాకు ది బెస్ట్ ఎఫర్ట్ పెట్టినట్టు అనిపిస్తుంది. మరి రిజల్ట్ ఆమెకు సంతృప్తికరంగా ఉంటుందా లేదా అన్నది చూడాలి.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536